గురువారం
12•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 257
• పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




## మహాబావి నుంచి మరో ప్రస్థానం




కాళేశ్వరం.. కథలు
Success of Telangana

# ఎగిరి దుంకింది గోదావరి

ఎక్కడో వంద మీటర్ల ఎత్తు వద్ద ప్రస్థానం ప్రారంభించి.. సుమారు 318 మీటర్ల ఎగువనున్న శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎగిసిపడిన కాళేశ్వరగంగ.. మరో జలవిన్యాసం ప్రదర్శించింది! ఎస్సారార్ నుంచి ఆసియాలోనే అతిపెద్ద సర్జ్‌పూల్ ఒడిలో చేరిన గోదావరి.. ఆ మహాబావి నుంచి 102 మీటర్ల ఎత్తుకు ఎగిసి.. అన్నపూర్ణ జలాశయంలోకి దుంకడం ద్వారా మరో ప్రస్థానానికి నాందిపలికింది.

మరో పక్షంలో మిగిలిన ఐదుదశల్లోనూ జలాలను ఎత్తిపోయటంద్వారా బేసిన్‌లోనే గరిష్ఠస్థాయిలో.. సముద్రమట్టానికి సుమారు 614 మీటర్ల ఎత్తులో ఉన్న కొండపోచమ్మ సిగలోకి చేరేందుకు సింగారించుకుంటున్నది! లక్ష్మీబరాజ్ నుంచి దాదాపు 290 కిలోమీటర్ల దూరంలోని కొండపోచమ్మ జలాశయంలోకి ఈ నెల 25వ తేదీకల్లా కాళేశ్వరం జలాలు చేరే అవకాశం ఉన్నది.



బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్ నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి దుంకుతున్న కాళేశ్వర గంగ

3

## అన్నపూర్ణలోకి చేరిన కాళేశ్వర గంగ

ఇక రంగనాయక సాగర్‌కు.. ఆపై కొండపోచమ్మకు

- ఎస్సారార్ నుంచి నాలుగో ప్రస్థానం ప్రారంభం
- తిప్పాపూర్‌లో మొదటి మోటర్ ట్రయల్‌రన్ సక్సెస్
- నేటి సాయంత్రంలోగా రెండో మోటర్‌తో ఎత్తిపోత
- రెండురోజుల్లో నాలుగు మోటర్ల వెట్‌రన్ నిర్వహణ
- 4వ లింకు పరిధిలో 5.90 లక్షల ఎకరాల ఆయకట్టు

## త్వరలో ఫలక్‌నుమా మెట్రో పనులు

- ఈ మార్గంలోని ప్రభావిత కట్టడాల గుర్తింపు
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఐటీశాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు విజయవంతమైందని ఐటీ, పరిశ్రమల, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రోరైలు నిర్మాణ పనులను త్వరలో చేపడుతామని చెప్పారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు అహ్మద్ పాషాఖాద్రీ, కేపీ వివేకానంద అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానం ఇస్తూ.. ఓల్డ్‌సిటీలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5 కి.మీ. మేర మెట్రోకారిడార్ -2 పనుల నిర్వహణ చేపట్టామని

మిగతా 4వ పేజీలో

## ఆర్టీసీలో సమ్మెకాలానికి జీతాలు

రూ.235 కోట్లు విడుదల • త్వరలోనే ఉద్యోగుల ఖాతాల్లోకి 2
డిపోలవద్ద హర్షాతిరేకాలు • సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు




- సాధారణ వీసాలన్నీ ఏప్రిల్ 15 వరకు నిలిపివేత
- రేపటినుంచి వర్తింపు
- బ్రిటిష్‌పాలనాకాలం నాటి అంటువ్యాధి చట్టం అమలు

## వీసాలు రద్దు

కరోనా కట్టడికి కేంద్రం అనూహ్య నిర్ణయం ■ దేశంలో 60 పాజిటివ్ కేసులు

న్యూఢిల్లీ/బీజింగ్, మార్చి 11:

దేశంలో కరోనా (కొవిడ్-19) కేసుల సంఖ్య పెరుగుతుండటంతో సుమారు నెలపాటు సాధారణ వీసాలన్నింటిని రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. దౌత్య, అధికార, ఐరాస, అంతర్జాతీయ సంస్థలు, ఉద్యోగుల, ప్రాజెక్టు వీసాలు తప్ప సాధారణ వీసాలన్నింటిని ఏప్రిల్ 15 వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపింది. శుక్రవారం నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది. కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ నేతృత్వంలో జరిగిన కేంద్ర మంత్రుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రవాస భారతీయులకు (ఓసీఐ కార్డుదారులకు) కల్పించిన వీసా రహిత పర్యాటక సౌకర్యాన్ని ఏప్రిల్ 15 వరకు నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 15 తర్వాత చైనా, ఇటలీ, ఇరాన్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ నుంచి వచ్చిన లేదా ఆయా దేశాలను సందర్శించిన విదేశీ పర్యాటకులు, భారతీయులను 14 రోజులపాటు వేరుగా (క్వారంటైన్‌లో) ఉంచనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ క్రూయిజ్ నౌకలు, సిబ్బంది, ప్రయాణికుల ప్రవేశంపై మార్చి 31 వరకు నిషేధం విధిస్తున్నట్లు కేంద్ర నౌకాయాన మంత్రిత్వశాఖ పేర్కొన్నది. అలాగే అంతర్జాతీయ క్రూయిజ్ నౌకలను థర్మల్ స్క్రీనింగ్ ఏర్పాటున్న పోర్టుల్లోకి మాత్రమే అనుమతిస్తామని, సిబ్బంది, ప్రయాణికులు తమ వివరాలను స్వీయ పత్రంలో పేర్కొని పోర్టు ఆరోగ్య అధికారికి

మిగతా 5వ పేజీలో


## మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి

2

వైస్‌చైర్మన్‌గా బీ రాజశేఖర్ • పాలకమండలి ఏకగ్రీవం

## బీజేపీ గూటికి సింధియా

జ్యోతిరాదిత్యకు వెంటనే రాజ్యసభ సీటు ఖరారు 5








బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నీలిమ దంపతుల కుమారుడు అనురాగ్.. కందికట్ల లక్ష్మి, కృష్ణారెడ్డి దంపతుల కుమార్తె సంజన వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్నముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, శోభ దంపతులు.



బుధవారం జలవిహార్‌లో జరిగిన జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ పీఏ విక్రమ్ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ఎంపీ సంతోష్‌కుమార్, ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# మార్క్‌ఫెడ్ పాలకమండలి ఏకగ్రీవం

- చైర్మన్‌గా ఎం గంగారెడ్డి, వైస్‌చైర్మన్‌గా బీ రాజశేఖర్ ఎన్నిక
- అభినందించిన సీఎం కేసీఆర్, పలువురు ప్రజాప్రతినిధులు



ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న మార్క్‌ఫెడ్ నూతన చైర్మన్ గంగారెడ్డి. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మార్క్‌ఫెడ్ పాలకమండలి ఎన్నిక ఏకగ్రీవమైంది. చైర్మన్‌గా నిజామాబాద్ జిల్లా అంకాపూర్ పీఏసీఎస్ చైర్మన్ ఎం గంగారెడ్డి, వైస్‌చైర్మన్‌గా ఖమ్మం జిల్లా వైరా పీఏసీఎస్ చైర్మన్ బీ రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని మార్క్‌ఫెడ్ భవన్‌లో పాలకవర్గం ఎన్నికను రాష్ట్ర సహకారశాఖ ఎన్నికల అథారిటీ నిర్వహించింది. ఉదయం 10 గంటలకు చైర్మన్ స్థానానికి గంగారెడ్డి, వైస్‌చైర్మన్ స్థానానికి రాజశేఖర్ మాత్రమే నామినేషన్లు దాఖలుచేశారు. చైర్మన్, వైస్‌చైర్మన్ స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అథారిటీ జాయింట్ సెక్రటరీ అరుణ ప్రకటించారు. ఎన్నిక అనంతరం మార్క్‌ఫెడ్ చైర్మన్, వైస్‌చైర్మన్లు ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ వారిని అభినందించారు. మంత్రి కేటీఆర్‌ను కూడా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వీరిని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.



మార్క్‌ఫెడ్ వైస్‌చైర్మన్ బీ రాజశేఖర్

# వరంగల్‌కు మోనో, మెట్రో రైలు

- ప్రతిపాదనలు సిద్ధంచేయండి
- మామునూర్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- పురపాలకశాఖ మంత్రి కేటీఆర్
- హైదరాబాద్‌లో వరంగల్ ప్రతినిధులతో భేటీ
- కుడా మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం



బుధవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఐటీ, మున్సిపల్‌శాఖల మంత్రి కే తారకరామారావు. చిత్రంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరంగల్ నగరంలో 15 కిలోమీటర్ల మేర మోనో రైలుతోపాటు హైదరాబాద్ తరహాలో మెట్రోరైలు ప్రతిపాదనలను సిద్ధంచేయాలని ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు.. అధికారులను ఆదేశించారు. మామునూర్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని తెలిపారు. దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా సూత్రప్రాయంగా అంగీకరించినట్టు వెల్లడించారు. బుధవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల సమక్షంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) మాస్టర్‌ప్లాన్‌కు ఆమోదం తెలిపారు. ప్లాన్ ఫైల్‌పై సంతకం చేశారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. 2020-2041 వరకు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈ మాస్టర్ ప్లాన్‌తో వరంగల్ మహానగరానికి మహర్దశ పట్టనున్నదని చెప్పారు. అన్నిరంగాల్లో వరంగల్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధంచేసి, పనులు వేగంగా పూర్తిచేయాలన్నారు. వరంగల్‌కు మంజూరైన 68 కి.మీ. రింగ్‌రోడ్డులో 29 కి.మీ. మేర పనులను మేనెల చివరినాటికి పూర్తిచేసి, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వరంగల్ స్మార్ట్‌సిటీ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా నగరంలో దసరాలోపు 1000 పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణాలను పూర్తిచేయాలని చెప్పారు. పందుల నివారణకు పటిష్ఠ ప్రణాళిక రూపొందించాలని, ప్రజాప్రతినిధులు జోక్యంచేసుకొని పెంపకందార్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని సూచించారు.

### దసరానాటికి 3900 డబుల్ బెడ్‌రూంలు

సీఎం కేసీఆర్ వరంగల్‌కు వచ్చిన సందర్భంగా ఇచ్చిన హామీలను వేగంగా అమలుచేయాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. 3,900 డబుల్ బెడ్‌రూంలను మంజూరుచేశారని, వీటిని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని చెప్పారు. ఇప్పటికే పూర్తయిన 900 ఇండ్లను త్వరలో ప్రారంభించాలని, దసరానాటికి మిగతావాటి నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించారు. కాళోజీ కళాక్షేత్రం, ఏకశిలా పార్కు నిర్మాణం, జంక్షన్ల అభివృద్ధి, రోడ్లవిస్తరణ పనులు కూడా వేగంగా చేపట్టాలని సూచించారు. శానిటేషన్ ప్రణాళికలను, గ్రీనరీప్లాన్ తయారుచేయాలన్నారు. నగరానికి నాలుగువైపుల డంపింగ్ యార్డులను గుర్తించాలని చెప్పారు.

### శివారుప్రాంతాలకు మూడోవంతు నిధులు

శివారు ప్రాంతాల అభివృద్ధి జరిగేలా కార్పొరేషన్ బాధ్యత తీసుకోవాలని మంత్రి కేటీఆర్ సూచించారు. కార్పొరేషన్‌లో కలిసిన శివారు ప్రాంతాలకు ఆ కార్పొరేషన్ బడ్జెట్‌లో మూడోవంతు నిధులు కేటాయించి ఖర్చుచేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని, కచ్చితంగా దీన్ని అమలుచేయాలన్నారు. ఈ నెల 16న మరోసారి సమావేశమై ముఖ్యమైన అంశాలపై చర్చిస్తామని, అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, టీ రాజయ్య, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, ఆరూరి రమేశ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సీడీఎంఏ సత్యనారాయణ, వరంగల్ అర్బన్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, వరంగల్ కమిషనర్ పమేలా శత్పథి, ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, కుడా చీఫ్ ప్లానర్ అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మనమంతా ఒక్కటే

- ఈ సందేశం దేశ ప్రజలకు పంపించాలి
- లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత నామా నాగేశ్వరరావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



మనమంతా ఒక్కటే, దేశమంతా ఒక్కటే, భారతీయులం అంతా కలిసిమెలిసి ఉన్నామనే సందేశాన్ని పార్లమెంట్ వేదికగా ప్రజలకు పంపించాల్సిన అవసరం ఉన్నదని లోక్‌సభలో టీఆర్‌ఎస్‌పక్ష నేత నామా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం లోక్‌సభలో ఢిల్లీ అల్లర్లపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభకు అన్నివర్గాలు, మతాల వ్యక్తులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, దేశంలో కూడా అన్నిమతాలు, కులాలవారు నివసిస్తున్నారని చెప్పారు. ఒక విషయంపై మాట్లాడుతున్నప్పుడు భిన్నాభిప్రాయాలకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత మనపైనే ఉన్నదన్నారు. ఢిల్లీ ఘటన చర్చ సమయంలో కొందరు సభ్యులపై తీసుకొన్న చర్యల విషయంలో పునరాలోచించాలని స్పీకర్‌ను కోరారు. పెద్ద మనసుతో సభ్యులపై విధించిన సస్పెన్షన్‌ను రద్దుచేయాలన్నారు.

### అగ్నిప్రమాదాలపై సమాచారమిస్తున్నాం..

అడవుల్లో చెలరేగుతున్న మంటల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆయా రాష్ట్రాలు, నమోదిత మొబైల్ వినియోగదారులకు తెలియజేస్తూ అప్రమత్తం చేస్తున్నామని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి బాబుల్ సుప్రియో తెలిపారు. అడవులు, పర్యావరణం, వాతావరణ పరిస్థితుల మార్పులను తెలుసుకొనేందుకు శాస్త్రీయ విధానాలను అవలంబిస్తున్నామని చెప్పారు. బుధవారం లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 15.00 | రిటైల్ లైవ్ | 37.00 |
| డ్రెస్‌డ్ | 54.00 | స్కిన్‌లెస్ | 61.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 295.00 | రంగారెడ్డి | 295.00 |
| మెదక్ | 295.00 | కరీంనగర్ | 298.00 |
| వరంగల్ | 298.00 | డజన్ ధర | 54.00 |

# సమ్మెకాలానికి జీతాలు

- ఆర్టీసీ ఉద్యోగులకు తీపి కబురు
- 235 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- ఆర్టీసీ ఉద్యోగుల హర్షాతిరేకాలు



సూర్యాపేట డిపో ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం శాయశక్తులా కృషిచేస్తున్నది. ఉద్యోగులు ఆనందంగా ఉంటేనే సంస్థ లాభాల బాట పడుతుందనే ఆలోచనతో సమ్మెకాలపు జీతాల కోసం ఏకమొత్తంగా రూ.235 కోట్ల విడుదలకు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. త్వరలోనే ఈ మొత్తం ఉద్యోగుల ఖాతాల్లో జమకానున్నది. దీంతో సీఎం కేసీఆర్ గత ఏడాది ఆర్టీసీ ఉద్యోగులతో జనహితలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఇచ్చిన హామీని నిలుపుకొన్నట్టయింది. ఉద్యోగుల సమ్మెకాలానికి సంబంధించిన రెండునెలల జీతం వస్తుండటంతో ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. సంస్థను ఆదుకొనేందుకు ఇప్పటికే వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే.

### పటాకులు కాల్చి, స్వీట్లు తినిపించుకొని..

సమ్మెకాలం జీతాల విడుదల పట్ల ఆర్టీసీ ఉద్యోగులు సంబురాలు చేసుకొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిపోల వద్ద ఉద్యోగులు పటాకులు కాల్చి, స్వీట్లు తినిపించుకొన్నారు. పలు డిపోల వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. గతంలో ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఆర్టీసీ క్షేమం కోసం సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నారని సంస్థ ఉద్యోగులు కొనియాడారు. బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించడంతోపాటు సమ్మెకాలం జీతాన్ని మాట ప్రకారం విడుదలచేయడం సంతోషంగా ఉన్నదన్నారు. ఆర్టీసీకి సీఎం కేసీఆర్ అండగా ఉన్నారని, ఇక యూనియన్లతో తమకు పనిలేదని, చిత్తశుద్ధితో పనిచేసి సంస్థను లాభాల బాట పట్టించేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు.

### మంత్రి పువ్వాడ హర్షం

ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెకాలపు జీతాల విడుదలపై రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తంచేశారు. బుధవారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద పలువురు ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ ఆర్థికస్థితిని గాడిలో పెట్టడంతోపాటు ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదనే విషయం మరోమారు రుజువైందని చెప్పారు. సమ్మెకాలానికి సంబంధించిన జీతాలను ఒకేసారి విడుదలచేయడం సీఎం కేసీఆర్ పెద్ద మనసుకు నిదర్శనమని కొనియాడారు. సీఎం కేసీఆర్ ఆకాంక్షల మేరకు ఆర్టీసీ అభ్యున్నతి కోసం నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టి మంచి ఫలితాలు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగుల తరపున సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, పట్నం నరేందర్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి కూడా ఉన్నారు.

# కొనసాగుతున్న ద్రోణి

- రాష్ట్రంలో ముదురుతున్న ఎండలు
- రాగల మూడురోజులు పొడి వాతావరణం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉత్తర మరాఠ్వాడా నుంచి ఇంటీరియర్ కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడువరకు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ద్రోణి కొనసాగుతున్నది. దీని ప్రభావంతో బుధవారం కొన్నిచోట్ల భారీ నుంచి ఓ మోస్తరు వానలు కురిశాయి. మరోవైపు క్రమంగా ఎండలు ముదురుతున్నాయి. 48 గంటలుగా పలుచోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36నుంచి 38 డిగ్రీలవరకు నమోదవుతున్నాయి. నిర్మల్ జిల్లా బీర్వెల్లిలో 38.1 డిగ్రీలవరకు రికార్డయింది. రాగల మూడురోజుల్లో చాలాచోట్ల 36నుంచి 38 డిగ్రీలవరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. రాగల మూడురోజుల వరకు పొడి వాతావరణం నెలకొంటుందని వివరించారు.

# 10,610 ఎకరాల్లో పంటనష్టం

- అకాలవర్షాలపై వ్యవసాయశాఖ నివేదిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 5 నుంచి 11 వరకు కురిసిన అకాల వర్షాలకు 10,610 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనావేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అగ్గితెగులుతో వరిపంటకు నష్టం జరుగుతుండగా, అకాల వర్షాలతో మూడువేల ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. మక్కజొన్న 7,285 ఎకరాల్లో, జొన్న 500 ఎకరాల్లో నష్టపోయింది. వరంగల్, భూపాలపల్లి, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో పంట నష్టపోయినట్టు నివేదికలో పేర్కొన్నది. అత్యధికంగా వరంగల్‌లో 5,267 ఎకరాలు, భూపాలపల్లి జిల్లాలో 1,220 ఎకరాల్లో మక్కజొన్న పంటకు నష్టం జరిగింది.

## లోకం పోకడ




దేనికైనా ముందుచూపుండాలండీ.. పదండీ.. అర్జెంటుగా నాలుగు నెక్లెస్‌లు, మూడు ముక్కుపుడకలు, పది పచ్చల హారాలు కొందాం..!

## ముహూర్తం

సూర్యోదయం: 6.26 గంటలకు

సూర్యాస్తమయం: 6.19 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం తదియ మధ్యాహ్నం 12.00 వరకు, తదుపరి చతుర్థి, నక్షత్రం: చిత్త సాయంత్రం 4.15 వరకు, తదుపరి స్వాతి, అమృతఘడియలు: ఉదయం 10.36 నుంచి మధ్యాహ్నం 12.01 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.52 నుంచి 3.20 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.09 నుంచి సాయంత్రం 4.45 వరకు, వర్జ్యం: రాత్రి 9.21 నుంచి 10.47 వరకు.

# నేటినుంచి వింగ్స్ ఇండియా షో

- ఎయిర్ షోను రేపు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- 15 వరకు విమానాల ప్రదర్శన
- కరోనా వైరస్ కారణంగా సామాన్య ప్రజలకు నో ఎంట్రీ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ బేగంపేట:** రెండేండ్లకోసారి నిర్వహించే వింగ్స్ ఇండియా ఎయిర్ షోకు సర్వంసిద్ధమైంది. బేగంపేట విమానాశ్రయంలో గురువారం నుంచి నాలుగురోజులపాటు ఈ ప్రదర్శన జరుగుతుంది. పౌరవిమానయాన మంత్రిత్వశాఖ, ఫిక్కీ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న వింగ్స్ ఇండియా-2020 ప్రదర్శనను 13వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. పౌరవిమానయానరంగంలో చేసిన సేవలకుగాను వివిధ సంస్థలు, వ్యక్తులకు అదేరోజు రాత్రి తాజ్‌కృష్ణ హోటల్‌లో అవార్డులు అందజేయనున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఎయిర్‌షోలు నిర్వహించనున్నారు. కొవిడ్-19 వ్యాపించకుండా పౌరవిమానయానశాఖ, రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకొన్నాయి. ప్రదర్శనకు వీలైనంత తక్కువ సంఖ్యలో విదేశీ ప్రతినిధులు హాజరయ్యేలా చూస్తున్నారు. ఈసారి ప్రజలను ఎయిర్‌షోకు అనుమతించడంలేదు. సదస్సులు జరిగే ప్రదేశాల్లో ప్రతినిధులు కూర్చొనే దూరాన్ని పెంచేలాచర్యలు తీసుకొంటున్నారు. ప్రపంచంలోని వివిధ కంపెనీలు హాజరవుతున్నందున.. వారిని పెట్టుబడులు పెట్టేలా ఆకర్షించేందుకు ఇక్కడున్న వనరులు, పారిశ్రామిక విధానం, తదితరాలను వివరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# 2500 కాలేజీల్లో సేఫ్టీక్లబ్‌లు

- రాష్ట్రవ్యాప్తంగా విడుతలవారీగా ఏర్పాటు
- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో డీజీపీ మహేందర్‌రెడ్డి



ఆర్టీసీ కల్యాణమండపంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి. చిత్రంలో మహిళా భద్రతా విభాగం ఐజీ స్వాతిలక్రా, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ తదితరులు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/చిక్కడపల్లి:** రాష్ట్రంలోని దాదాపు 2,500 డిగ్రీ కళాశాలల్లో విడుతలవారీగా సేఫ్టీక్లబ్‌లను ఏర్పాటుచేస్తామని డీజీపీ మహేందర్‌రెడ్డి చెప్పారు. వీటిలో లక్షమందిని సభ్యులుగా చేర్పించి.. వారిని విద్యార్థినులు, పిల్లలు, యువతులు, మహిళల భద్రతకు స్వచ్ఛందంగా ఉపయోగించనున్నట్టు తెలిపారు. పోలీస్‌శాఖలోని మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కల్యాణ మండపంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళాదినోత్సవంలో డీజీపీ మాట్లాడారు. మహిళల భద్రతకోసం తీసుకొచ్చిన షీటీమ్స్ పనితీరును ప్రజలు ప్రశంసిస్తున్నారని అన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం దోషులకు శిక్షలుపడే సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో నేరంచేస్తే వెంటనే శిక్ష పడుతుందనే భయాన్ని కలిగించడంలో పోలీస్‌శాఖ సఫలమైందని డీజీపీ పేర్కొన్నారు. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ.. లింగవివక్షకు వ్యతిరేకంగా కళాశాలస్థాయిలో పాఠ్యాంశాలను ప్రవేశపెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. మహిళా భద్రతా విభాగం ఐజీ స్వాతిలక్రా మాట్లాడుతూ.. ప్రజల ఆలోచనాదృక్పథంలో మార్పు వచ్చినప్పుడే సామాజిక మార్పు సాధ్యమన్నారు. ఇందుకు సేఫ్టీక్లబ్‌లు దోహదపడుతాయని చెప్పారు.



బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని తిప్పాపూర్ సర్జ్‌పూల్ నుంచి అన్నపూర్ణ జలాశయంలోకి దుంకుతున్న గోదావరి జలాలు.. (సర్కిల్‌లో) సర్జ్‌పూల్

# ఎగిరి దుంకింది గోదావరి


## అన్నపూర్ణలోకి కాళేశ్వరం జలాలు

- ఎస్సారార్ నుంచి నాలుగో ప్రస్థానం ప్రారంభం
- తిప్పాపూర్‌లో మొదటి మోటర్ ట్రయల్ రన్ సక్సెస్
- నేటి సాయంత్రంలోగా రెండో మోటర్ వెట్‌రన్
- రెండురోజుల్లో మొత్తం నాలుగు మోటర్లతో ఎత్తిపోత

**హైదరాబాద్/ కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

కాళేశ్వరం గంగ మరో మెట్టు పైకెక్కింది. ఆసియాలోనే అతిపెద్ద సర్జ్‌పూల్ (మహాబావి) నుంచి తన మరో ప్రస్థానాన్ని ప్రారంభించింది. శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి నాలుగో లింక్‌కు కనెక్ట్ అయింది. నదీగర్భం నుంచి ఇప్పటికే మూడొందల మీటర్లకుపైగా ఎత్తులో ఉన్న ఎస్సారార్‌లోకి వచ్చిన గోదావరి జలాలు.. తాజాగా అన్నపూర్ణ జలాశయంలోకి దుంకాయి. మరో పక్షంరోజుల్లో మిగిలిన ఐదు దశల్లోనూ జలాలను ఎత్తిపోసి.. బేసిన్‌లోనే గరిష్ఠ ఎత్తులోఉన్న కొండపోచమ్మ సిగలోకి గంగమ్మను పంపేందుకు కసరత్తు జరుగుతున్నది. ఈ నెల 25వ తేదీకల్లా లక్ష్మీ బరాజ్ నుంచి దాదా పు 290 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపోచమ్మ జలాశయంలోకి కాళేశ్వరం జలాలుచేరే అవకాశం ఉన్నది. పలు జలాశయాలను దాటుకుంటూ.. బీడు భూములను స్థిరీకరించుకుంటూ ముందుకుసాగిన కాళేశ్వరం నీళ్లు.. ప్రాజెక్టులోనే గరిష్ఠంగా నాలుగో దశలో డిజైన్‌చేసిన 5,89,280 ఎకరాల ఆయకట్టును సస్యశ్యామలం చేయనున్నది.

శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి గోదావరి జలాలను అన్నపూర్ణ జలాశయంలోకి ఎత్తిపోసే ప్రక్రియ మొదలైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని తిప్పాపూర్ పంప్‌హౌజ్‌లో అధికారులు బుధవారం ఒక మోటరు ట్రయల్‌రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. దీంతో 2,836 క్యూసెక్కుల నీరు అన్నపూర్ణ జలాశయంలోకి దుంకాయి. శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి రంగనాయకసాగర్‌కు అక్కడి నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్ వరకు నీటిని ఎత్తిపోయడంలో అన్నపూర్ణ రిజర్వాయరే అత్యంత కీలకం. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద అన్నపూర్ణ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం 3.5 టీఎంసీలు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 10లో భాగంగా ఏర్పాటుచేసిన అన్నపూర్ణ రిజర్వాయర్ ఎస్సారార్‌కు 11.186 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఎస్సారార్ జలాశయం వద్ద ఏర్పాటుచేసిన క్రస్ట్‌గేట్ల నుంచి జలాలు 3.535 కిలోమీటర్ల పొడవు గ్రావిటీ కెనాల్, 2.38 కిలోమీటర్ల భూమ్యాకర్షణ కాలువ, తర్వాత 7.651 కిలోమీటర్లు సొరంగ మార్గం ద్వారా తిప్పాపూర్‌లో 56 మీటర్ల వెడల్పు, 92 మీటర్ల లోతుతో ఆసియాలోనే అతిపెద్ద సర్జ్‌పూల్( మహాబావి)కు చేరుతాయి. సర్జ్‌పూల్‌కు వచ్చిన నీటిని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసేందుకు నాలుగు మోటర్లను ఏర్పాటుచేశారు. ఒక్కోమోటర్ సామర్థ్యం 106 మెగావాట్లు. నాలుగు మోటర్లు కలిసి రోజుకు ఒక టీఎంసీ నీటిని 101.2 మీటర్ల ఎత్తుకు ఎత్తి అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తాయి. బుధవారం నిర్వహించిన ఒకటో మోటర్ ట్రయల్‌రన్ విజయవంతం కావడంతో.. గురువారం సాయంత్రం వరకు రెండో మోటరు ట్రయల్‌రన్‌కు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. శుక్ర, శనివారాల్లో మిగిలిన రెండింటి ట్రయల్‌రన్ చేపట్టనున్నారు. ప్రస్తుతం ఉన్న గణాంకాల ప్రకారం 90 రోజుల్లో 88.24 టీఎంసీల నీటిని ఎత్తిపోసేవిధంగా రూపకల్పన చేశారు. పవర్ కోసం అన్నపూర్ణ రిజర్వాయర్ పరిధిలోనే 400 కేవీ సామర్థ్యం గల సబ్‌స్టేషన్ ఏర్పాటుచేశారు. ఈ రిజర్వాయర్ కింద సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 35 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందనున్నది. 3.5 టీఎంసీల సామర్థ్యం గల అన్నపూర్ణలో 0.8 టీఎంసీల మేర నిల్వ చేరుకున్న తర్వాత రంగనాయకసాగర్ జలాశయంలోకి నీటిని ఎత్తిపోయడం సాధ్యమవుతుందని కాళేశ్వరం ఈఎన్సీ హరిరాం తెలిపారు. ఆ స్థాయి నిల్వకు చేరుకున్నాక సీఎం కేసీఆర్ ఆదేశానుసారం చంద్లాపూర్ పంపుహౌజ్ నుంచి ఎత్తిపోత ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం ఒక్కో మోటరు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నామని, నాలుగైదు రోజుల్లో పరిస్థితులు అనుకూలిస్తే ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ మోటర్లు నడిపే అవకాశాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు.



అన్నపూర్ణ జలాశయం నుంచి తొలుత గోదావరి జలాలుచేరే రంగనాయకసాగర్ ఏరియల్ వ్యూ

## పదిహేను రోజుల్లో కొండపోచమ్మకు..

అన్నపూర్ణ జలాశయం నుంచి వారంరోజుల్లో రంగనాయకసాగర్‌కు గోదావరి జలాలు రానున్నాయి. రంగనాయకసాగర్ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం మూడుటీఎంసీలు. ఆ తర్వాత మల్లన్నసాగర్ పూర్తికాకపోవడంతో కొండపోచమ్మ వరకు మధ్యలో జలాశయాల్లో నిల్వచేయడానికి వీలులేదు. దీంతో ఈ నెల 25 వరకు గోదావరిజలాల్ని కొండపోచమ్మ సాగర్‌లోకి ఎత్తిపోసేలా అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి కొండపోచమ్మ వరకు ఐదుదశల్లో నీటిని ఎత్తిపోయాల్సి ఉండగా.. ఇవన్నీ తొలిసారిగా ఆన్ అవుతున్నవి. సాంకేతికంగా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉండటంతో ఈ నెలాఖరులోగా 15 టీఎంసీల నిల్వ సామర్థ్యమున్న, గరిష్ఠంగా 614 మీటర్ల ఎత్తులో ఉన్న కొండపోచమ్మకు కాళేశ్వరజలాలు చేరడం ఖాయంగా కనిపిస్తున్నది.



రంగనాయకసాగర్ తర్వాత గోదావరి జలాలు చేరనున్న కొండపోచమ్మ ఏరియల్ వ్యూ

## నాలుగో లింకులో ప్రయాణమిది..

- ఎస్సారార్ నుంచి 1.15 కిలోమీటర్ల అప్రోచ్ చానెల్.. తర్వాత 2.38 కిలోమీటర్ల భూమ్యాకర్షణ కాలువ అనంతరం 7.65 కిలోమీటర్ల మేర సొరంగమార్గం ద్వారా జలాలు ఆసియాలోనే అతి పెద్దబావి (సర్జ్‌పూల్)లోకి చేరుకుంటాయి. అక్కడ నిర్మించిన పంపుహౌజ్‌లోని మోటర్ల ద్వారా అన్నపూర్ణ జలాశయంలోకి ఎత్తిపోస్తారు. (మోటర్ల సంఖ్య: నాలుగు.. ఒక్కోమోటర్ సామర్థ్యం: 106 మెగావాట్లు)
- అన్నపూర్ణ జలాశయం నుంచి 1.74 కిలోమీటర్ల అప్రోచ్ చానెల్, 0.45 కిలోమీటర్ల భూమ్యాకర్షణ కాల్వ ఆపై 8.59 కిలోమీటర్ల సొరంగ మార్గం ద్వారా ప్రవహించిన జలాలు చంద్లాపూర్ పంపుహౌజ్ (మోటర్ల సంఖ్య: నాలుగు.. సామర్థ్యం: 134 మెగావాట్లు)కు చేరుకుంటాయి. అక్కడి నుంచి రంగనాయకసాగర్‌లోకి ఎత్తిపోస్తారు.
- రంగనాయకసాగర్ నుంచి 4.20 కిలోమీటర్ల అప్రోచ్ చానెల్, 6.18 కిలోమీటర్ల సొరంగ మార్గం ద్వారా తుక్కాపూర్ పంపుహౌజ్ (మోటర్ల సంఖ్య: ఎనిమిది.. సామర్థ్యం: 43 మెగావాట్లు)కు చేరుకుంటాయి. ఇక్కడినుంచి మల్లన్నసాగర్‌లోకి ఎత్తిపోస్తారు. అయితే మల్లన్నసాగర్ జలాశయం నిర్మాణం పూర్తికానందున 18.5 కిలోమీటర్ల ఫీడర్ చానెల్ ద్వారా నీటిని ముందుకుతీసుకెళతారు.
- మల్లన్నసాగర్ జలాశయం నుంచి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న అక్కారం పంపుహౌజ్ (మోటర్ల సంఖ్య – ఆరు, సామర్థ్యం 27 మెగావాట్లు)లోని మోటర్ల ద్వారా జలాల్ని ఎత్తిపోస్తారు.
- జలాలు మరో 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న మర్కూర్ పంపుహౌజ్ (మోటర్ల సంఖ్య: ఆరు.. సామర్థ్యం 34 మెగావాట్లు)కు చేరుకుంటాయి. అక్కడ నీటిని మరోసారి ఎత్తిపోయడం వల్ల దాదాపు కిలోమీటర్ ఉన్న కాల్వ ద్వారా కొండపోచమ్మ జలాశయంలోకి చేరుకుంటాయి.

## గరిష్ఠ ఆయకట్టు ఈ లింకులోనే..

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణలోని 45 లక్షల ఎకరాలకు సాగునీరందనున్నది. ప్రాజెక్టులోని ఏడు లింకుల పరిధిలో 18,25,700 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించేందుకు రూపకల్పన చేశారు. ఇప్పటివరకు కాళేశ్వరం జలాలు రెండులింకులను దాటాయి. తాజాగా నాలుగో లింకులోకి ప్రవేశించాయి. మొదటిలింకు (లక్ష్మీబరాజ్ నుంచి ఎల్లంపల్లి జలాశయం వరకు)లో గోదావరి నుంచి జలాలను నదీమార్గంలో వెనక్కి ఎత్తిపోయడంతోపాటు, బరాజ్‌లలో నిల్వచేయ డం ప్రధాన లక్ష్యం. ఈ లింకులో ఆయకట్టు కేవలం 30వేల ఎకరాలు. రెండోలింకులో ఎల్లంపల్లి నుంచి ఎస్సారార్‌లోకి గోదావరి జలాల్ని తరలిస్తున్నారు. మూడోలింకులో ఎస్సారార్ నుంచి ఎగువమానేరుకు తరలించడం. దీని పరిధిలో 86,150 ఎకరాలు ఉన్నది. నాలుగో లింకులోనే గరిష్ఠంగా 5,89,280 ఎకరాల ఆయకట్టు (మొత్తంలో 32.27 శాతం) ఉన్నది. 50 టీఎంసీల సామర్థ్యం ఉన్న మల్లన్నసాగర్ జలాశయం కూడా ఈ లింకులోనే ఉన్నది.



తిప్పాపూర్ పంప్‌హౌజ్‌లో మొదటి మోటర్ ట్రయల్‌రన్ సక్సెస్ కావడంతో విజయసంకేతం చూపుతున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం సలహాదారు పెంటారెడ్డి, ఈఎన్సీ హరిరాం తదితరులు

## కన్నెపల్లి నుంచి తరలుతున్న కాళేశ్వరం నీళ్లు

**కాళేశ్వరం, తిమ్మాపూర్ నమస్తే తెలంగాణ:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మీపంప్‌హౌజ్ నుంచి బుధవారం 2వ, 11వ నంబర్ మోటర్ల ద్వారా నీటిని సరస్వతిబరాజ్‌కు తరలించారు. ఈ రెండు మోటర్ల ద్వారా 4,600 క్యూసెక్కులు సరస్వతి బరాజ్‌కు చేరుకున్నాయి. కాగా, గోదావరిలో నీటిమట్టం తగ్గడంతో బుధవారం రాత్రి 2వ నంబర్ మోటర్‌ను నిలిపివేశారు. ఎస్సారార్ జలాశయం స్లూయిస్‌గేట్లద్వారా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. రిజర్వాయర్‌లోకి 25 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 326 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో ఉన్నది. ప్రస్తుతం ఎల్‌ఎండీలో 10.483 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది.

## కేటీఆర్‌తోనే వస్త్ర పరిశ్రమకు మహర్దశ

- పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోశిక యాదగిరి



సిరిసిల్లలో మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోశిక యాదగిరి

**సిరిసిల్ల టౌన్:** వస్త్ర పరిశ్రమకు మంత్రి కేటీఆర్‌తోనే వన్నె వచ్చిందని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోశిక యాదగిరి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు బుధవారం ఆత్మీయ సన్మానం చేశారు. ఈసందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మంత్రి కేటీఆర్ బృహత్తరమైన ఆలోచన విధానాలతో నేతకార్మికుల జీవితాలలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత నేతకార్మికుల జీవనస్థితిగతులపై కేటీఆర్ ప్రత్యేక అధ్యయనం చేశారన్నారు. సిరిసిల్లకు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ యూనిఫారాలు, స్కూల్ యూనిఫారాలు, రంజాన్, క్రిస్మస్ కానుకల తయారీ ఆర్డర్లు మంత్రి ప్రత్యేక శ్రద్ధతో వచ్చాయన్నారు. మంత్రి కేటీఆర్ అందించిన ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుంటూ నాయకులు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం మున్సిపల్ పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయకార్యదర్శి గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సంఘం జిల్లా అధ్యక్షుడు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Government of India Society, Ministry of MSME)
Balanagar, Hyderabad, PIN - 500 037.

ADMISSIONS FOR DIPLOMA COURSES

| S. No. | Course Details | Eligibility for Admission | Age Limit | Duration of Study | Batch Strength |
|---|---|---|---|---|---|
| 1 | Diploma in Tool, Die & Mould Making (DTDM) | 10th Pass with 50% for general & 45% for SC / ST | Minimum 15 years, Maximum 19 years | 4 Years | 60 |
| 2 | Diploma in Electronics & Communication Engineering (DECE) | 10th Pass | Maximum 19 years | 3 Years | 60 |
| 3 | Diploma in Automation & Robotics Engineering (DARE) | | | 3 Years | 60 |
| 4 | Diploma in Production Engineering (DPE) | | | 3 Years | 60 |

MODE OF APPLICATION:
Application form can be downloaded from our website www.citdindia.org under the link "Diploma Admission Notification-2020" and the filled in application forms can be sent to The Director (Trg), CITD, Balanagar, Hyderabad-500 037, along with prescribed application cost ₹700/- for General and ₹350/- for SC/ST category by way of Demand Draft drawn in favor of Principal Director, CITD, Hyderabad or By Online at www.citdindia.org (detailed steps of online payment can be found from prospectus.)

IMPORTANT DATES:
- Availability of applications : 02-03-2020 (Monday)
- Last date for receipt of filled-in application : 02-05-2020 (Saturday)
- Date of Entrance exam (Tentative) : 10-05-2020 (Sunday)
- Centre for Entrance Examination : Hyderabad

Further details can be obtained from prospectus available on our website under the link "Diploma Admission Notification-2020"

Contact Details : Admission Desk at Diploma Block
Phone No. 9502405170, 040-2377 1959
E-Mail-adminltrg@citdindia.org

Sd/-
PRINCIPAL DIRECTOR

ISO 9001 : 2015, ISO 29990:2010, ISO 14001:2004, ISO 50001:2011 Certified Institution

VIT
Vellore Institute of Technology
(Deemed to be University under section 3 of UGC Act, 1956)
QS WORLD UNIVERSITY RANKINGS by subject
VIT is ranked within the top 450 Universities in the World and No. 1 Private Institution in India in Engineering and Technology as per QS subject ranking, 2020.




VIT Chancellor receiving Atal Ranking of Institutions on Innovation Achievements Award from President of India - 2019

VIT received the Most Innovative Private Institution award (ARIIA award 2019) from Govt. of India

Govt. of India has recognised VIT as an Institution of Eminence (IoE)

In 2005, VIT was the first University in India to undergo the IET, UK accreditation

In 2010, VIT was the first University in India to undergo the ABET, USA accreditation

VIT - The 18th Ranked Engineering Institution of India (NIRF Ranking 2019, MHRD, Govt. of India)

VITEEE - 2020

Last Date to Apply for B.Tech. admission: 22nd March, 2020
Apply now at www.vit.ac.in/viteee

Vellore | Chennai | AP | Bhopal
VIT - A place to learn; A chance to grow



## రైతులకు వెంటనే సాగునీరు

- విడుదల చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశం
- గోపల్‌దిన్నె నుంచి సాగునీరందించాలన్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి విజ్ఞప్తికి స్పందన

**హైదరాబాద్/ కొల్లాపూర్, నమస్తే తెలంగాణ:** రైతుల అవసరాల దృష్ట్యా వెంటనే సాగునీటిని విడుదలచేయాలని ఈఎన్సీని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని గోపల్‌దిన్నె జలాశయం నుంచి వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు సాగునీరు విడుదలచేయాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం అసెంబ్లీ ఆవరణలో సీఎం కేసీఆర్‌ను కలిసి కోరారు. దీనిపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించారు.

### సారూ.. మమ్మల్ని రాష్ట్రానికి తీసుకురండి



తమను రాష్ట్రానికి తీసుకురావాలని ఆంధ్రలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను కోరారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అసెంబ్లీ ఆవరణలో కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో నిరాశ్రయులైన కొల్లాపూర్, వనపర్తి, అలంపూర్‌కు చెందిన కొందరికి 98 జీవో కింద ఆంధ్రలో ఉద్యోగాలిచ్చారని, అక్కడ వారు ఇబ్బంది పడుతున్నారని బీరం తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు.

\- నమస్తే తెలంగాణ, హైదరాబాద్



బుధవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ (టీపీజేఏ) క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, అసెంబ్లీ మీడియా కమిటీ చైర్మన్ సూరజ్ భరద్వాజ్, టీపీజేఏ అధ్యక్షుడు జీ భాస్కర్, కోనేటి వెంకట్, కేవీ రావు, రమణ తదితరులు ఉన్నారు

\- నమస్తే తెలంగాణ, హైదరాబాద్



# అసెంబ్లీ ఆవాజ్

అసెంబ్లీ సమావేశాలు

## 24 గంటలూ డయాలసిస్ సేవలు

- మండలిలో మంత్రి ఈటల



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నవారికి ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నామని, ఇందుకోసం ప్రత్యేకంగా డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. వ్యాధి ముదిరితే డయాలసిస్ లేదా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ మాత్రమే మార్గమన్నారు. బుధవారం మండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, నర్సిరెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. రాష్ట్రంలో 45 డయాలసిస్ సెంటర్లు నిర్వహిస్తున్నామని.. ఒక్కో సెంటర్లో 5 నుంచి 10వరకు బెడ్లు ఉన్నాయన్నారు. కేంద్రానికి వచ్చే రోగులసంఖ్య ఆధారంగా 24 గంటలూ డయాలసిస్ సేవలు అందిస్తున్నామన్నారు. ఒక్కో పేషంట్‌పై ఏడాదికి రూ.1.8 లక్షలు వెచ్చిస్తున్నామన్నారు. కంటివెలుగు పథకంలో 40 లక్షల మందికి కండ్లద్దాలు పంపిణీ చేశామన్నారు.

## నూతన నీటి యాజమాన్య పద్ధతులు

- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరిసాగులో నూతన నీటి యాజమాన్య పద్ధతులను అవలంబిస్తున్నట్టు వ్యవసాయశాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. మండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. కిలో వరిసాగుకు 2,395 లీటర్ల నీటిని వినియోగిస్తున్నట్టు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా సగటున 2,300 లీటర్లు.. దేశంలోని వివిధరాష్ట్రాలలో 1,786 లీటర్ల నుంచి 3,683 లీటర్ల వరకు వినియోగిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ వర్సిటీ వరిసాగులో నీటివినియోగం తగ్గించేందుకు శాస్త్రీయ నీటిపద్ధతులను ఆవిష్కరించి ప్రదర్శనలు నిర్వహించారన్నారు.



# ఆరేండ్లలో రోడ్ల అభివృద్ధి

- కొనసాగుతున్న వంతెనల నిర్మాణాలు
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి వేముల



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఆరేండ్లలో రోడ్ల నెట్‌వర్క్ అభివృద్ధి చెందుతున్నదని రోడ్లు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, రాములు, చిన్నయ్య అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రంలో గ్రామాలనుంచి మండలకేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి జిల్లాకేంద్రాలకు సింగిల్, డబుల్, నాలుగు లేన్లరోడ్లు రూ.11,257 కోట్లతో 7,554 కి.మీ. మేర చేపట్టామని తెలిపారు. ఇందులో 5,553 కి.మీ. పూర్తిచేశామని, మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్‌ఎఫ్) కింద 2,387 కి.మీ. రోడ్లను రూ.2,436 కోట్లతో చేపట్టగా, 1,551 కి.మీ. రహదారులను పూర్తిచేసిట్టు వివరించారు. మొత్తంగా రూ.10,803 కోట్లతో 16,800 కి.మీ. రోడ్ నెట్‌వర్క్ పనులు చేపట్టామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వాగులు, వంకలు, నదులపై రూ.2,797 కోట్లతో బ్రిడ్జీల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయం ముగిశాక స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జీరోఅవర్ నిర్వహించారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, జాఫర్‌హుస్సేన్, సంజయ్, శ్రీధర్ బాబు, రాజాసింగ్, చందర్, నోముల నర్సింహయ్య, చెన్నమనేని రమేశ్, జైపాల్‌యాదవ్, రాజగోపాల్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి తదితరులు తమ నియోజకవర్గాల సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

### పెరిగిన చేపల ఉత్పత్తి: మంత్రి తలసాని



2019-20 ఆర్థిక సంవత్సరంలో జనవరినాటికి 2.43 లక్షల టన్నుల చేపలు, రొయ్యల ఉత్పత్తి జరిగిందని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. 2016-17 నుంచి రాష్ట్రంలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. 2016-17లో 1.99 లక్షల టన్నులు, 2017-18లో 2.07 లక్షల టన్నులు, 2018-19లో 2.94 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి అయినట్టు వివరించారు. మత్స్యకారులకు రూ.750 కోట్ల విలువైన వస్తువులు అందజేశామని చెప్పారు. ఈ ఏడాది రూ.53.01 కోట్లు ఖర్చుపెట్టి 15,715 నీటి వనరుల్లో 64.10 కోట్ల చేపపిల్లలను, 70 నీటి వనరుల్లో 3.42 కోట్ల మంచినీటి రొయ్య పిల్లలను వదిలేందుకు ఉచితంగా సరఫరాచేశామన్నారు.

### కల్యాణలక్ష్మి లబ్ధిదారులు 6,15,573 మంది: మంత్రి గంగుల



కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం కింద 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2019-20 వరకు 6,15,573 కుటుంబాలు లబ్ధిపొందాయని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఎమ్మెల్యే రేఖానాయక్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇబీసీ, మైనార్టీల పేదింటి ఆడపిల్లలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. ఇప్పటివరకు ఈ పథకం కింద రూ.4,572.97 కోట్లు ఖర్చుచేశామని, బీసీలు 2,41,491, మైనార్టీలు 1,44,273, గిరిజనులు 85,512, ఎస్సీలు 1,44,297 కుటుంబాలు లబ్ధిపొందాయని తెలిపారు.

### గురుకులాలు అద్భుతం: మంత్రి కొప్పుల



గురుకుల పాఠశాలలు అద్భుతంగా పనిచేస్తున్నాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, హరిప్రియానాయక్, జాజుల సురేందర్, బాజిరెడ్డి గోవర్ధన్, బాల్కసుమన్, జాఫర్ హుస్సేన్ అడిగిన ప్రశ్నలకు కొప్పుల సమాధానమిస్తూ.. రాష్ట్రంలో 602 గురుకుల పాఠశాలల్లో 2,75,610 మంది ప్రవేశంపొందారని చెప్పారు. ప్రభుత్వం ఏడాదికి ఒక్కో గురుకుల విద్యార్థికి సగటున రూ.50,686 ఖర్చు చొప్పున మొత్తం విద్యార్థులపై రూ.5,719 కోట్లు వెచ్చిస్తున్నదన్నారు. ఎమ్మెల్యే షకీల్‌అహ్మద్ ప్రశ్నకు స్పందిస్తూ.. మైనార్టీ గురుకుల విద్యార్థుల కోసం రూ.1260.24 కోట్లు ఖర్చుచేశామన్నారు.


## సంక్షోభంలో కూడా సంక్షేమం

- బడ్జెట్‌ను ప్రశంసించిన అక్బరుద్దీన్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్థికమాంద్యాన్ని తట్టుకుని నిలబడ్డ తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించలేదని, సమతుల్యతతో కూడిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని మజ్లిస్‌పార్టీ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ కొనియాడారు. కేంద్రప్రభుత్వ బడ్జెట్ దేశాన్ని నిరాశలో ముంచితే రాష్ట్రబడ్జెట్ ప్రజల్లో ఉత్సాహాన్ని నింపిందని ప్రశంసించారు. బడ్జెట్‌పై శాసనసభలో బుధవారం జరిగిన చర్చలో పాల్గొన్న అక్బరుద్దీన్.. కేంద్రం వైఫల్యంవల్లనే దేశంలో ఆర్థికసంక్షోభం నెలకొన్నదని ఆరోపించారు. కేంద్రం సహకరించకపోయినా రాష్ట్రప్రభుత్వం ప్రజలపై ధరలభారం మోపకుండా సొంతవనరులను అభివృద్ధి చేసుకుందని చెప్పారు. హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి ఏటా రూ.10వేలకోట్ల చొప్పున రూ. 50వేల కోట్లు కేటాయించాలన్న నిర్ణయాన్ని స్వాగతించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి విడుదలచేసిన నిధుల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీలను వేయాలని అక్బరుద్దీన్ కోరారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు తెలంగాణ వక్ఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటుచేయాలన్నారు.

## కేసీఆర్ రైతుబంధు!



- పథకం పేరు మార్చాలని సూచించిన ఎమ్మెల్యే గండ్ర

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి పెద్దపీట వేసి రైతు బాంధవుడిగా సీఎం కేసీఆర్ నిలిచారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. అందువల్ల రైతులకు పెట్టుబడి సాయంచేసే రైతుబంధు పథకం పేరును 'కేసీఆర్ రైతుబంధు'గా మార్చాలని ఆయన సూచించారు. శాసనసభలో బుధవారం బడ్జెట్‌పై చర్చను గండ్ర ప్రారంభించారు. కాకతీయ కాల్వ ఆయకట్టుకు 31 ఏండ్లలో ఎన్నడూ నీళ్లు రాలేదని.. కాళేశ్వరం ప్రాజెక్టుతో కాల్వల్లో 150 రోజులు నీళ్లు పారుతున్నాయని చెప్పారు. అంతకుముందు ఇటీవల మరణించిన ఎనిమిదిమంది మాజీ ఎమ్మెల్యేలకు శాసనసభ సంతాపం ప్రకటించింది.

### జంట జలాశయాల పరిరక్షణ: భట్టి

హైదరాబాద్‌కు తాగునీటిని అందించే జంట జలాశయాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భట్టి విక్రమార్క సూచించారు. బుధవారం బడ్జెట్‌పై చర్చలో పాల్గొన్న భట్టి.. రాష్ట్రప్రభుత్వం మిషన్ కాకతీయ కింద వేల చెరువులను పునరుద్ధరించిందని చెప్పారు.

## త్వరలో ఫలక్‌నుమా మెట్రో పనులు

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. ఈ మార్గంలో 93 మతపరమైన, సమస్యాత్మక కట్టడాలున్నట్టు పేర్కొన్నారు. వీటిలో 18 నిర్మాణాలు రోడ్డు విస్తరణ, మెట్రో అలైన్‌మెంట్‌తో ప్రభావితం అవుతాయని గుర్తించినట్టు వెల్లడించారు. ఇంజినీరింగ్ పరిష్కారాలతో రక్షించాలని సూచించారు. ఇప్పటికే ఫేజ్-1 ప్రాజెక్టులోని మిగిలిన పనులన్నీ పూర్తిచేశామని తెలిపారు. హైదరాబాద్ మెట్రోలో రోజుకు 4 లక్షల మంది ప్రయాణిస్తున్నారని చెప్పారు. దీన్ని విమానాశ్రయం వరకు మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో కారిడార్ కోసం డీపీఆర్‌ను పరిశీలిస్తున్నామని, దీని అమలు షెడ్యూల్‌పై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. రూ.14 వేల కోట్లతో చేపట్టిన హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం కేవలం రూ.1200 కోట్లే ఇచ్చిందని తెలిపారు. పాస్‌లు ఇచ్చే విషయంపై మెట్రో రైలు యాజమాన్యంతో మాట్లాడుతామని, రైళ్ల సమయం పెంపుపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జేఎన్టీయూ నుంచి హైటెక్‌సిటీ మార్గంలో ట్రామ్‌గానీ, బీఆర్టీఎస్‌గానీ.. రెండింటిలో ఏది చేయాలనే దానిపై ఆలోచిస్తున్నామని పేర్కొన్నారు. 20 మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణాలకు ప్రణాళికలు వేస్తున్నామని కేటీఆర్ వివరించారు.

### సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



బడ్జెట్‌లో పాలమూరు ప్రాజెక్టుకు అత్యధిక నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తంచేస్తూ హైకోర్టులో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పాలమూరు జిల్లాకు చెందిన తెలంగాణ న్యాయవాదుల జేఏసీ సభ్యులు కొంతం గోవర్ధన్‌రెడ్డి, పులిగారి గోవర్ధన్‌రెడ్డి, సీహెచ్ ఉపేందర్, వీ రవికుమార్, శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వర్మ తదితరులు

\- నమస్తే తెలంగాణ, హైదరాబాద్ సిటీబ్యూరో

# ప్రజలు మెచ్చిన బడ్జెట్

- మండలిలో బడ్జెట్‌పై చర్చను ప్రారంభించిన పురాణం సతీశ్



**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలుమెచ్చిన సంక్షేమబడ్జెట్ అని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ అన్నారు. బుధవారం ఆయన శాసనమండలిలో 2020-21 వార్షిక బడ్జెట్ పైచర్చను ప్రారంభించారు. కేంద్రప్రభుత్వం తీసుకున్న నోట్లరద్దు, జీఎస్టీ నిర్ణయాలతో దేశఆర్థిక పరిస్థితి సంక్షోభంలో పడిందని తెలిపారు. దేశ విశాల ప్రయోజనాల కోసమే జీఎస్టీకి టీఆర్‌ఎస్ ప్రభుత్వం మద్దతిచ్చిందని చెప్పారు. సమైక్యరాష్ట్రంలో తెలంగాణకు ఒక్కరూపాయి ఇవ్వనని ప్రకటించిన అసెంబ్లీలో.. నేడు రూ.1.82 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టడం, దానికి సంబంధించి చర్చలో పాల్గొనడం ఆనందంగా ఉన్నదని చెప్పారు. ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నదన్నారు. దేశవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ సంక్షేమానికి కోతపెట్టకుండా ప్రజల కొనుగోలుశక్తి పెంచేలా రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం హర్షణీయమని తెలిపారు. అంతకు ముందు బీజేపీ సభ్యుడు ఎం రామచంద్రరావు మాట్లాడుతూ.. మహిళా వర్సిటీ ఏర్పాటు చేయాలని, ఎంఎంటీఎస్ రెండోదశకు నిధులు విడుదలచేయాలని కోరారు.

### వచ్చే నాలుగేండ్లు అభివృద్ధిపైనే దృష్టి: వీ గంగాధర్‌గౌడ్



రాష్ట్రంలో జరిగిన ప్రతి ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు అధికారపార్టీకి బ్రహ్మరథం పట్టారని.. ప్రస్తుతం అన్ని ఎన్నికలు పూర్తికావడంతో ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలపైనే దృష్టి కేంద్రీకరిస్తుందని ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యతను కల్పించారని చెప్పారు.

### మైనార్టీలకు నిధులు పెంచినందుకు ధన్యవాదాలు: రియాజ్ ఇఫెండి



టీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నదని.. గతంలో ఏ ప్రభుత్వాలు మంజూరుచేయని రీతిలో నిధులను కేటాయిస్తున్నదని ఎంఐఎం ఎమ్మెల్సీ రియాజ్ ఉల్‌హసన్ ఇఫెండి ప్రశంసించారు. బడ్జెట్‌లో మైనార్టీలకు నిధులు పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. షాదీముబారక్ పథకం ద్వారా 1.44 లక్షల మంది మైనార్టీలకు ప్రయోజనం కలిగిందన్నారు. హైదరాబాద్‌లో బస్తీ దవాఖానలకు ఆదరణ పెరుగుతున్నదని చెప్పారు.

## భాగ్యనగర్ ప్రయాణికులకు రైల్వే పరీక్ష!

- కాజీపేటవరకే రైలు.. హైదరాబాద్‌కు రావడానికి అగచాట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం ప్రయాణికులను తీవ్ర అసౌకర్యానికి గురిచేసింది. మహారాష్ట్ర బల్లార్షా నుంచి సికింద్రాబాద్ వరకు నడువాల్సిన రైలు కాజీపేట వరకే నడిచింది. ఘట్‌కేసర్-చర్లపల్లి మధ్య జరుగుతున్న నిర్మాణ పనుల కారణంగా ప్రయాణికులను కాజీపేటలో దించేసింది. తగిన సమాచారం ఇవ్వడంలో రైల్వేశాఖ నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. హైదరాబాద్ వైపు వెళ్లే రైళ్ల కోసం రెండుమూడు గంటలపాటు ఎదురుచూసి వేర్వేరు రైళ్లలో సాయంత్రంవరకు సికింద్రాబాద్ చేరుకున్నారు.

### వచ్చే రెండ్రోజులు పలు రైళ్ల రద్దు

ఘట్‌కేసర్- చర్లపల్లి మధ్య జరుగుతున్న నిర్మాణ పనుల కారణంగా కాజీపేట- బల్లార్షా రైలు వేళల్లో మార్పు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ముంబై డివిజన్‌లో ట్రాఫిక్ బ్లాక్ కారణంగా పలు రైళ్లను ఈ నెల 13, 14 తేదీల్లో రద్దుచేసినట్టు పేర్కొన్నది.

## గండిపేటలో కాంగ్రెసోళ్లకే ఆస్తులెక్కువ

- రేవంత్‌రెడ్డిపై మరోసారి వీహెచ్ ఫైర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గండిపేటలో కాంగ్రెస్ నేతలకే ఎక్కువ ఆస్తులు ఉన్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు అన్నారు. రేవంత్‌రెడ్డి డ్రోన్ కెమెరా వ్యవహారంపై బుధవారం మీడియాతో మాట్లాడిన వీహెచ్.. సొంత ఎజెండాతో రేవంత్ పనిచేస్తున్నారని, ఆయనపై ఆరోపణలు వస్తే దాన్ని పార్టీ మొత్తానికి రుద్ది బద్నాం చేస్తున్నాడని మండిపడ్డారు. పార్టీలో ఎలాంటి చర్చ లేకుండా రేవంత్‌రెడ్డి సొంతంగా వ్యవహరించడం సరికాదని సూచించారు. రేవంత్‌పై ఇప్పటికే పలువురు కాంగ్రెస్ నేతలు విమర్శలకు దిగాగా.. పార్టీ సీనియర్లు దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి ఈ వ్యవహారంపై స్పందించి, 111 జీవో వ్యవహారంలో తప్పు చేసినట్టుగా చెప్పుకొచ్చారు.

## ముగ్గురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముగ్గురు ఐఏఎస్ అధికారులకు ఇతర శాఖల అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్‌కు పర్యావరణం, అటవీ, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి అహ్మద్ నదీంకు కార్మికశాఖ, పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావుకు పర్యాటక, సాంస్కృతిక, యువజనశాఖల బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## విద్యుత్ ఉద్యోగుల తుది ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యుత్ ఉద్యోగుల విభజనపై సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ ధర్మాధికారి తన తుది నివేదికను బుధవారం వెలువరించారు. డిసెంబర్‌లో ఇచ్చిన తన నివేదికలో పేర్కొన్నవిధంగా 655 మంది ఉద్యోగులను ఏపీకి, 502 మందిని తెలంగాణ విద్యుత్ సంస్థలకు కేటాయించారు. తాజాగా స్పౌజ్, అనారోగ్యం, అంగవైకల్యం తదితర కారణాల కింద దరఖాస్తు చేసుకున్న 71 మందిని తెలంగాణకు కేటాయించారు. దీనిని ఈ నెల 30 లోగా అమలు చేయాలని లేదంటే కోర్టు దిక్కరణ కింద చర్యలు తీసుకుంటామని జస్టిస్ ధర్మాధికారి స్పష్టం చేశారు.

## వివేక హత్యకేసు సీబీఐకి

- ఏపీ హైకోర్టు కీలక నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసును సీబీఐకి అప్పగించి వీలైనంత త్వరగా విచారణ పూర్తిచేయాలని బుధవారం ఏపీ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకున్నది. హత్యకేసును సీబీఐకి అప్పగించాలని వివేకానందరెడ్డి సతీమణి సౌభాగ్యలక్ష్మి, కుమార్తె సునీత హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై పలుమార్లు విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. హత్య జరిగి ఏడాది కావస్తున్నా కేసు దర్యాప్తులో పురోగతి లేదన్నది. కేసులో అంతర్రాష్ట్ర నిందితులు ఉండే అవకాశం ఉన్నదని, ఇతర రాష్ట్రాల నిందితులను పట్టుకొనే శక్తి సామర్థ్యాలు సీబీఐకి ఉన్నాయని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.

# రెండోటెస్టూ నెగెటివే

- గాంధీలో కోలుకున్న కొవిడ్ బాధితుడు
- మూడు వైరాలజీ ల్యాబ్‌లకు అనుమతి
- వైద్యశాఖ మంత్రి ఈటల రాజేందర్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఐఏఎస్ అధికారులు శాంతికుమారి, యోగితారాణా, టీకే శ్రీదేవి కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దుబాయ్‌లో కరోనా వైరస్ బారిన పడిన హైదరాబాద్ యువకుడు గాంధీ దవాఖానలో కోలుకున్నాడని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. రెండో పరీక్ష కూడా నెగిటివ్ వచ్చిందని, అతడిని త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని తెలిపారు. బుధవారంనాటికి రాష్ట్రంలో ఒక్క కరోనా పాజిటివ్ పేషెంట్ లేరని అన్నారు. తెలంగాణ ప్రజలకు ఇది శుభవార్తగా మంత్రి అభివర్ణించారు. కరోనా వస్తే మరణమే అంటూ.. బాధ్యతలేని కొందరు సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారం నమ్మొద్దని సూచించారు. కోఠిలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కరోనా వైరస్ నియంత్రణ కమిటీతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విదేశాల నుంచి వస్తున్న వారందరికీ 24 గంటలపాటు శంషాబాద్ విమానాశ్రయంలో థర్మల్ స్క్రీనింగ్ చేస్తున్నామని, అనుమానిత లక్షణాలున్న వ్యక్తులను నేరుగా దవాఖానలకు తరలిస్తున్నామని తెలిపారు. ఉస్మానియాలో నిర్ధారణ పరీక్షలకు కేంద్రం అనుమతించడంతో బుధవారం నుంచి ట్రయల్స్ ప్రారంభించినట్టు చెప్పారు. వరంగల్ కాకతీయ వైద్య కళాశాల, నారాయణగూడ ఐపీఎం, ఫీవర్ దవాఖానలో నిర్ధారణ పరీక్షలకు కావాల్సిన పరికరాలు సిద్ధంచేస్తున్నామని తెలిపారు. కొవిడ్‌ను నిరోధించడంలో సమర్థంగా పనిచేస్తున్న తెలంగాణకు జాతీయస్థాయిలో గుర్తింపు దక్కిందన్నారు. గాంధీ, ఫీవర్ దవాఖానల్లో హెపాఫిల్టర్లను ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు.

### 16 మందికి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు

అనుమానిత లక్షణాలున్న 16 మందికి బుధవారం పరీక్షలుచేసినట్టు వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక బులెటిన్‌లో వెల్లడించింది. 'ఇప్పటివరకు 302 మందికి వైరస్ నిర్ధారణ పరీక్షలుచేయగా.. 292 మందికి వ్యాధి లక్షణాలు లేవని తేలింది. మరో 10 మంది నివేదికలు రావాల్సి ఉన్నది. శంషాబాద్ విమానాశ్రయంలో ఇప్పటివరకు 50,679 మందికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలుచేశాం' అని పేర్కొన్నది.

### ఏపీలో తొలి కరోనా కేసు

ఆంధ్రప్రదేశ్‌లో తొలి కరోనా కేసు నమోదైంది. ఇటలీనుంచి వచ్చిన ఓ యువకుడికి కరోనా వైరస్ సోకినట్టు వైద్యులు గుర్తించారు. జ్వరంతో బాధపడుతూ నాలుగురోజులుగా నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. రక్త నమూనాలను పరీక్షించి కొవిడ్-19 ఉన్నట్టు గుర్తించారు.

## రేవంత్‌రెడ్డి బెయిల్ తిరస్కరణ

**కూకట్‌పల్లి:** జన్వాడలో డ్రోన్ వినియోగించిన కేసులో రిమాండ్‌లో ఉన్న మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డికి కూకట్‌పల్లి కోర్టులో చుక్కెదురైంది. రేవంత్‌రెడ్డి పెట్టుకొన్న బెయిల్ పిటిషన్‌ను విచారించిన కూకట్‌పల్లి తొమ్మిదవ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి బుధవారం తిరస్కరించారు. మంగళవారం రేవంత్ తరఫు న్యాయవాది దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను న్యాయమూర్తి బుధవారానికి వాయిదావేశారు. రేవంత్‌రెడ్డిపై ఐపీసీ సెక్షన్ 184, 187, 287, 120 బీ, 115, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్ 1935, 11ఏ, 5ఏ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయని రేవంత్‌రెడ్డి తరఫున న్యాయవాది తెలిపారు. కూకట్‌పల్లి కోర్టుకు రేవంత్ మద్దతుదారులు, కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో రావడంతో ఎలాంటి ఆందోళనలు జరుగకుండా కూకట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను నియమిస్తున్నట్టు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ బుధవారం ప్రకటించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని విడుదలచేశారు. ప్రస్తుతం ఎంపీగా ఉన్న సంజయ్ అంతకుముందు కరీంనగర్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌గా, పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేశారు.

## అవీ.. ఇవీ..

### కన్నా.. నిదురించరా!

**లండన్:** పసిపిల్లలకు నిద్ర ముఖ్యమని పరిశోధకులు చెప్తున్నారు. శిశువులు నిద్రపోయేందుకు ఎక్కువ సమయం తీసుకున్నా, అతి తక్కువగా నిద్రపోయినా, రాత్రిళ్లు పదే పదే నిద్రలేచినా.. తదుపరి బాల్య దశల్లో వారిలో భావోద్వేగ, ప్రవర్తన సంబంధమైన సమస్యలు ఎదురవుతాయని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రాథమిక దశలోనే నిద్ర సమస్యపై దృష్టిసారించాల్సిన అవసరం ఉన్నదని సూచిస్తున్నారు.



### సంగీతమే చికిత్స!

**వాషింగ్టన్:** 'బ్రెయిన్ ఫెయిల్యూర్' రోగులకు చికిత్స అందించడంలో సంగీతం ఎంతో ఉపకరిస్తుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగులకు శ్రావ్యమైన సంగీతాన్ని తక్కువ శబ్దంతో వినిపిస్తే అది వారి ఆరోగ్యం కుదుటపడేందుకు దోహదపడుతుందని పరిశోధకులు చెప్తున్నారు. వారికి మత్తుమందు ఇచ్చే అవసరం తగ్గుతుందని, తొందరగా ఫిజికల్ థెరపీ ఇచ్చేందుకు ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు.



### అప్పట్లో అరగంట తక్కువట!

**వాషింగ్టన్:** కొన్ని లక్షల సంవత్సరాల కిందట భూమిలో కూరుకుపోయిన ఒక చిన్న రాతి ముక్క.. భూభ్రమణం, పరిభ్రమణాన్ని లెక్కగట్టేందుకు సరికొత్త గడియారంగా మారింది. ఏడు కోట్ల సంవత్సరాల కిందట.. ఒక రోజుకు గంటలు ఇప్పటికంటే అరగంట తక్కువని క్రెటేసియస్ యుగానికి చెందిన ఈ రాయి ద్వారా వెల్లడైంది. భూమి నుంచి చంద్రుడు క్రమంగా ఏ విధంగా దూరం జరిగాడన్నది తెలుసుకునేందుకు ఇది దోహదపడుతుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.




### వేటగాళ్లకు శ్వేత జిరాఫీ బలి

**నైరోబీ:** ప్రపంచంలోనే అత్యంత అరుదైన శ్వేతజాతి జిరాఫీని వేటగాళ్లు పొట్టనపెట్టుకున్నారు. కెన్యాలో తప్ప ప్రపంచంలో మరెక్కడా ఇలాంటి జిరాఫీ కనిపించదు. ఆడ జిరాఫీ, దాని బిడ్డను దుండగులు చంపివేశారని, కుళ్లిన స్థితిలో మృతదేహాలను గుర్తించినట్లు కెన్యా అధికారులు తెలిపారు. ఈ జాతికి చెందిన ఒకే ఒక మగ జిరాఫీ మాత్రమే ఇక మిగిలి ఉన్నదని పేర్కొన్నారు.

### ఆ వర్సిటీలకు అంత సీనుందా?

**న్యూఢిల్లీ:** ఒడిశాలోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కేఐఐటీ), తమిళనాడులోని వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ)లకు ప్రతిష్ఠాత్మక 'ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్' (ప్రముఖ సంస్థ) గుర్తింపు పొందే అర్హత ఉన్నదా? అని కేంద్రం యూజీసీని ప్రశ్నించింది. మార్గదర్శకాలకు విరుద్ధంగా ఈ రెండు విద్యాసంస్థలకు ఐఓఎస్ గుర్తింపును ఇచ్చారంటూ ఈ నెల 3న 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలో వార్త వచ్చింది. దీనిని తీవ్రంగా పరిగణించిన కేంద్రం ఏ ప్రామాణికాల ప్రకారం గుర్తింపు ఇచ్చారన్నదానిపై వివరణ ఇవ్వాలని యూజీసీని ఆదేశించింది.



### హార్వేకు 23 ఏండ్ల జైలు

**న్యూయార్క్:** లైంగికదాడి, వేధింపుల కేసులో దోషిగా తేలిన హాలీవుడ్ బహిష్కృత నిర్మాత హార్వే వైన్‌స్టీన్‌కు న్యూయార్క్‌లోని ఓ కోర్టు 23 ఏండ్ల జైలుశిక్షను విధించింది. ప్రపంచవ్యాప్తంగా ఉద్ధృతంగా సాగిన 'మీటూ' ఉద్యమం సందర్భంగా హార్వే వ్యవహారం బయటపడింది. హార్వే తమపై లైంగికదాడికి పాల్పడినట్లు పలువురు మహిళలు ఆరోపించారు.

### చేతులు కలిపి ట్రంప్‌ను ఓడిద్దాం


**ఫిలడెల్ఫియా:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న జో బిడెన్ మంగళవారం కీలక రాష్ట్రాల్లో జరిగిన ప్రైమరీస్‌లో తన ప్రత్యర్థి బెర్నీ సాండర్స్‌పై ఘన విజయం సాధించారు. మిషిగాన్, మిసిసిపి, మిస్సోరిలలో బిడెన్‌కు 788 మంది డెలిగేట్స్ మద్దతుగా నిలిచారు. సాండర్స్‌కు 633 ఓట్లు వచ్చాయి. దీంతో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వం బిడెన్‌కు ఖాయమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సందర్భంగా బిడెన్ తన మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. 'మనకు ఉమ్మడి లక్ష్యం ఉంది. మనమంతా కలిసి డొనాల్డ్ ట్రంప్‌ను ఓడిద్దాం' అని బెర్నీ సాండర్స్‌కు స్నేహ హస్తం అందించారు.

# ఆయుధాల కొనుగోళ్లలో 2వ ర్యాంక్

- సౌదీ అరేబియా తర్వాత మనమే
- రష్యా, ఇజ్రాయెల్, ఫ్రాన్స్ నుంచి అత్యధిక కొనుగోళ్లు
- సిప్రి తాజా నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అత్యధికంగా ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో కొనసాగుతున్నది. భారత ఆయుధ మార్కెట్‌లో రష్యా వాటా 72 శాతం నుంచి 56 శాతానికి తగ్గినప్పటికీ, ఇప్పటికీ రష్యానే భారత్‌కు అతిపెద్ద ఆయుధ ఎగుమతిదారుగా ఉన్నది. 2015-19 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఆయుధ క్రయవిక్రయాలకు సంబంధించి 'అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ (సిప్రి)' తాజాగా వెల్లడించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

- ఆయుధాల దిగుమతిలో సౌదీ అరేబియా, భారత్, ఈజిప్ట్, ఆస్ట్రేలియా, చైనా వరుసగా తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి.
- ఇతర దేశాల నుంచి కూడా భారత్ మిలిటరీ హార్డ్‌వేర్‌ను దిగుమతి చేసుకున్నది. డెన్మార్క్ నుంచి స్కాంటర్-6000 రాడార్లు, బ్రెజిల్ నుంచి ఎంబ్రేర్ ఈఆర్‌జే-145 జెట్‌లు, జర్మనీ నుంచి అట్లాస్ సోనార్ సిస్టమ్స్, ఇటలీ నుంచి సూపర్ ర్యాపిడ్ 76ఎంఎం నావల్ గన్స్, దక్షిణ కొరియా నుంచి కే-9 థండర్ 155ఎంఎం ఆర్టిలరీ గన్స్‌ను కొనుగోలు చేసింది. మరోవైపు, పొరుగుదేశం పాకిస్థాన్ ఆయుధ కొనుగోళ్లలో 11వ స్థానంలో ఉన్నది. గతేడాది పుల్వామా ఉగ్రదాడి అనంతరం భారత్, పాక్ మధ్య జరిగిన గగనతల ఘర్షణల్లో ఇరుదేశాలూ దిగుమతి చేసుకున్న ఆయుధాలనే వాడాయి.




**23** ప్రపంచంలో ఆయుధ ఎగుమతి దేశాల్లో భారత్ స్థానం.
ఎక్కువగా మయన్మార్, శ్రీలంక, మారిషస్‌కు ఆయుధాలను ఎగుమతి చేస్తున్నాం.

# ఘర్‌వాపసీ

బీజేపీలో చేరిన జ్యోతిరాదిత్య సింధియా

కుటుంబంలోకి రావడం వంటిదేనన్న జేపీ నడ్డా

- వెంటనే రాజ్యసభ సీటు ఖరారు
- బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ క్యాంప్‌లు
- 95 మంది ఎమ్మెల్యేలను జైపూర్‌కు తరలించిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌లో ఎంతో వేదన అనుభవించా: సింధియా
- అత్యాశతోనే పార్టీని వీడారు: దిగ్విజయ్ సింగ్

**న్యూఢిల్లీ/భోపాల్, మార్చి 11:** మధ్యప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభం మరింత తీవ్రమైంది. కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జ్యోతిరాదిత్య సింధియా.. బుధవారం బీజేపీలో చేరారు. వెంటనే ఆయనకు రాజ్యసభ సీటు ఖరారైంది. మరోవైపు బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ క్యాంప్‌లు మొదలు పెట్టాయి. బీజేపీ హర్యానాలోని గుర్గావ్‌లో ఉన్న ఓ విలాసవంతమైన హోటల్‌కు తమ ఎమ్మెల్యేలను తరలించింది. కాంగ్రెస్ పార్టీ 95 మంది ఎమ్మెల్యేలను రాజస్థాన్‌లోని జైపూర్‌కు పంపించింది. ఇందులో 92 మంది కాంగ్రెస్ సభ్యులు కాగా, మరో ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు. వారికి రాజస్థాన్ సీఎం అశోక్‌గెహ్లాట్, ఇతర సీనియర్ నేతలు ఆహ్వానం పలికారు. వారిని బ్యూనా విస్టా రిసార్ట్‌కు తరలించినట్టు సమాచారం. గతంలో మహారాష్ట్రలో శివసేన, బీజేపీ మధ్య రాజకీ సంక్షోభం తలెత్తినప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఇదే రిసార్ట్‌కు తరలించారు.



ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో జ్యోతిరాదిత్య సింధియాకు పుష్పగుచ్ఛం అందజేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

**వాస్తవ దూరంగా కాంగ్రెస్: సింధియా**

ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా కండువా కప్పి జ్యోతిరాదిత్య సింధియాను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నడ్డా మాట్లాడుతూ.. జ్యోతిరాదిత్య నానమ్మ విజయరాజె సింధియా బీజేపీ వ్యవస్థాపకుల్లో ఒకరని గుర్తుచేశారు. సింధియా కుటుంబంలోని మిగతావారంతా బీజేపీలో ఉన్నారని చెప్పారు. కాబట్టి జ్యోతిరాదిత్య తన కుటుంబంలోకి వస్తున్నట్టేనని చెప్పారు. సింధియా మాట్లాడుతూ.. బీజేపీ కుటుంబంలోకి ఆహ్వానించినందుకు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జేపీ నడ్డాకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు సేవచేసే వేదికను కల్పించారని కొనియాడారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఎంతో వేదన అనుభవించానని, ఒత్తిడికి గురయ్యానని చెప్పారు. దీంతో ప్రజలకు సేవచేసే అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. కాంగ్రెస్ ఒకప్పటిలా లేదని, వాస్తవదూరంగా ప్రవర్తిస్తున్నదని విమర్శించారు. దీంతో ప్రతిచోటా ప్రజలు ఆ పార్టీని తిరస్కరిస్తున్నారని అన్నారు. మధ్యప్రదేశ్ తన హృదయంలో ఒక భాగమని వ్యాఖ్యానించారు. రాష్ట్రం గురించి తాను కన్న కలలన్నీ గత 18 నెలల కాలంలో కల్లలుగానే మిగిలిపోయాయని చెప్పారు. ప్రధాని మోదీ గొప్ప నాయకుడని, ఆయన చేతుల్లో దేశభవిష్యత్తు భద్రంగా ఉంటుందని కొనియాడారు. జ్యోతిరాదిత్య బీజేపీలో చేరిన వెంటనే ఆయనకు రాజ్యసభ సీటు ఖరారైంది. ఆయనకు మధ్యప్రదేశ్ నుంచి టికెట్ కేటాయిస్తూ బీజేపీ నిర్ణయం తీసుకున్నది.

**కొడుకులాంటోడు మోసంచేశాడు: దిగ్విజయ్**

జ్యోతిరాదిత్య సింధియా తన కొడుకులాంటివాడని, తనను మోసం చేశాడని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ పేర్కొన్నారు. బుధవారం పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ.. '2018లో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలిచిన వెంటనే డిప్యూటీ సీఎం పదవి ఇస్తామని సింధియాకు ఆఫర్ ఇచ్చాం. అయితే తన అనుచరుడిని కూర్చోబెట్టాలని సింధియా పట్టుబట్టారు. దీంతో అనర్హులకు పదవి ఇచ్చేదిలేదంటూ కమల్‌నాథ్ తిరస్కరించారు' అని పేర్కొన్నారు. సింధియా వర్గానికి చెందిన ఆరుగురికి మంత్రి పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. సింధియాకు పార్టీ ఎంతో ఇచ్చిందని, అయినా ఆయన అత్యాశతో బీజేపీలో చేరారని విమర్శించారు. 'ఆయనను మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు పంపగలుగుతాం. కానీ కేంద్ర మంత్రి పదవి ఇవ్వలేం కదా. మోదీ, షా మాత్రమే ఆ పని చేయగలరు' అని ఎద్దేవా చేశారు. కమల్‌నాథ్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో నెగ్గుతుందని ధీమా వ్యక్తం చేశారు. సింధియా వర్గంలోని 22 మంది ఎమ్మెల్యేల్లో 13 మంది కాంగ్రెస్‌ను వీడేందుకు సిద్ధంగా లేరని దిగ్విజయ్ చెప్పారు. జ్యోతిరాదిత్యకు రాజ్యసభ టికెట్ ఇచ్చేలా ఒత్తిడితెచ్చేందుకే వారు బెంగళూరుకు వెళ్లారని చెప్పారు. బీజేపీ నేతృత్వంలోనే ఇదంతా జరుగుతున్నదని విమర్శించారు. రెబల్ క్యాంప్‌లోని ఎమ్మెల్యేల ఫోన్లను గుంజుకున్నారని, కనీసం వారిని కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడనివ్వడం లేదని, ఒకవేళ మాట్లాడినా రికార్డు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నిస్సిగ్గుగా ఎమ్మెల్యేలను ప్రలోభ పెడుతున్నదని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఆరోపించారు.



'మోదీజీ.. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోయడంలో మీరు బిజీగా ఉన్నారు. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు 35 శాతం తగ్గిన విషయాన్ని మీరు గుర్తించినట్టు లేరు. దయచేసి ఆ ప్రయోజనాలను భారతీయులకు అందించండి. పెట్రోల్ ధరను లీటర్‌కు రూ.60 దిగువకు తగ్గించండి. ఆర్థికరంగానికి ఊతమివ్వండి'

– కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ట్వీట్

లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన సింధియా.. త్వరగా రాజకీయ పునరావాసాన్ని కోరుకున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ముందుగానే సింధియాతో చర్చించి కొత్త బాధ్యతలు అప్పగించిఉంటే బాగుండేది. అయినా.. మధ్యప్రదేశ్‌లో అద్భుతం జరుగొచ్చు. సీఎం కమల్‌నాథ్ శక్తిసామర్థ్యాలపై కాంగ్రెస్ నేతలకు నమ్మకం ఉన్నది. మధ్యప్రదేశ్ వంటి పరిస్థితి మహారాష్ట్రలో లేదు. శివసేన-ఎన్సీపీ-కాంగ్రెస్ ప్రభుత్వం చక్కగా పనిచేస్తున్నది.

– శరద్‌పవార్, ఎన్సీపీ అధినేత

## 52 ఏండ్ల తర్వాత మళ్లీ..

సింధియాల రాజీనామాలతో కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఎసరు



**భోపాల్:** మధ్యప్రదేశ్‌లో సింధియా కుటుంబం కాంగ్రెస్ నుంచి వైదొలిగినప్పుడల్లా రాష్ట్ర ప్రభుత్వాలకు ముప్పు ఏర్పడుతున్నది. యాభై రెండేండ్ల తర్వాత చరిత్ర పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్వాలియర్ సంస్థానానికి చెందిన 'రాజమాత' విజయరాజె సింధియా దేశ తొలి ప్రధాని నెహ్రూకు సన్నిహితురాలు. ఆమె కాంగ్రెస్ నుంచే తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అయితే 1967లో ఆమె కాంగ్రెస్ నుంచి వైదొలగడంతో నాటి డీపీ మిశ్రా సర్కారు పడిపోయింది. లోక్‌సభ, శాసనసభ అభ్యర్థుల జాబితాతో ముఖ్యమంత్రి వద్దకు వెళ్లినప్పుడు రెండుగంటలపాటు వేచి చూడాల్సి రావడం విజయరాజె ఆగ్రహానికి కారణమైంది. దీంతో తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి గోవింద్ నారాయణ్ సింగ్‌కు మద్దతివ్వడంతో ఆయన సీఎం అయ్యారు. ప్రస్తుతం రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడైన జ్యోతిరాదిత్య కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పగా.. నాటి చరిత్రే పునరావృతమయ్యే అవకాశాలున్నాయి.

## నిర్భయ దోషులను ఇంటర్వ్యూ చేయొచ్చా?

**న్యూఢిల్లీ:** నిర్భయ దోషులను ఇంటర్వ్యూ చేయడానికి మీడియా సంస్థకు అనుమతినిచ్చే అంశాన్ని పరిశీలించాలని తీహార్ జైలు అధికారులను ఢిల్లీ హైకోర్టు కోరింది. నలుగురు దోషులులను ఇంటర్వ్యూ చేయడానికి తీహార్‌జైలు అధికారుల అనుమతి కోరుతూ ఆ సంస్థ గత నెల 25న దరఖాస్తు చేసుకుంది. దీనిని అధికారులు తిరస్కరించడంతో హైకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ నవీన్ చావ్లా సారథ్యంలోని బెంచ్ విచారణ జరిపింది. జైలు అధికారులు తమ నిర్ణయాన్ని గురువారం తెలియజేయాలని ఆదేశించింది. కాగా, గతేడాది జైల్లో తనపై ఇద్దరి కానిస్టేబుళ్లు దాడి చేశారని, వారిపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని కోరుతూ పవన్ పిటిషన్ దాఖలు చేశాడు.

## పవార్, శిబూసోరెన్ నామినేషన్లు

**ముంబై/ రాంచీ:** ఈ నెల 26న జరుగనున్న రాజ్యసభ ఎన్నికల కోసం మహారాష్ట్ర నుంచి ఎన్సీపీ అధినేత శరద్ పవార్, జార్ఖండ్ నుంచి జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అధ్యక్షుడు శిబూసోరెన్ నామినేషన్లు దాఖలు చేశారు. ఎనిమిదిసార్లు లోక్‌సభకు గెలిచిన సోరెన్.. తొలిసారి రాజ్యసభకు వెళ్లనున్నారు.

# తీపి.. మహా ప్రీతి!

చక్కెర లేకుండా ఉండలేమంటున్న భారతీయులు

తక్కువ క్యాలరీల షుగర్ తీసుకోవాలని నిపుణుల సూచన




**ముంబై:** అది పండుగైనా.. పుట్టినరోజైనా.. పెండ్లయినా పేరంటమైనా భారతీయ వేడుకల్లో తీపి పదార్థాలు ఉండాల్సిందే. మన రోజువారీ జీవనంలో చక్కెర అనేది అతిముఖ్యమైన భాగం. తీపి.. మనవాళ్లకు మహా ప్రీతి. ఈ నేపథ్యంలో చక్కెర వినియోగంపై ఇటీవల ముంబైలోని ఒక మాల్‌లో నిర్వహించిన సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. 'తీపి' లేకపోతే జీవితం చేదుమయం అవుతుందని దాదాపు 60 శాతం మంది అభిప్రాయపడ్డారు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. షుగర్‌తో వచ్చే క్యాలరీలు, కలిగే దుష్ప్రభావాల గురించి దాదాపు 75 శాతం మందికి అవగాహన ఉండడం. చక్కెర నుంచి ఎక్కువ క్యాలరీలు పొందడం వల్ల తలెత్తే పరిణామాల గురించి తెలిసినప్పటికీ, భారతీయులు షుగర్‌కు దూరంగా ఉండలేకపోతున్నారని సర్వే పేర్కొంది. అందుకే రెగ్యులర్ షుగర్ నుంచి ఆరోగ్యకర షుగర్‌వైపు మళ్లడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. దీని వల్ల తీపిపై మక్కువ తీరడంతోపాటు క్యాలరీలు కూడా తగ్గుతాయని చెప్తున్నారు.

**మఖానాస్‌తో డయాబెటిస్‌కు చెక్**

డయాబెటిస్‌తో బాధపడేవారికి మఖానాస్ లేదా ఫాక్స్ నట్స్ (తామరగింజలు) ఎంతో ఉపయోగకరమని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. చక్కెర స్థాయిలను ఇవి నియంత్రిస్తాయి. మెగ్నీషియం ఉండడం, సోడియం తక్కువగా ఉండడం వల్ల డయాబెటిస్‌తో బాధపడేవారు దీన్ని స్నాక్‌గా తీసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## శివకుమార్‌కు కర్ణాటక పీసీసీ పగ్గాలు



**న్యూఢిల్లీ:** కర్ణాటక కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడిగా డీకే శివకుమార్‌ను ఆ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ నియమిస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దినేశ్ గుండూరావు స్థానంలో శివకుమార్ బాధ్యతలు స్వీకరిస్తారు. కర్ణాటక సీఎల్పీ నేతగా, మాజీ సీఎం సిద్దరామయ్య కొనసాగనున్నారు. శివకుమార్‌కు కాంగ్రెస్‌లో ట్రబుల్ షూటర్‌గా పేరుంది. కాగా, ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడిగా అనిల్ చౌదరిని సోనియాగాంధీ నియమించారు.

# ఏ ఒక్కరినీ వదలం

- ముందస్తు కుట్రతోనే ఢిల్లీలో హింసాకాండను రగిలించారు
- నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- లోక్‌సభలో చర్చకు హోంమంత్రి అమిత్‌షా సమాధానం
- ఏడుగురు కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్ తొలగింపు




**న్యూఢిల్లీ, మార్చి 11:** దేశ రాజధాని ఢిల్లీలో హింసాకాండకు కారణమైన వ్యక్తులను వదిలి పెట్టే ప్రసక్తే లేదని, కులం, మతం, పార్టీలకతీతంగా కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. అమాయకులను వేధించబోమని చెప్పారు. ఢిల్లీ అల్లర్లపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చకు ఆయన సమాధానమిస్తూ.. కుట్ర పూరితంగా ముందస్తు ప్రణాళిక మేరకే హింసా కాండ జరిగినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయన్నారు. హింసాకాండలో మరణించిన వారి పట్ల విచారం వ్యక్తం చేశారు. హింసాకాండ మొదలైన 36 గంటల్లోనే ఢిల్లీ పోలీసులు వాటిని అదుపులోకి తీసుకొచ్చి, ఇతర ప్రాంతాలకు అల్లర్లు విస్తరించకుండా అడ్డుకున్నారని అమిత్ షా చెప్పారు. ఢిల్లీ పోలీసుల్లో నైతిక స్థైర్యం నింపడానికి తన అభ్యర్థన మేరకే జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ బాధిత ప్రాంతాల్లో పర్యటించారని తెలిపారు. పోలీసుల దృష్టి మళ్లించకుండా ఉండేందుకే తాను అల్లర్లు జరిగిన ప్రాంతాల్లో పర్యటించలేదన్నారు. ఆయన సమాధానమిస్తుండగానే కాంగ్రెస్ పార్టీ వాకౌట్ చేసింది. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ అల్లర్లపై చర్చ విషయంలో విపక్షానికి సీరియస్‌నెస్ లేదని ఎద్దేవా చేశారు. అంతకుముందు లోక్‌సభలో జరిగిన చర్చలో విపక్ష సభ్యులు హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అధికార బీజేపీ సభ్యులు మాట్లాడుతూ ఢిల్లీ అల్లర్లను ప్రతిపక్షం సంకుచిత ప్రయోజనాల కోసం రాజకీయం చేస్తున్నదని ఆరోపించారు. 'ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవల శాంతిభద్రతల పరిస్థితులు' అనే అంశంపై కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి చర్చను ప్రారంభిస్తూ మూడు రోజులుగా హింసాకాండ సాగినా ఢిల్లీ పోలీసులు ఎందుకు నిలువరించలేకపోయారని ప్రశ్నించారు. ఢిల్లీలో అల్లర్లు జరుగుతున్నా.. ప్రధాని మోదీ మాత్రం నీరో చక్రవర్తిగా అహ్మదాబాద్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆతిథ్యం ఇవ్వడంలో బిజీబిజీగా ఉన్నారని ఆరోపించారు. అల్లర్లు జరిగిన ప్రాంతాల్లో అజిత్ దోవల్‌కు బదులు హోంమంత్రి అమిత్‌షా ఎందుకు పర్యటించలేదని నిలదీశారు. ఢిల్లీ అల్లర్లపై రాజ్యసభలో గురువారం చర్చ జరుగనున్నది.

**రైల్వేలో తగ్గనున్న సరకు రవాణా చార్జీలు**

తూర్పు, పశ్చిమ ప్రాంత పరిధిలో సరకు రవాణా కోసం ప్రత్యేక కారిడార్ల విధానాన్ని అమలు చేస్తామని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ లోక్‌సభలో తెలిపారు. దీంతో లుథియానా నుంచి దన్‌కుని వరకు, దాద్రి నుంచి జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు ట్రస్ట్ వరకు రైళ్లల్లో సరకు రవాణా చార్జీలు తగ్గే అవకాశముందని పేర్కొన్నారు.

- ఏడుగురు కాంగ్రెస్ సభ్యులపై విధించిన సస్పెన్షన్‌ను స్పీకర్ తొలిగించారు. ఈ మేరకు మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.
- 2016-17 నుంచి 2018-19 మధ్య సైన్యం 1.65 లక్షల మందిని నియమించుకున్నదని రక్షణశాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్ తెలిపారు.
- ఎంపీలాడ్ పథకం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ నెల నాలుగో తేదీ నాటికి రూ.5,275.24 కోట్లు ఖర్చు కాలేదని కేంద్ర మంత్రి ఇందర్‌జిత్ సింగ్ తెలిపారు. 2017 మార్చినాటికి రూ.5,029 కోట్లు, 2018 మార్చినాటికి రూ.4,877 కోట్లు, 2019 మార్చి నాటికి రూ.4,103 కోట్లు ఖర్చు కాలేదన్నారు.

## హిందుత్వ విద్వేషపు సునామీ: అసదుద్దీన్ ఒవైసీ



ఢిల్లీలో 'హిందుత్వ విద్వేషపు సునామీ' విరుచుకుపడిందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ హింసాకాండ నుంచి ముస్లింలను సిక్కులు కాపాడారని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణకు తాము ప్రాణాలిచ్చేందుకు సిద్ధమన్నారు. అయితే, ఒవైసీ వ్యాఖ్యలపై మంత్రులు రవిశంకర్ ప్రసాద్, కిషన్ రెడ్డి తీవ్ర నిరసన తెలిపారు. దీంతో ఒవైసీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలిగిస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు.

# వీసాలు రద్దు

మొదటిపేజీ తరువాయి...

సమర్పించాలని, ఎవరికైనా కరోనా సోకినట్లు తేలితే నౌక నుంచి దిగేందుకు ఎవరినీ అనుమతించబోమని స్పష్టం చేసింది.

**60కి చేరిన కరానో కేసులు**

దేశంలో కరోనా నిర్ధారణ కేసుల సంఖ్య 60కి చేరింది. ఇందులో 16 మంది ఇటలీ దేశస్థులున్నట్లు కేంద్రం పేర్కొంది. ఢిల్లీ, రాజస్థాన్‌లో బుధవారం కొత్తగా ఒక్కో పాజిటివ్ కేసు నమోదైనట్లు తెలిపింది. కేరళ, ఉత్తర ప్రదేశ్‌లో 9 చొప్పున, ఢిల్లీలో 5, కర్ణాటకలో 4, మధ్యప్రదేశ్, లడఖ్‌లో రెండేసి, జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడులో ఒక్కోటి చొప్పున కరోనా కేసులు నమోదయ్యాయని, కేరళలో ముగ్గురు కోలుకున్నారని వెల్లడించింది. ప్రపంచ దేశాలను వణికిస్తున్న కరోనాను 'మహమ్మారి'గా పేర్కొనవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అధిపతి బుధవారం తెలిపారు.

**బ్రిటీష్ నాటి చట్టంతో చెక్..**

దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణకు బ్రిటీష్ కాలం నాటి అంటువ్యాధి చట్టం 1897ను అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీని ప్రకారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసే నిబంధనలను అన్ని రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాలు కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. నిబంధనలను ఉల్లంఘించిన వారికి శిక్ష విధిస్తారు. 18వశతాబ్దంలో ప్లేగు వ్యాధిని నియంత్రించేందుకు బ్రిటీష్ పాలకులు ఈ చట్టాన్ని రూపొందించారు. విపత్తు నిర్వహణ చట్టం 2005ను కూడా అమలుచేయనున్నారు.



వాటికన్ నగరంలో కరోనా కేసులు నమోదు కావడంతో మంగళ వారం నుంచి పర్యాటకుల రాకపై నిషేధం విధించారు. దీంతో పర్యాటకులతో కళ కళ లాడే సెయింట్ పీటర్స్ స్క్వేర్ ఇలా నిర్మానుష్యంగా కనిపించింది.

**రూ.5.8 కోట్ల కోళ్ల ఉత్పత్తులు ధ్వంసం**

కరోనా భయంతో మహారాష్ట్రకు చెందిన కోళ్ల పరిశ్రమ రైతు సురేశ్ భట్లేకర్ రూ.5.8 కోట్ల విలువైన కోళ్ల ఉత్పత్తులు ధ్వంసం చేశాడు. ఆయనకు మహారాష్ట్ర, గుజరాత్‌లో 35 కోళ్ల ఫారాలు, మూడు కోడి పిల్లల ఉత్పత్తి కేంద్రాలున్నాయి. కరోనా నేపథ్యంలో చికెన్, గుడ్లపై జరుగుతున్న అసత్య ప్రచారంతో అమ్మకాలు తగ్గాయి. దీంతో నష్టాలు తగ్గించుకునేందుకు 1.75 లక్షల కోడిపిల్లలు, 9 లక్షల గుడ్లను గుంతతీసి పూడ్చినట్లు పేర్కొన్నాడు.

**బ్రిటన్ ఆరోగ్య మంత్రికి కరోనా**

బ్రిటన్ ఆరోగ్యమంత్రి నదిన్ డోరీస్‌కు కరోనా పాజిటివ్‌గా తేలింది. ఈ విషయాన్ని స్వయంగా ఆమే వెల్లడించారు. ప్రధాని బోరిస్ గత వారం నిర్వహించిన సమావేశంలో డోరిస్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మంత్రుల్లో ఇంకెవరికైనా కరోనా సోకి ఉంటుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్రిటన్‌లో కరోనా కేసుల సంఖ్య 382కు చేరగా ఇప్పటి వరకు ఆరుగురు మరణించారు. ఇటలీలో కరోనా మరణాల సంఖ్య 631కి చేరింది. మొత్తంగా 107 దేశాల్లో కేసుల సంఖ్య 1,17,339కి, మృతుల సంఖ్య 4,251కి చేరింది. చైనాలో కరోనా కేసులు, మరణాలు తగ్గుముఖంపట్టాయి. బుధవారం 22 మంది చనిపోయారు. కొత్తగా 24 కేసులు నమోదయ్యాయి. పరిస్థితులు సాధారణస్థితికి వస్తుండటంతో వూహాన్‌లో వ్యాపార, వాణిజ్య సంస్థలు మళ్లీ తెరుచుకుంటున్నాయి.



కరోనా వైరస్ ఉన్న దేశాల నుంచి తమకు కోవిడ్-19 లేదన్న డాక్టర్ల నిర్ధారణ సర్టిఫికెట్ ఉంటేనే భారత్‌కు రావాలని కేంద్రం అనటం దురదృష్టకరం. వ్యాధి సోకిందన్న కారణంతో భారతీయులను దేశానికి రావొద్దని ఎలా అంటారు? ఇది అనాగరికం.

**పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి**

జ్యోతిరాదిత్య సింధియాకు ఏమైందో కచ్చితంగా నాకు తెలియదు. కానీ ఇవ్వాళ సిద్ధాంతాలనేవి లేకుండా పోతున్నాయి. పార్టీలు, నేతలు సిద్ధాంతాలకు కట్టుబడి ఉండటం లేదు. ప్రజలు కూడా అంతే. ఇది చాలా దురదృష్టకరం.

**ప్రతాప్‌సింగ్ బజ్వా, కాంగ్రెస్ నాయకుడు**





**చరిత్రలో నేడు**



**1912**
అమెరికాలో బాలికల స్కౌట్స్‌ను ప్రారంభించిన జులియెట్టీ గార్డన్ లో.

**1930**
ఉప్పుపై పన్నుకు నిరసనగా 300 కి.మీ. పాదయాత్ర మొదలుపెట్టిన గాంధీ.





**1971**
సిరియా అధ్యక్షునిగా ఎన్నికైన హాఫీజ్ అల్ అసద్.

టోక్యో 2020 ఒలింపిక్స్ యథావిధిగా జరుగుతాయా లేక కరోనా వైరస్ కారణంగా వాయిదా పడుతాయా అనే అనుమానం కలుగుతున్నది. ఈ వైరస్ వ్యాప్తి వల్ల సాంస్కృతిక, మత, క్రీడా కార్యక్రమాలు నిలిచిపోతున్నాయి. టోక్యో వేసవి ఒలింపిక్ క్రీడలను రద్దు చేయడమో, వాయిదా వేయడమో జరుగలేదని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అధ్యక్షుడు థామస్ బాచ్ తెలిపారు. కానీ జపాన్ ఒలింపిక్ మంత్రి మాత్రం క్రీడలు వాయిదా పడుతాయన్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా అందరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

**సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్**

ఆస్ట్రేలియాలో సైనికుల కార్యకలాపాల మూలంగా విడుదలవుతున్న కాలుష్య విషయమై స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి విజయం సాధించడం విశేషం. న్యూ సౌత్‌వేల్స్‌లోని విలియం టౌన్, నార్తెర్న్ టెరిటరీలోని కాథరీన్, క్వీన్స్‌లాండ్‌లోని ఓకీ ప్రాంతాల్లో సైనికులు ఫైర్ డ్రిల్స్ సందర్భంగా విషపూరితమైన రసాయన నురుగును ఉపయోగిస్తున్నారు. ఈ రసాయన కాలుష్యం వల్ల స్థానికులు ఇండ్లలో నివసించలేకపోతున్నారు. భూములు విలువ కోల్పోయి అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడ్డది. న్యాయస్థానం వీరికి పరిహారం చెల్లించాలని రక్షణశాఖను ఆదేశించింది.

**ది సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్**



# సంక్షోభ బ్యాంక్

పంజాబ్ మహారాష్ట్ర సహకార బ్యాంక్ (పీఎంసీ) కుంభకోణం మర్చిపోకముందే తాజాగా యెస్ బ్యాంక్ సంక్షోభంలో కూరుకుపోయింది. దేశంలోని అతిపెద్ద ప్రైవేటు రంగ బ్యాంకుల్లో నాలుగోదైన యెస్ బ్యాంకు బోర్డు తిప్పేసే పరిస్థితి రావటంతో ఖాతాదారులలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. మొత్తంగా బ్యాంకింగ్ రంగంపైనే ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లే దుస్థితి ఏర్పడింది. యెస్ బ్యాంక్ నిర్వహణ తీరుపై రెండేండ్లుగా ప్రజల్లో అనేక అనుమానాలు ఏర్పడ్డాయి. మొండి బకాయిలు పేరుకుపోవడంతో యెస్ బ్యాంక్ కుదేలైంది. బ్యాంకులపై ఎనలేని విశ్వాసంతో తమ కష్టార్జితాన్ని పొదుపు రూపంలో, డిపాజిట్ల రూపంలో ప్రజలు జమ చేసుకుంటారు. పిల్లల వివాహాల కోసమో, చదువుల కోసమో, అత్యవసరాల్లో ఆసరాగా ఉంటుందనో బ్యాంకుల్లో దాచుకుంటారు. ఆ సొమ్ము రాత్రికిరాత్రి ఆవిరైపోతుంటే పకడ్బందీగా ఏటా నిర్వహిస్తున్నామంటున్న ఆడిట్‌లు, రిజర్వ్ బ్యాంక్ పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మిగులుతున్నాయి. ఎప్పటికప్పుడు తప్పుడు లెక్కలతో కాలం గడుపుతూ, బ్యాంకు నిర్వహణలో అవకతవకలకు పాల్పడుతున్న తీరుపై ఈడీ ఉచ్చు బిగించటంతో యెస్ బ్యాంక్ బాగోతం బయటపడింది. నష్ట నివారణ కోసం అని ఆర్‌బీఐ ముందుకువచ్చి డిపాజిట్‌దారులకు భరోసానివ్వటం ఆహ్వానించదగినదే అయినా, ఇలా ఒకదాని తర్వాత ఒకటిగా బ్యాంకులు సంక్షోభంలో కూరుకుపోవటాన్ని నిలువరించలేమా అన్నది ప్రశ్న!

ఆర్బీఐ అనుమతితో వెలుస్తున్న బ్యాంకులు ప్రజల సొమ్ముకు కాపలాదారులుగా, రక్షకులుగా వ్యవహరించాలి. కానీ యెస్ బ్యాంక్ వ్యవస్థాపకుడైన రాణాకపూర్ నిర్వహణ కార్యకలాపాలన్నీ లోపభూయిష్టంగా ఉన్నాయి. బ్యాంకులోని సొమ్మంతా తనదే అన్నట్లుగా వివిధ పేర్లతో ఉన్న 40 సొంత సంస్థల్లోకి మళ్లించాడు. నిబంధనలన్నీ తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా రుణాలిచ్చాడు. దీంతో మొండిబకాయిలు వేల కోట్లలో పేరుకొనిపోయాయి. నిరర్థక ఆస్తులు తడిసి మోపెడయ్యాయి. నిబంధనల ప్రకారం డిపాజిట్‌దారులకు సొమ్ము చెల్లించలేని స్థితి ఏర్పడింది. బ్యాంక్ దుస్థితిని పసిగట్టడం వల్ల కావచ్చు, నిరుడు మార్చి-సెప్టెంబర్ మధ్యకాలంలో ఏకంగా 18 వేల కోట్లకు పైగా డిపాజిట్లకు రెక్కలొచ్చాయి. ఈ క్రమంలో బ్యాంక్ నిర్వహణలో చెప్పినవన్నీ కాకిలెక్కలేనని తేలింది. 2017లో బ్యాంకుకు ఉన్న నిరర్థక ఆస్తుల విలువ రెండు వేల కోట్లని చెప్పినా, అది వాస్తవంగా 8 వేల కోట్లని ఆర్బీఐ లెక్కగట్టింది. అలాగే 2019లోనూ నిరర్థక ఆస్తులు 7,883 కోట్లు అని తెలిపినా, అవి 11,160 కోట్లని ఆర్బీఐ తేల్చింది. అర్హత లేకున్నా ఆశ్రితులకు లెక్కలేకుండా రుణాలు ఇవ్వటంతో మొండి బకాయిలు మోయలేని భారంగా మారాయి. రుణభారం యెస్ బ్యాంక్ పుట్టిముంచుతుందని 2015లోనే యూబీఎస్ హెచ్చరించింది. బ్యాంక్ వ్యవహారాలపై సెబీకి కూడా ఫిర్యాదులు అందాయి. ఆర్‌బీఐ, కేంద్ర ఆర్థికసంస్థలు చర్యలకు ఉపక్రమించే లోపే యెస్ బ్యాంక్ వ్యవహారం రోడ్డున పడింది. ఖాతాదారులను ఆదుకునేందుకు ఆర్బీఐ ముందుకువచ్చి నగదు ఉపసంహరణకు నెలకు 50 వేల పరిమితి విధించింది. ప్రజల సొమ్మును ప్రైవేటు సంస్థలు ఇష్టారాజ్యంగా బుక్కితే, ప్రజలను ఆదుకునేందు కు ప్రభుత్వసంస్థల నుంచి నిధులు వెచ్చించటం పట్లా విమర్శలున్నాయి. ప్రభుత్వ సంస్థలు నష్టపోతే, దేశంలోని కుబేరులైన వారు ఆదుకున్న దాఖలాలు ఏనాడూ లేవు. సాధారణంగా ప్రైవేటు సంస్థలు సత్వర సేవలు అందిస్తూ, పారదర్శకంగా వ్యవహరిస్తూ ప్రజల మన్ననలు పొందుతాయనీ, ప్రభుత్వ సంస్థలు అలసత్వానికి ప్రతీకగా నిలుస్తూ పౌరసేవలు అందించటంలో నిర్లక్ష్యంగా ఉంటాయనీ ప్రచారంలో ఉన్నది. కానీ గత కొన్నేండ్లుగా దేశంలో ప్రైవేటు బ్యాంకుల తీరు ఇందుకు విరుద్ధంగా ఉన్నది. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసి దర్జా చేసిన ఉదంతాలే ఎక్కువ.

> **ఆర్బీఐ అనుమతితో వెలుస్తున్న బ్యాంకులు ప్రజల సొమ్ముకు కాపలాదారులుగా, రక్షకులుగా వ్యవహరించాలి. కానీ యెస్ బ్యాంక్ వ్యవస్థాపకుడైన రాణాకపూర్ నిర్వహణ కార్యకలాపాలన్నీ లోపభూయిష్టంగా ఉన్నాయి. బ్యాంకులోని సొమ్మంతా తనదే అన్నట్లుగా వివిధ పేర్లతో ఉన్న 40 సొంత సంస్థల్లోకి మళ్లించాడు. నిబంధనలన్నీ తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా రుణాలిచ్చాడు. దీంతో మొండిబకాయిలు వేల కోట్ల లో పేరుకొనిపోయాయి. నిరర్థక ఆస్తులు తడిసిమోపెడయ్యాయి.**

దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ గత కొన్నేండ్లుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులన్నీ మొండి బకాయిలు, నిరర్థక ఆస్తులతో సతమతమవుతున్నాయి. బ్యాంకుల దగ్గర రుణాలు తీసుకున్న బడాబాబులు ఉద్దేశపూర్వకంగా ఎగవేస్తున్నారు. విల్‌ఫుల్ డీఫాల్టర్లలో పెద్దపెద్ద కంపెనీలు మొదలు ప్రముఖ రాజకీయ నేతలెందరో ఉన్నారు. వీరినుంచి మొండి బకాయిలను వసూలుచేయటం బ్యాంకులకు తలకుమించిన భారంగా మారింది. ప్రైవేటు బ్యాంకుల పరిస్థితి మరింత దయనీయం. ఈ పరిస్థితిని అధిగమించటం కోసమే దేశంలో బ్యాంకుల విలీన ప్రక్రియ కొనసాగింది. నిరర్థక అస్తుల నేపథ్యంలో రుణాలు 9 శాతానికి తగ్గించుకోవాలని కూడా బ్యాంకులకు ఆర్బీఐ సూచించింది కూడా. అయినా యెస్ బ్యాంక్ నిర్వాహకులు దేన్నీ ఖాతరు చేయలేదు. 30 శాతం రుణాలిచ్చి బ్యాంకు పతనానికి కారణమయ్యారు. బ్యాంక్ నిర్వహణలో ఒక ఆర్బీఐ ప్రతినిధి కూడా ఉంటాడు. క్రమం తప్పకుండా జరిగే ఆడిటింగ్ వ్యవహారాల్లో భాగస్వామిగా, సాక్షిగా కూడా వ్యవహరిస్తాడు. అయినా యెస్ బ్యాంక్‌లో ఇంతటి అవకతవకలు చోటుచేసుకున్నాయంటే తిలాపాపం తలా పిడికెడు అని చెప్పకతప్పదు. ఇప్పటికైనా కేంద్రం, ఆర్బీఐ నిరంతర పర్యవేక్షణతో బ్యాంకుల అక్రమాలను అరికట్టాలి. మదుపుదారుల, డిపాజిట్‌దారుల ప్రయోజనాలను పరిరక్షించాలి. బ్యాంకింగ్ వ్యవస్థపై విశ్వసనీయతను మళ్లీ కల్పించడం తక్షణావసరం.

**జనగళం**

### హర్షణీయం

ఆర్టీసీ సంఘాలు ఉద్యోగులను తప్పుబాట పట్టించడం మూలంగా ఆర్టీసీ ఉద్యోగులు 60 రోజుల పాటు సమ్మె చేసిన విషయం తెలిసిందే. ఆఖరికి సంఘాలు చేతులెత్తేసి ఎంతోమంది ఉద్యోగుల మర ణాలకు కారణమయ్యాయి. ఉద్యోగుల పట్ల, వారి కుటుంబాల పట్ల సానుభూతి చూపించిన రాష్ట్ర ప్రభుత్వం తిరిగి వాళ్లను ఉద్యోగంలోకి తీసుకున్నది. అయితే ప్రభుత్వం సమ్మె కాలానికి వేతనం చెల్లిస్తుందా లేదా అన్న అనుమానం ఉద్యోగుల్లో ఉండింది. ఆ అనుమానాలను పటాపంచలు చేస్తూ సీఎం కేసీఆర్ సమ్మెకాలం జీతం మీ బ్యాంకుల్లో ఉన్నట్లేనని ఓ సమావేశంలో ప్రకటించారు. అన్నట్లుగా ఇప్పుడు రూ.235 కోట్లు విడుదల చేస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయం.

**- కొట్టె సాయిదీప్‌రావు, మానకొండూర్**

### భారత్ బోణీ కొట్టేనా?

న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా ఒక్క టీ-20 మినహా ఏ ఫార్మాట్‌లోనూ అభిమానులను అలరించలేకపోయింది. ఎన్నో ఆశలతో న్యూజిలాండ్‌లో అడుగుపెట్టిన భారత జట్టు నిరాశతో స్వదేశంలో కాలు పెట్టడాన్ని క్రికెట్ క్రీడాభిమానులు జీర్ణించుకోలేకపోయారు. ఇదిలా ఉంటే స్వదేశంలో ధర్మశాల వేదికగా నేటినుంచి దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ ఆరంభం కానున్నది. భారత్ తిరిగి పుంజుకోవడానికి ఈ సిరీస్ సువర్ణావకాశం. అయితే మంగళవారం నుంచి ధర్మశాలను వరుణుడు కప్పుకొని ఉన్నాడు. వరుణుడు కరుణిస్తే కానీ భారత్ బోణీ కొట్టే అవకాశం లేదు.

**- కొత్వాల్ ప్రవీణ్‌కుమార్, బేగంపేట, హైదరాబాద్**

### శోచనీయం

యావత్ ప్రపంచాన్ని కరోనా కంగారు పెడుతూనే ఉన్నది. రోజురోజుకు ఇటలీ, ఇరాన్, బ్రిటన్‌లాంటి పలు దేశాల్లో మృతుల సంఖ్య పెరుగుతుండటం బాధాకరం. ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తలు, అత్యాధునికమైన టెక్నాలజీ ఉన్న ఈ రోజుల్లో కరోనా లాంటి వైరస్‌కు అడ్డు కట్ట వేయలేకపోవడం శోచనీయం.

**- తలారి సతీష్, చిట్టిగడ్డ, వికారాబాద్ జిల్లా**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

# విదేశీ విమర్శనూ వినవలె

**ఆలోకన**



**టంకశాల అశోక్**

దేశ సార్వభౌమతపై బయటి జోక్యం ఆమోదయోగ్యం కాదనటంలో భిన్నాభిప్రాయానికి తావులేదు. కానీ ఈ ప్రశ్నను పురస్కరించుకొని తలెత్తిన పరిస్థితులను చర్చించుకోవటం అవసరం. సీఏఏపై విచారణలో కొన్ని అంశాల వివరణకు సహకరించగలమంటూ ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంస్థ సుప్రీంకోర్టుకు దరఖాస్తు చేయదలచింది. ఇందుకు కోర్టు సమ్మతించకపోవచ్చు గాక. కానీ అటువంటి సంస్థ అసాధారణమైన రీతిలో ఇటువంటి ప్రతిపాదన చేయడమంటేనే ప్రపంచం దృష్టిలో ఇండియా ప్రతిష్ఠకు నష్టం జరిగినట్టు.

హక్కుల సంస్థ ప్రతిపాదనను భారత ప్రభుత్వం వెంటనే ఆక్షేపించింది. ఆ ప్రతిపాదనను సుప్రీంకోర్టు ఆమోదిస్తుందో, తిరస్కరిస్తుందో లేక ప్రభుత్వ అభిప్రాయాన్ని తీసుకొని ఒక నిర్ణయానికి వస్తుందో తెలియదు. మొత్తమ్మీద తిరస్కరించే అవకాశాలే ఎక్కువ. కానీ అది ఒక స్థాయిలో సాంకేతికమైన ప్రశ్న. మరొక స్థాయికి వెళ్లి విచారిస్తే, ఐరాస మానవ హక్కుల సంస్థ ఇంత అసాధారణ వైఖరి తీసుకోవటం రాజకీయంగా, నైతికంగా తేలికగా తోసిపుచ్చగలది కాదు. దేశ సార్వభౌమత అనే కారణాన్ని ముందుకు తెచ్చి తోసిపుచ్చితే అది సాంకేతికంగా చెల్లుబాటవుతుంది. ఇందులో సార్వభౌమత కోణం ఇమిడి ఉందన్నది మానవహక్కుల సంస్థకు తెలియదనలేం. అయినా వారు ఈ దరఖాస్తు చేయదలిచారంటే అందుకు వారు చెబుతున్న కారణాలను విచారించాలి. అందుకు మనవైపు నుంచి తగిన వివరణ ఇవ్వగలగాలి. సార్వభౌమత్వ విషయమంటూ ఏకవాక్య ప్రకటనలు చేయటం వల్ల సాంకేతికంగా గెలువవచ్చు గాని, ప్రపంచాన్ని మెప్పించలేం. ముఖ్యంగా అది ఐరాస సంస్థ అయినందున.

హక్కుల సంస్థ ఈ కేసులో కక్షిదారుగా ఉంటామనటం లేదు. సీఏఏతో ముడిపడి అంతర్జాతీయ మానవహక్కుల చట్టాలు, నియమాలు, ప్రమాణాలు కొన్ని ఉన్నాయని, అవేమిటో న్యాయస్థానానికి వివరించటమే తమ ఉద్దేశమని పేర్కొన్నది. సీఏఏ నిబంధనల్లో భారతదేశం పేరును మాత్రమే ప్రస్తావించి ఉంటే భారతదేశానికే పరిమితమైనదనవచ్చు. కానీ పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌లను, ఆరు మతాలను పేర్కొన్నది. ఈ మూడు దేశాల్లో వేధింపులకు గురవుతున్నవారిలో అహమ్మదీయ, హజారా, షియా తదితర అల్పసంఖ్యాకవర్గాలు కూడా ఉన్నాయని ఆ సంస్థ దృష్టికి తెచ్చింది. సీఏఏలోని ఉద్దేశం మానవహక్కుల పరిరక్షణ అయినందున ఆ సుగుణాన్ని హక్కుల సంస్థ గుర్తించింది. అయితే ఆ హక్కులను జాతి, మత భేదాలు లేకుండా వర్తింపజేయాలన్నది హక్కుల సంస్థ సూచన. భారత రాజ్యాంగానికి కొన్ని విలువలున్నాయని, సీఏఏ చట్టం ఆ విలువలకు అనుగుణంగా ఉందో లేదో న్యాయమూర్తులు విచారించే సమయంలో వారికి తాము సహాయకులుగా ఉండగోరుతున్నామని కూడా సూచించింది. సీఏఏ గురించి మానవహక్కుల సంస్థ మాత్రమే మాట్లాడటం కాదు. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ కూడా వివక్షతో కూడిన సీఏఏ వల్ల కొందరు వలసదారులు ఏ దేశానికీ చెందనివారుగా మిగిలిపోవచ్చునని ఆందోళన వ్యక్తపరిచారు. ఆఫ్ఘనిస్థాన్ మాజీ అధ్యక్షుడు కర్జాయ్ ఇటీవల ఢిల్లీ వచ్చినప్పుడు, తమ దేశంలో వేధింపులకు గురవుతున్న ఇతర అల్పసంఖ్యాకవర్గాల వారు కూడా ఉన్నారన్నారు. శ్రీలంక తమిళుల సంగతి సరేసరి. ఇటాంటి ఆక్షేపణలు ఇంకా అంతర్జాతీయ సంస్థలనుంచి, ఈయూ వంటి వేదికల నుంచి, పొరుగుదేశాల నుంచి వినవస్తున్నాయి.

సీఏఏలో వివిధ రూపాల్లో అంతర్జాతీ య కోణాలున్నపుడు, ఆ కోణాల వల్ల, ముఖ్యంగా అందులోని వివక్షా ధోరణి వల్ల కొందరు నష్టపోతారనే అభిప్రాయం ఏర్పడినప్పుడు, ఆ ప్రభావాలు అంతర్జాతీయ మానవహక్కుల చట్టాలపై, నియమాలపై ఉండగలవనుకున్నప్పుడు, అదొక దేశ సార్వభౌమతలో ఇమిడిపోయే విషయమవుతుందా అన్నది చర్చించవలసిన విషయం. ఈ విషయంలో ప్రతిపక్షాల అభిప్రాయాన్ని కూడా ప్రపంచం గమనిస్తుంది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్, ఈ కేసులో మానవహక్కుల సంస్థ జోక్యం అవసరం లేదని అంటూనే, హక్కుల విషయమై సీఏఏ అంతర్జాతీయ ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నదని, అందువల్లనే ఇటువంటి వైఖరి తీసుకునే పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించింది.

> గతంలో ఇండియాపై పాకిస్థాన్ విమర్శలతో ఈ దేశాలు అరుదుగా తప్ప ఏకీభవించలేదు. ఈసారి అవి పాకిస్థాన్‌ను మించి ఘాటైన భాషను ఉపయోగిస్తున్నాయి. వాటి ఆక్షేపణలకు మతకోణంతో తోసిపుచ్చవచ్చు. కానీ అమెరికా,యురోపియన్ సంస్థలు, ఐరాస ప్రధాన కార్యదర్శి, మానవహక్కుల సంస్థల మాటేమిటి? స్వదేశంలోనే ప్రజాస్వామికవర్గాల విమర్శలను ఏమంటారు?

హక్కుల సంస్థ దరఖాస్తును సాంకేతికత ఆధారంగా తిరస్కరించగలిగినా, దానితో సంబంధం గల వాదనలను తేలికగా తోసిపుచ్చలేమని గుర్తించాలి. ఒక దేశానికి ఇతర దేశాలతో, ప్రపంచంతో గల సంబంధాల్లో ఫిజిక్స్ మాత్రమే కాదు కెమిస్ట్రీ కూడా ఉంటుంది, ఉండాలి. మనం నివసిస్తున్నది ఆధునిక ప్రపంచం. అందువల్లనే అంతర్జాతీయ సంస్థలు, చట్టాలు, నియమాలు ఉనికిలోకి వచ్చాయి. అవి మనకు అనుకూలమైనపుడు ఒకవిధంగా, కానప్పుడు మరొకవిధంగా మాట్లాడుతామంటే సాంకేతికంగా నెట్టుకుపోవచ్చునేమో గాని వ్యవహారరీత్యా అది సులభం కాదు.

సీఏఏను పాకిస్థాన్ మాత్రమే విమర్శిస్తే అందుకు విశ్వసనీయత ఉండే ది కాదు. ఇస్లామిక్ దేశాల సంస్థ, మలేషియా, ఇరాన్, టర్కీ వంటి దేశాలు ఆక్షేపణ చేస్తే వాటిది మతకోణమనడానికి ఆస్కారం ఉండేదేమో. గతంలో ఇండియాపై పాకిస్థాన్ విమర్శలతో ఈ దేశాలు అరుదుగా తప్ప ఏకీభవించలేదు. ఈసారి అవి పాకిస్థాన్‌ను మించి ఘాటైన భాషను ఉపయోగిస్తున్నాయి. వాటి ఆక్షేపణలకు మతకోణంతో తోసిపుచ్చవచ్చు. కానీ అమెరికా,యురోపియన్ సంస్థలు, ఐరాస ప్రధాన కార్యదర్శి, మానవ హక్కుల సంస్థల మాటేమి టి? స్వదేశంలోనే ప్రజాస్వామిక వర్గాల విమర్శలను ఏమంటారు?

ఇలాంటి సంస్థలతో, అంతర్జాతీయ మీడియాతో మాది సార్వభౌమ దేశం, ఇది మా అంతర్గత వ్యవహారం అంటున్నది మోదీ ప్రభుత్వం. స్వదేశంలోని పౌరులు విమర్శిస్తే దేశద్రోహులని, పాకిస్థాన్ ఏజెంట్లని, పాకిస్థాన్‌కు వెళ్లిపోండని వారు బెదిరిస్తారు. చివరికి దేశద్రోహం కేసులు కూడా మోపుతున్నారు. చట్టాలను విమర్శించటాన్ని, ప్రధానిని విమర్శించటాన్ని దేశద్రోహమనే స్థాయికి పతనం కావటం వల్ల ప్రభుత్వానికి ఇంటా, బయటా గౌరవం పెరుగుతుందా తగ్గుతుందా? సుప్రీంకోర్టు న్యాయమూర్తి దీపక్ గుప్తా ఈ విషయమై మాట్లాడుతూ, దేశం వేరు ప్రభుత్వం వేరని, ప్రభుత్వాన్ని విమర్శించటం దేశాన్ని విమర్శించటం కాబోదని, దేశ వ్యతిరేకం కాదని, ఒక పార్టీకి 51 శాతం ఓట్లు వచ్చినా తక్కిన 49 శాతం మంది తర్వాత ఐదేండ్ల పాటు మౌనంగా ఉండవలసిన అవసరం లేదని, నిరసన తెలపటం మానవహక్కని, ప్రభుత్వ చర్యలు ప్రతిసారి ఒప్పు కాబోవని, చట్టాలను ప్రశ్నించటం ద్వారానే సమాజం వికసిస్తుందని స్పష్టం చేశారు. చట్టాలనే గాక చట్టసభలను, ప్రభుత్వాలను, న్యాయవ్యవస్థను, సైనికవ్యవస్థను విమర్శించినా సరే దానిని దేశ వ్యతిరేక చర్య అనలేమన్నారు. సుప్రీంకోర్టు 1962లోనే కేదార్‌నాథ్‌సింగ్ కేసులో 124-ఏ ఆర్టికల్‌కు భాష్యం చెప్తూ, ఇదే విషయం ప్రకటించింది. పైగా అటువంటి విమర్శ కారణంగా హింస జరిగితే తప్ప విమర్శకులను శిక్షించలేమన్నది.

దేశంలో ఇటువంటి విచారకర పరిణామాల వల్ల ఐరాస వంటి ప్రపంచసంస్థలు సైతం ఆందోళన చెందుతున్నాయి. ఎంత ఆందోళన చెందకపోతే సుప్రీంకోర్టుకు దరఖాస్తు వంటి అసాధారణమైన ఆలోచన చేస్తాయనుకోవాలి. ఈ స్థితికి ప్రతిఫలనమా అన్నట్లు అంతర్జాతీయ ప్రజాస్వామ్య సూచీలలో మన స్థానం దారుణంగా పతనమవుతున్నది. ద ఎకానమిస్ట్ పత్రిక గత జనవరి సర్వేలో నిరుటికన్న 10 స్థానాలు పడిపోయి 51వ స్థానానికి రాగా, ఇదే మార్చిలో వెల్లడైన ఫ్రీడం ఇన్ ద వరల్డ్ నివేదికలో 83వ స్థానానికి పతనమైంది. పరిమాణంలో అతిపెద్దది అయిన ప్రజాస్వామ్య దేశం, గుణంలో అత్యుత్తమ ప్రజాస్వామ్యం కానక్కరలేదా?

**సింగరేణి**

**రామడుగు శివ**

# ఓర్వలేకే సింగరేణిపై అక్కసు

> 'సింగరేణి అవినీతి గని'గా మారిందంటూ రాసిన కథనాల్లో అయిదు అంశాలను లేవనెత్తారు. ఓసీ గనుల్లో ఓవర్ బర్డెన్ తొలిగించే కాంట్రాక్టర్ల నియామకంలో రాజకీయ జోక్యం ఉంటున్నదని, కాంట్రాక్టర్లకు మేలు చేసేవిధంగా 'లీడ్' (దూరం) లెక్కల్లో తప్పు రాస్తున్నారనీ, తాడిచర్ల అనే బొగ్గు బ్లాకును వేరేవాళ్లకు అప్పగించారనీ, ఈ-యాక్షన్ ద్వారా బొగ్గు అమ్మలేకపోతున్నారని, సీ అండ్ ఎండీ వచ్చి నాలుగేండ్లయినా ఇంకా వెళ్లిపోవడం లేదు, గతంలో ఏ సీఎండీ ఇంతకాలం పనిచేయలేదనీ ఆరోపించారు. ఈ ఆరోపణలన్నీ అవాస్తవాలు.

సింగరేణి కాలరీస్ కంపెనీపై ఒక పత్రిక, రెండు న్యూస్ ఛానల్స్ బురదజల్లే యత్నం చేశాయి. కించపరుచడమే ధ్యేయంగా సాగిన ఈ పసలేని కథనాలను సింగరేణి కార్మికులతో పాటు తెలంగాణ సమాజం అసహ్యించుకుంటున్నది. గతంలో ఇలాంటి విద్వేషపూరిత కథనాలు తెలంగాణ ప్రాజెక్టులపై, విద్యుత్, ఆర్టీసీ సంస్థలపై కూడా వచ్చాయి. కాబట్టి వీళ్ల పని 'విషం చిమ్మడమే' నని సింగరేణి ఉద్యోగులు అర్థం చేసుకుంటున్నారు.

'సింగరేణి అవినీతి గని'గా మారిందంటూ రాసిన కథనాల్లో అయిదు అంశాలను లేవనెత్తారు. ఓసీ గనుల్లో ఓవర్ బర్డెన్ తొలిగించే కాంట్రాక్టర్ల నియామకంలో రాజకీయ జోక్యం ఉంటున్నదని, కాంట్రాక్టర్లకు మేలు చేసేవిధంగా 'లీడ్' (దూరం) లెక్కల్లో తప్పు రాస్తున్నారనీ, తాడిచర్ల అనే బొగ్గు బ్లాకును వేరేవాళ్లకు అప్పగించారనీ, ఈ-యాక్షన్ ద్వారా బొగ్గు అమ్మలేకపోతున్నారని, సీ అండ్ ఎండీ వచ్చి నాలుగేండ్లయినా ఇంకా వెళ్లిపోవడం లేదు, గతంలో ఏ సీఎండీ ఇంతకాలం పనిచేయలేదనీ ఆరోపించారు. ఈ ఆరోపణలన్నీ అవాస్తవాలు.

సింగరేణిలో ఓవర్ బర్డెన్ కాంట్రాక్టు పనుల కేటాయింపుపై ఒక అసంబద్ధమైన ఆరోపణ చేశారు. సింగరేణిలో ఓబీ కాంట్రాక్ట్ పనుల కేటాయింపులు ఎలా జరుగుతాయనే విషయంపై అవగాహన ఉంటే ఈ ఆరోపణ చేసేవారు కాదు. ఓబీ పనుల కేటాయింపు వ్యవహారం మొత్తం ఆన్‌లైన్ ద్వారా, ఓపెన్ టెండర్ విధానంలో జరుగుతుంటుంది. ఇది కోట్ల రూపాయల వ్యయంతో కూడుకున్నది కనుక అన్ని విషయాలు పారదర్శకంగా నిర్వహిస్తుంటారు. నిబంధనల ప్రకారం ఎవరు తక్కువ రేటు కోట్ చేస్తారో వారినే ఎల్-1గా గుర్తించి, పనులు కేటాయిస్తారు. ఇదంతా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే జరుగుతుంది.

ప్రస్తుతం రివర్స్ టెండరింగ్ విధానాన్ని కూడా అమలు జరుపుతున్నారు. ఈ విధానం ద్వారా ఎల్-1 రేటును ప్రామాణికంగా తీసుకొని మరొకసారి ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ అవకాశం ఇస్తారు. ఈ రివర్స్ టెండర్‌లో ఎవరు ఎల్-1గా ఉంటారో వారికే ఓబీ కాంట్రాక్టు పని అప్పగిస్తారు. అదికూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారులు సభ్యులుగా ఉండే బోర్డ్ డైరెక్టర్ల సమావేశంలో పరిశీలించి, ఆమోదించిన తర్వాతే కేటాయిస్తారు. ఈ ప్రక్రియ ఇంత పారదర్శకంగా సాగుతున్నప్పుడు, ఏ వ్యక్తికీ అనుకూలంగా వ్యవహరించే అవకాశమే లేదు.

ఓబీ కాంట్రాక్టర్లకు లీడ్ విషయంలో అనుకూల అక్రమాలు అంటూ మరో పాతకాలం నాటి ఆరోపణ చేశారు. సింగరేణి సర్వే విభాగంలో అంతకుముందటి సాంకేతికత వేరు. ఇప్పటి ఆధునిక సాంకేతికత వేరు. కచ్చితమైన లెక్కలను పొందుపర్చగలిగిన 3 డీ లేజర్ స్కానర్ యంత్రాల ద్వారా ఓవర్ బర్డెన్ పనుల అంచనాలు, తవ్వకాలు, కొలతలు, లెక్కలు అన్నీ తేడా లేకుండా జరుపుతున్నారు. గతంలో మాదిరి మానవ ప్రమేయం లేదు. ఓబీ తవ్వే బెంచీ నుంచి ఓబీని పోసే డంపు వరకూ దూరాన్ని కచ్చితంగా ముందుగా గుర్తించి కాంట్రాక్టులో పొందుపరుస్తున్నారు. అసలు ఓబీ కాంట్రాక్టరు, ఎంత మట్టిని, ఎంత విస్తీర్ణంలో ఎక్కడ నుంచి తీయాలి, దాన్ని ఎంత దూరంలో గల, ఏ డెక్ మీద ఎలా పోయాలనేది ఆర్డర్ కాపీలోనే పొందుపరుస్తున్నారు. రెండంచెల తనిఖీని ప్రవేశపెట్టారు. కర్నాటకలో గాలి జనార్ధన్‌రెడ్డి గనుల్లో, తొలిగించిన ఖనిజం పరిమాణాన్ని కొలవడానికి ప్రభుత్వం సింగరేణికి చెందిన ఈ స్కానర్‌ను వినియోగించిందీ అంటే దీని ప్రామాణికతను అర్థం చేసుకోవచ్చు. అలాగే వార్తల్లో పేర్కొన్న మేడిపల్లి ఓసీ లీడ్ లెక్క వ్యవహారం కూడా తెలంగాణ రాకపూర్వం జరిగిన పాత విషయం. ఆ కేసులో విచారణలు పూర్తయి కూడా ఏండ్లు గడుస్తున్నాయి. ఇప్పుడు ఆ తరహా తప్పు జరిగే అవకాశమే లేదు, జరిగితే ఉపేక్షించే పరిస్థితి కూడా లేదు.

తాడిచర్ల బ్లాకును వేరే వాళ్లకు కంపెనీ ఇచ్చిందనేది మరో ఆరోపణ. ఉమ్మడి ఏపీలో వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు కేంద్రం తాడిచర్ల బ్లాకును నాటి రాష్ట్ర జెన్‌కోకు కేటాయించారు. దీనిలో సింగరేణి పాత్ర ఏముంటుంది? బొగ్గు బ్లాకు కేటాయించేది కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ. ఇది జరిగి దాదాపు పదేండ్లు కావస్తున్నది.

సింగరేణికి నేడు ఒడిశాలో నైనీ, న్యూ పాత్రపాద అనే రెండు బ్లాకులను కేంద్రం కేటాయించింది. సింగరేణి వృద్ధిరేటు చూసి కేంద్రం ఈ కేటాయింపు జరిపింది. ఇది తెలంగాణ ఆవిర్భావం తర్వాత సింగరేణి సాధించిన విజయం. పదేండ్ల కిందటి తాడిచర్ల బ్లాకు గురించి ప్రస్తావించినవారు ఇప్పుడు సింగరేణి సాధించిన 1500 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల భారీ బ్లాకుల విషయాన్ని గుర్తించకపోవడం దురుద్దేశమే!.



> ఎన్.శ్రీధర్ సింగరేణిని దేశంలోనే నెంబర్-1 కంపెనీగా నిలిపారు. 2014తో పోలిస్తే 2019 నాటికి కంపెనీ వివిధ విభాగాల్లో సాధించిన ప్రగతి దీనికి ఉదాహరణ. సింగరేణిని నవరత్న కంపెనీలకు దీటుగా నిలబడేలా చేశారు. థర్మల్, సోలార్ విద్యుత్తు ఉత్పాదన రంగంలోకి దిగిన తొలి బొగ్గు కంపెనీగా సింగరేణి రికార్డుకెక్కడానికి ఎన్.శ్రీధర్ కృషినే ప్రధాన కారణం. సంక్షేమంలో కూడా సింగరేణి అగ్రభాగాన ఉంటున్నది.

సింగరేణిలో అటెండెన్స్ విధానం ఎస్‌ఏపీ (శాప్) ద్వారా నడుస్తుంది. అటెండెన్స్ పడిన వెంటనే ఆన్‌లైన్ ద్వారా నమోదవుతుంది. అటెండెన్స్ పడినవారు బయటకు పోతున్నప్పుడు కూడా ఔట్‌మస్టర్ పడాలి. గుర్తింపు యూనియన్ నాయకులు కొందరికి కంపెనీతో జరిపే సమావేశాల సమయాల్లో ఆన్‌డ్యూటీగా మినహాయింపు ఉంటుంది. రోజుకు 300 మస్టర్లు బోగస్‌గా పడుతున్నాయనేది అవాస్తవం. తమను పనిదొంగలుగా చిత్రీకరించడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సింగరేణిలో పదుల సంఖ్యలో రిటైరైన ఉద్యోగులను తిరిగి నియమించారనీ, వీరు నెలకు పది లక్షల కన్న ఎక్కువ ప్రయోజనాలు పొందుతున్నారని ఒక కల్పిత కథనాన్ని ప్రచారం చేస్తున్నారు. రిటైరైన ఏ అధికారి మళ్లీ సింగరేణిలో పనిచేయడం లేదు. థర్మల్ విద్యుత్ కేంద్రం పర్యవేక్షణ కోసం అత్యంత అనుభవం కలిగిన ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగులను కంపెనీ ప్రయోజనాల కోసమే కన్సాలిడేటెడ్ వేతనంతో నియమించింది. వీరి అనుభవం థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణంలోనూ, ప్రస్తుత ఉత్పత్తి ప్రక్రియలోనూ ఎంతగానో ఉపయోగపడుతున్నది. అలాగే కొత్త గనుల కోసం కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖతోనూ, పర్యావరణ అటవీ విభాగంతోనూ సంప్రదింపులు జరుపడానికి మరో ఇద్దరు సీనియర్ అధికారులను కంపెనీ వినియోగించుకుంటున్నది. వీరిద్దరు కూడా సింగరేణి మాజీ అధికారులు కాదు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖలో పనిచేసి రిటైరైన ఒక ఉన్నతస్థాయి అధికారిని, అటవీశాఖలో రిటైరైన మరో ఉన్నతాధికారిని కన్సాలిడేటెడ్ పేమెంట్‌తో నియమించుకున్నది. వేల కోట్ల రూపాయల విలువైన కొత్త కోల్‌బ్లాకులను సాధించడంలో, అనుమతులు పొందడంలో ఈ అధికారుల అనుభవం, పరిచయాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీరి సేవలతో పోలిస్తే చెల్లించే జీతం నామమాత్రమే. అనుభవజ్ఞులైన రిటైర్డ్ అధికారులను వినియోగించుకోవడం ప్రభుత్వాలకు, ప్రభుత్వసంస్థలకు కొత్తేమీ కాదు. సింగరేణిలో పనిచేసి రిటైరైన డైరెక్టర్ ఒకరు ప్రస్తుతం ఏపీ ప్రభుత్వ సలహాదారునిగా, మరొక ఐటీ ఉన్నతాధికారి కోలిండియాకు సలహాదారునిగా పనిచేస్తున్నారు.

సింగరేణి సీ అండ్ ఎండీ శ్రీధర్ నాలుగేండ్లు దాటినా ఇంకా ఇక్కడే కొనసాగుతున్నారనీ, గతంలో ఎవరూ ఇన్నేండ్లుగా పనిచేయలేదని, రెండేండ్లకోసారి బదిలీ కావాల్సిన అధికారి ఇంకా ఉంటున్నారని వాస్తవ దూరమైన కథనాన్ని సాగించారు. అంకితభావంతో సింగరేణిని ప్రగతి బాటలో నడిపించిన పలువురు ఐఏఎస్ అధికారులను ఐదారేండ్ల వరకూ సీ అండ్ ఎండీలుగా గత ప్రభుత్వాలు కొనసాగించాయి. ఎన్.శ్రీధర్ సింగరేణిని దేశంలోనే నెంబర్-1 కంపెనీగా నిలిపారు. 2014తో పోలిస్తే 2019 నాటికి కంపెనీ వివిధ విభాగాల్లో సాధించిన ప్రగతి దీనికి ఉదాహరణ. సింగరేణిని నవరత్న కంపెనీలకు దీటుగా నిలబడేలా చేశారు. థర్మల్, సోలార్ విద్యుత్తు ఉత్పాదన రంగంలోకి దిగిన తొలి బొగ్గు కంపెనీగా సింగరేణి రికార్డుకెక్కడానికి ఎన్.శ్రీధర్ కృషినే ప్రధాన కారణం. సంక్షేమంలో కూడా సింగరేణి అగ్రభాగాన ఉంటున్నది. దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నది. 2014లో 40 వేల రూపాయల బోనస్‌లుగా అందుకున్న కార్మికులు ఇప్పుడు సగటున లక్ష 40 వేలు అందుకోగలిగారు. సింగరేణి అభివృద్ధిలోను, సంక్షేమంలోనూ అగ్రస్థానంలో ఉందని కేంద్రబొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి అనిల్ కుమార్‌జైన్ ఇటీవల ప్రశంసించారు. గుజరాత్‌లో ఇటీవల జరిగిన కోలిండియా మేధోమథనంలో సింగరేణిని ఆదర్శంగా తీసుకొని థర్మల్, సోలా ర్ విద్యుత్ కేంద్రాలను కోలిండియా కూడా ఏర్పాటుచేయాలని కేంద్రం సూచించింది.

సింగరేణి గత ఐదేండ్లలో సాధించిన ప్రగతికి అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. అద్భుతమైనరీతిలో ప్రగతి పథం లో దూసుకుపోతున్న సింగరేణిని, దీన్ని సమర్థంగా నడిపిస్తున్న ఎన్.శ్రీధర్‌ను నిరాధారమైన ఆరోపణలతో కించపరచడం శోచనీయం. ఇలాంటి వార్తలు, కథనాలు సింగరేణి కార్మికుల, అధికారుల ఆత్మ నిబ్బరాన్ని ఏ మాత్రం సడలించలేవు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



## వైభవంగా శివకళ్యాణోత్సవాలు ప్రారంభం

వేములవాడలో క్షేత్రంలో బుధవారం శివకళ్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకుల వేదమంత్రాలతో ఆలయప్రాంగణం మార్మోగింది. గురువారం నిర్వహించనున్న ఆదిదంపతుల కల్యాణానికి అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. కల్యాణానికి దాదాపు 50 వేల మంది భక్తులు తరలివస్తారని అంచనావేస్తున్నారు. ఇందుకనుగుణంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 10:50 నిమిషాలకు అభిజిత్ లగ్న సుముహూర్తాన ఆదిదంపతుల కల్యాణం వైభవంగా జరుగనున్నది. - వేములవాడ కల్చరల్



## ఘనంగా నృసింహుడి దక్షిణ దిగ్యాత్ర

ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం స్వామి(యోగ, ఉగ్ర) వారల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకొచ్చి సేవలపై ఉంచి ప్రదర్శనలతో దక్షిణదిశలోని పోలీస్‌స్టేషన్ వైపు తీసుకెళ్లి పూజలుచేశారు. సేవల ముందు దారి పొడవునా పోలీస్ సిబ్బంది నృత్యం చేశారు. జిల్లా అడిషనల్ ఎస్పీ దక్షిణామూర్తి, డీఎస్పీ వెంకటరమణ, సీఐ లక్ష్మీబాబు, పోలీస్ సిబ్బంది స్వామివారి సేవలకు ఘన స్వాగతం పలికి లోపలికి తీసుకెళ్లారు.

- ధర్మపురి, నమస్తే తెలంగాణ







## ముస్తాబైన కేసీఆర్ నగర్..

సిరిసిల్ల పట్టణవాసుల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులో పూర్తయిన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల కాలనీకి కేసీఆర్‌నగర్‌గా నామకరణం చేశారు. ఈ మేరకు ఆ ఇండ్ల ప్రారంభోత్సవానికి అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ అంజయ్య తెలిపారు. -సిరిసిల్ల రూరల్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో కలెక్టర్ వెంకట్రావు

## సుందర పట్టణంగా పాలమూరు

### మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** పాలమూరును సుందరపట్టణంగా తీర్చిదిద్దుతామని ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ వన్‌టౌన్ చౌరస్తా, భగీరథ కాలనీ చౌరస్తాలో జంక్షన్ నమూనాలను కలెక్టర్ వెంకట్రావ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జంక్షన్ ఏర్పాటుతో పట్టణానికి కొత్త శోభ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేందర్, ఎంఈ సత్యనారాయణ, ఆర్అండ్‌బీ అధికారులు, కౌన్సిలర్, నాయకులు పాల్గొన్నారు.

## నిషేధిత వలల వినియోగంపై నిఘా

### అధికారులకు మంత్రి తలసాని ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిషేధిత అలవివలల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగించాలని మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం అధికారులను ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ బృందం నిఘాతో ఈ నెల 7న యాప్రాల పరిధిలోని యర్రంబండ వద్ద ఒక అలివివల, బోటును స్వాధీనం చేసుకొని పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు తెలిపారు. 9న ఎలూరువాగు వద్ద అలివిగాని వలను స్వాధీనం చేసుకొని కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసినట్టు చెప్పారు.

# తెలంగాణకే వలసలు

**ఉమ్మడి వరంగల్‌కు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ కూలీలు**

**ఉపాధి కోసం తరలొచ్చిన ప్రజలు**

**కిటకిటలాడుతున్న కాజీపేట రైల్వే జంక్షన్**

(వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ)

కూలీకోసం.. కూటి కోసం ఉన్న ఊళ్లను వదిలి దూర తీరాలకు వలసెల్లిన తెలంగాణ ఇప్పుడు ఇతర ప్రాంతాలకు ఉపాధి తొవ్వలేస్తున్నది. మన కూలీలకు చేతినిండా పనిదొరకడమే కాదు.. మధ్యభారతానికి ఎవుసం పనుల కూలీ రుచి చూపిస్తున్నది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ నుంచి ఈసారి వేల మంది కూలీలు పనికోసం రాష్ర్టానికి తరలివస్తున్నారు. వరంగల్ ఉమ్మడిజిల్లాలోని అనేక ప్రాంతాల్లో పొరుగురాష్ర్టాల కూలీలు సంబురంగా పనులు చేసుకుంటున్నారు. మహారాష్ట్రలోని రాజూరా, చంద్రాపూర్, బల్లార్షా, సిరొంచ, గడ్చిరోలి, ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, సుక్మా ప్రాంతాల నుంచి కుటుంబాలకు కుటుంబాలే మన మిర్చి తోటల్లో పనిచేసేందుకు తరలివస్తున్నాయి. కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, మధిర, ఖమ్మం రైల్వేస్టేషన్లు వలసకూలీల రాకపోకలతో కళకళలాడుతున్నాయి.

### అక్కడ రైతులు.. ఇక్కడ కూలీలు

'మహారాష్ట్రలో మేము రైతులం. కానీ పనుల్లేక తెలంగాణకు వచ్చిన కూలీలం' అని చంద్రాపూర్ జిల్లా సాంఘ్లీకి చెందిన రాందాస్ దాగో కామ్డా అనే రెండున్నర ఎకరాల రైతు 'నమస్తే తెలంగాణ'తో చెప్పాడు. తమప్రాంతంలో నీరు లేక ఒక్క పంట పండటమే కష్టంగా ఉన్నదనీ.. తెలంగాణతరహాలో తమ ప్రాంతంలో ప్రభుత్వ ప్రోత్సాహంలేదని మహారాష్ట్ర రైతులు పేర్కొంటున్నారు. మిర్చి, పత్తి సీజన్‌లో తెలంగాణకు వచ్చి పనులుచేసి తిరిగి సొంతూళ్లకు వెళ్లే ఇతర రాష్ర్టాల కూలీలతో రైల్వేస్టేషన్లు సందడిగా మారుతున్నాయి. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ములుగు, గోవిందరావుపేట, మంగపేట, తాడ్వాయి, నల్లబెల్లి, ఖానాపూర్, మహబూబాబాద్, డోర్నకల్, కురవి, మరిపెడ, కాటారం, మహదేవ్‌పూర్, మహాముత్తారం తదితర ప్రాంతాల మిర్చి తోటల్లో పనిచేసేందుకు ఆయా రాష్ర్టాల కూలీలు భారీగా తరలివస్తున్నారు.





కాజీపేట రైల్వేస్టేషన్‌లో దిగిన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ కూలీలు

### బహుత్ అచ్చా సర్కార్.. అచ్చా ఖేత్

'తెలంగాణ మే బహుత్ అచ్చా సర్కార్ హై.. అచ్చా ఖేత్ బీ హై..' అంటూ మహారాష్ట్ర కూలీలు కితాబిస్తున్నారు. రైతుబంధు, రైతుబీమాతోపాటు 24గంటల ఉచిత కరంట్ ఇవ్వటంఅంటే మాటలు కాదని అక్కడికూలీలు తమ ప్రాంతంలో నెలకొన్న దుస్థితుల్ని సరిపోల్చి చూసుకుంటున్నారు. తెలంగాణలో ఎక్కడచూసినా పచ్చని పంటపొలాలు కనిపిస్తున్నాయని.. తమ ప్రాంతానికి ఇక్కడికి చాలా తేడా ఉన్నదని పేర్కొంటున్నారు.

### జోడికి ఆరేడు వందల కూలీ



కురవి దగ్గర మిర్చీ తోటలు ఏరినం. నెలరోజుల కింద వచ్చినం. నేను నా భార్య, బిడ్డ ముగ్గురం వచ్చినం. జోడికి (భార్యా భర్తలకు) రోజుకు ఆరేడు వందల కూలీ గిట్టుబాటైంది. నాకు మా ఊళ్లో అరెకరం భూమిలో వ్యవసాయం చేసేటోన్ని. మా దగ్గర వ్యవసాయ పనులు అయ్యాక పనుల్లేక ఖాళీగా ఉంటం. అందుకే ఇక్కడికి వచ్చినం. మంచి కూలి పడ్డది.

– ప్రకాశ్ కవుడు బోయర్, మహారాష్ట్ర

### కాలేజీకి సెలవు పెట్టి వచ్చిన



నేను పదకొండో తరగతి చదువుతున్న. ఇంటి ఆర్థిక పరిస్థితి బాగాలేదు. మా గ్రామం వాళ్లు ఇక్కడికి మిర్చీతోటల్లో పనిచేసేందుకు వస్తున్నారని తెలిసి కాలేజీకి సెలవుపెట్టి వచ్చిన. మా అన్నా కూడా ఇక్కడికే కూలీ పని కోసం వచ్చిండు. ఇక్కడి వాళ్లు పనులిచ్చిండ్లు. పైసలు టైంకిచ్చిండ్లు.

– వినోద్ గుర్నూల్



కొత్తగా నిర్మించిన లైన్ వెంట నడుస్తూ పరిశీలిస్తున్న రైల్వే సేఫ్టీ కమిషనర్ రాంకృపాల్

## ఘట్‌కేసర్‌లో రైల్వే సేఫ్టీ కమిషనర్ పర్యటన

**ఘట్‌కేసర్:** మేడ్చల్ జిల్లా పరిధిలోని ఘటకేసర్ వరకు ఏర్పాటుచేసిన ఎంఎంటీఎస్ రెండో దశ పనులను దక్షిణ మధ్య సర్కిల్ సేఫ్టీ కమిషనర్ రాంకృపాల్ బుధవారం పరిశీలించారు. రైల్వే ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక రైలులో ఘట్‌కేసర్ స్టేషన్‌కు వచ్చిన ఆయన తొలుత ఎంఎంటీఎస్ లైన్ చివరిప్రాంతాన్ని సందర్శించారు. ప్లాట్‌ఫాంపై అధికారులతో కలిసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కొత్తగా నిర్మించిన ట్రాక్‌పై ప్రత్యేక వాహనంలో అధికారులతో కలిసి ఘట్‌కేసర్ నుంచి చర్లపల్లి వరకు వెళ్లి లైన్ సామర్థ్యాన్ని పరిశీలించారు.

# స్కూల్ ఫీజులపై సమగ్ర విధానం

- ఏప్రిల్ 8లోగా రూపొందించాలి
- ఫీజుల నియంత్రణ అధికారం రాష్ర్టానిదే..
- ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏప్రిల్ 8లోగా ఓ విధానంతో ముందుకురావాలని సూచించింది. తెలంగాణ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రెగ్యులేషన్ ఆఫ్ అడ్మిషన్స్ అండ్ ప్రొహిబిషన్ ఆఫ్ క్యాపిటేషన్ ఫీ యాక్ట్ – 1983 ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదని స్పష్టంచేసింది. ప్రైవేటు పాఠశాలల్లో ప్రతిఏటా భారీగా ఫీజులు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ తల్లిదండ్రుల సంఘాలు, ఫోరం అగెనెస్ట్ కరప్షన్ తదితర సంస్థలు హైకోర్టులో పిల్‌వేశాయి. అలాగే ప్రైవేటు పాఠశాలలు కూడా తాము అందిస్తున్న సేవలకు అనుగుణంగా ఫీజులు వసూలు చేసుకునే అవకాశాన్ని ఇవ్వాలని, తమకు నష్టాలు రాకుండా ఫీజులు నిర్ణయించాలని కోరుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై బుధవారం విచారణ జరిపిన హైకోర్టు.. ప్రైవేటు పాఠశాలలు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేలా ఒక విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ, ఫీజుల నియంత్రణపై ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ చేసిన సిఫారసులను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని చెప్పారు.



ఆ కమిటీ చేసిన సిఫారసులపై నిర్ణయం తీసుకొని, సమగ్ర విధానం రూపొందించాలని ధర్మాసనం పేర్కొంది. ఇందుకు ఎనిమిది వారాల గడువు ఇవ్వాలని ఏజీ విజ్ఞప్తి చేశారు. ఇందుకు సమ్మతించిన న్యాయస్థానం ఏప్రిల్ 8లోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. అంతవరకు వేచిచూడాలని పిటిషనర్లకు సూచించింది. ప్రభుత్వం రూపొందించే విధానంతో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఆ తరువాత నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకోవచ్చని తెలిపింది. ఈ కేసుపై తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసింది.

## 18న చెప్పు, డప్పు వృత్తిదారుల ధర్నా

### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి



**ముషీరాబాద్, (నమస్తే తెలంగాణ):** చెప్పు డప్పు వృత్తిదారులకు పెన్షన్ మంజూరుచేయాలని కోరుతూ ఈ నెల 18న హైదరాబాద్‌లో మహాధర్నాను చేపట్టనున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డప్పు చెప్పు వృత్తిదారులకు పింఛన్ ఇప్పిస్తామని మంత్రులు గతంలో హామీఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట నిలబెట్టుకోవాలని కోరారు. 18న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే మహాధర్నాలో మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తిచేశారు.

# ఆనంద్‌రెడ్డి హత్యకేసులో ముగ్గురు అరెస్టు

**పరారీలో మరో ముగ్గురు**

**అదనపు డీసీపీ మల్లారెడ్డి వెల్లడి**





వివరాలు వెల్లడిస్తున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి. వెనుక ముగ్గురు నిందితులు

**వరంగల్ క్రైం:** దారుణ హత్యకు గురైన ఖమ్మం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మోకు ఆనంద్‌రెడ్డి(45) కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు వరంగల్ పోలీస్ కమిషనరేట్ లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ మల్లారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం హన్మకొండ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఖమ్మంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఆనంద్‌రెడ్డికి, వరంగల్ అర్బన్ జిల్లా శనిగరం గ్రామానికి చెందిన పింగిళి ప్రదీప్‌రెడ్డికి గతంలో ఓ భూమి కొనుగోలు విషయంలో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య ఆర్థికలావాదేవీలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఆనంద్‌రెడ్డి నుంచి ప్రదీప్‌రెడ్డి లక్షల్లో డబ్బు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించే విషయంలో ఇద్దరికి భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. అప్పు ఎగ్గొటేందుకు ఆనంద్‌రెడ్డిని చంపాలని ప్రదీప్‌రెడ్డి పథకం రచించాడు. డబ్బుకు బదులు భూమి ఇస్తానని నమ్మించి ఆనంద్‌రెడ్డిని ఈ నెల 7న డ్రైవర్ రమేశ్, మరో వ్యక్తి విక్రమ్‌రెడ్డితో కలిసి ప్రదీప్‌రెడ్డి భూపాలపల్లిజిల్లా రాంపూర్‌కు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో కారులోనే ఆనంద్‌రెడ్డి చేతులు వెనక్కి కట్టి తలకు ప్లాస్టర్ చుట్టారు. అడవిలోని గట్టమ్మగుడి వద్ద అప్పటికే సిద్ధంగా ఉన్న వెంగళి శివరామకృష్ణ, మీనుగు మధూకర్, నిగ్గుల శంకర్‌కు ఆనంద్‌రెడ్డిని అప్పగించి కత్తులను సైతం అందించారు. శివరామకృష్ణ ఆనంద్‌రెడ్డి గొంతు కోసి మిగతా ఇద్దరితో కలిసి అక్కడి నుంచి పరారయ్యాడు. 7వ తేదీ మధ్యాహ్నం నుంచి తన అన్న కనిపించడం లేదని ఆనంద్‌రెడ్డి సోదరుడు శివకుమార్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హన్మకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలో ప్రదీప్‌రెడ్డి అనుచరుడు శివరామకృష్ణ వాహనంలో పారిపోతున్నాడన్న పక్కా సమాచారంతో మంగళవారం అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా ప్రదీప్‌రెడ్డి ఆదేశాలతోనే ఆనంద్‌రెడ్డిని హత్యచేసినట్టు ఒప్పుకున్నాడు. శివరామకృష్ణను వెంటతీసుకొని పోలీసులు రాంపూర్ అడవికి వెళ్లగా ఆనంద్‌రెడ్డి మృతదేహం లభించింది. శివరామకృష్ణ చెప్పిన వివరాలతో మధూకర్, శంకర్‌ను కూడా ఆదుపులోకి తీసుకొన్నట్టు అదనపు డీసీపీ మల్లారెడ్డి తెలిపారు. మరో ముగ్గురు ప్రస్తుతం పరారీలో ఉన్నారని తెలిపారు.






రైల్వే అధికారులకు చెక్కు అందజేస్తున్న సింగరేణి సీఎండీ శ్రీధర్ తదితరులు

## డిసెంబర్‌లోగా కొత్తగూడెం-సత్తుపల్లి రైల్వేలైన్

### రెండో విడుతగా వాటాలో రూ.200 కోట్లు ఇచ్చిన సింగరేణి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** కొత్తగూడెం – సత్తుపల్లి మధ్య రైల్వేలైన్ నిర్మాణానికి సింగరేణి తనవంతుగా మరో రూ.200 కోట్లను అందజేసింది. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బుధవారం రైల్వే జీఎం గజానన్‌మాల్యాను కలిసిన సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ చెక్కును అందజేశారు. సత్తుపల్లిలో కొత్త ఓసీ గనులు ప్రారంభమైన నేపథ్యంలో రైల్వేమార్గం పనులను త్వరగా పూర్తిచేయాలని సీఎండీ శ్రీధర్ కోరారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి రైల్వే లైన్ పూర్తిచేయగలమని రైల్వే అధికారులు వివరించారు. రూ.927 కోట్లతో ఈ మార్గం నిర్మించాలని నిర్ణయించగా, సింగరేణి రూ. 618.55 కోట్లు, దక్షిణ మధ్య రైల్వే రూ.309 కోట్లు భరించాలని ఒప్పందం జరిగింది. సింగరేణి తాజాగా ఇచ్చిన రూ.200 కోట్లు కలుపుకొని మొత్తం రూ.356 కోట్లను చెల్లించింది. ఈ కార్యక్రమంలో సింగరేణి ఈడీ జే ఆల్విన్, డీజీఎం మారెపల్లి వెంకటేశ్వర్లు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ సుంకన్న మృతి



**గద్వాల, నమస్తే తెలంగాణ:** సీనియర్ జర్నలిస్టు, నమస్తే తెలంగాణ నడిగడ్డ విలేకరి సుంకన్న(66) బుధవారం సాయంత్రం మృతిచెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు జిల్లాకేంద్రంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. 1979లో జర్నలిస్టుగా వృత్తిజీవితం ప్రారంభించిన ఆయన దాదాపు 41 ఏండ్లపాటు వివిధ పత్రికల్లో పనిచేశారు. నమస్తే తెలంగాణలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులపై అనేక కథనాలు అందించారు. సుంకన్న మృతి ఉమ్మడి పాలమూరు జిల్లాకు తీరని లోటని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సమైక్య పాలనలో పాలమూరు సాగు నీటి గోసను సుంకన్న ఆవిష్కరించిన తీరును మంత్రి గుర్తుచేసుకున్నారు. సుంకన్న మృతిపై గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి సమరసింహారెడ్డి, సమాచార హక్కు కమిషనర్ కట్టా శేఖర్‌రెడ్డి సంతాపం తెలిపారు.



పట్టుబడిన నిందితులు

## చిరుత చర్మం తరలింపు

### ముగ్గురు అరెస్ట్

**ఫెర్టిలైజర్ సిటీ/కోటపల్లి:** చిరుతపులిని హతమార్చి చర్మాన్ని విక్రయించేందుకు వెళ్తున్న ఓ ముఠాను బుధవారం మంచిర్యాల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. రామగుండం సీపీ సత్యనారాయణ కథనం ప్రకారం.. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా అహెరి సమీపంలోని మరుపల్లి అటవీ ప్రాంతంలో కొందరు వేటగాళ్లు చిరుతను చంపి, చర్మాన్ని విక్రయించేందుకు మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి మండలం సరిగ గ్రామానికి వచ్చారు. పక్కాసమాచారంతో నిందితులు తిరుపతి, తులసీరాం, గంగారాంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ప్రాణాలు నిలిపిన పోలీసులు

**ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరు సేఫ్**

**రామచంద్రాపురం/మంచిర్యాల టౌన్, నమస్తే తెలంగాణ:** జీవితం మీద విరక్తితో తనువు చాలించాలనుకున్న ఇద్దరిని పోలీసులు కాపాడారు. సంగారెడ్డి జిల్లా ఆర్సీపురం పీఎస్ పరిధిలోని మ్యాక్‌సొసైటీ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ సమీపంలో కానిస్టేబుల్ వితలయ్య, హోమ్‌గార్డు అహ్మద్ విధులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో వారికి అక్కడ మద్యం సీసాలు, చెట్లపొదల్లో ఓ ద్విచక్రవాహనం కనిపించింది. సమీపంలోని రైలు పట్టాలపై ఓ వ్యక్తి మద్యం మత్తులో పడుకొని ఉన్నాడు. దీంతో పోలీసులు అతడిని లేపి ప్రశ్నించగా.. తన పేరు నగేశ్ అని తార్నాకలో ఉంటానని చెప్పాడు. తన భార్య గొడవపడి తల్లి దగ్గరికి వచ్చిందని, తీసుకెళ్లేందుకు వస్తే.. అత్తాభార్య తనతో గొడవకు దిగారని అన్నాడు. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. పోలీసులు అతడిని కాపాడి భార్యాభర్తలకు సర్దిచెప్పి పంపించారు. మరో ఘటనలో పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం మారేడుపల్లికి చెందిన దమ్ముల ప్రశాంత్ వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్నాని తన అన్న రాజేశ్‌కు ఫోన్‌లోచెప్పాడు. వెంటనే రాజేశ్ 100కు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. టౌన్ సీఐ లింగయ్య స్పందించి ఎస్సై చందర్‌తో శ్రీరాంపూర్ పెట్రోలింగ్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా జైపూర్‌లో అటవీప్రాంతంలో ప్రశాంత్‌ను గుర్తించిన పోలీసులుప్రశాంత్‌ను మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.



నగేశ్‌ను కాపాడిన పోలీస్ సిబ్బంది

## చెట్లను నరికిన నలుగురు అరెస్ట్

**సిద్దిపేట టౌన్:** చెట్లను నరికిన నలుగురు వ్యక్తులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిద్దిపేట జిల్లా కొత్త బస్టాండ్ సమీపంలోని కొండ భూదేవి ఫంక్షన్‌హాల్ ఎదురుగా హరితహారంలో భాగంగా కొన్ని మొక్కలు నాటారు. ప్రస్తుతం ఏపుగా పెరిగిన 11 చెట్లను ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు నరికారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టి.. జయభారత్‌రెడ్డి, బుక్యా రవీందర్, శేఖర్, సందీప్ చెట్లను నరికినట్టు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ రామేశ్వర్ రిమాండ్‌కు తరలించారు.




# కిడ్నీ.. జరభద్రం

**ఏదో.. దాహమేసినప్పుడు గుక్కెడు నీళ్లతోనే గొంతు తడార్చుకుంటున్నారు. వేళకు సరైన ఆహారం కూడా తినడం లేదు. ఈ నిర్లక్ష్యం కారణంగా భారతదేశంలో ప్రతి సంవత్సరం కొత్తగా రెండున్నర లక్షల మంది కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులుగా నమోదవుతున్నారు. ప్రతి ఏటా మూడున్నర కోట్లమందికి డయాలసిస్ చేయాల్సి వస్తున్నది.**



**భారతదేశంలో** కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజు రోజుకూ విపరీతంగా పెరిగిపోతున్నదని 'ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్' నివేదిక చెబుతున్నది. మన దేశ జనాభాలో 10% మంది దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్నారని ఈ నివేదిక సారాంశం. వీటన్నింటికీ కారణం.. మనకు కిడ్నీలు అనే ఓ వ్యవస్థ ఉందనీ, అవి ఆరోగ్యంగా ఉంటేనే మనం బాగుంటామని, గుండె, కాలేయంతో పాటు కిడ్నీలు కూడా సమానంగా పనిచేస్తాయని గ్రహించకపోవడమే. మహిళలైతే.. పని ధ్యాసలో పడి కిడ్నీల సంగతే మర్చిపోతున్నారు. శరీరంలో కిడ్నీలు చాలా ప్రధానమైనవి. ఇవి రక్తాన్ని ఫిల్టర్ చేస్తాయి. జీర్ణవ్యవస్థ నుండి వచ్చే వ్యర్థాలను అదనపు ద్రవాలను బయటకు పంపిస్తాయి. రక్తపోటు, ఎలక్ట్రోలైట్ స్థాయిలను నియంత్రిస్తాయి. ఎర్రరక్తకణాలను ఉత్పత్తి చేస్తూ ఆరోగ్యకరమైన ఎముకలకు భరోసానిస్తాయి.

### కిడ్నీ సమస్యను గుర్తించడమెలా?

- మూత్రం రంగు మారినా, మూత్రం అసాధారణంగా ఉన్నా, కాళ్లవాపు బాగా ఉన్నా కిడ్నీ సమస్య ఉన్నట్లే.
- కిడ్నీలు పూర్తిగా చెడిపోతే రుచి సామర్థ్యం, ఆకలి బాగా తగ్గిపోతాయి. తరచుగా వికారం, వాంతులు వస్తాయి.
- కిడ్నీల పనితీరు తగ్గితే ఎర్రరక్తకణాల ఉత్పత్తి మీద ఆ ప్రభావం పడుతుంది. అలసట, మెదడుకు సంబంధిత ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఇవి తీవ్రమైన సందర్భంలో రక్తహీనత వస్తుంది. కిడ్నీలుండే భాగంలో నొప్పి వస్తుంది.
- ఈ నొప్పితో పాటు కిడ్నీలో ఇన్‌ఫెక్షన్లు, రాళ్లకు కూడా కారణమవుతుంది. వాతావరణం వేడిగా ఉన్నప్పుడు కూడా చల్లగా ఉన్న ఫీలింగ్ ఉంటుంది. ఇది కిడ్నీలు సరిగా పనిచేయడం లేదనడానికి సంకేతం.
- పై లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి, సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి.

### పరిష్కారం ఏమిటి?

- రోజూ 7 నుంచి 8 గ్లాసుల నీటిని కచ్చితంగా తాగాలి.
- క్యాప్సికంలో ఉండే విటమిన్ ఎ, సి, పొటాషియం తదితర పోషకాలు కిడ్నీల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి.
- నిత్యం వెల్లుల్లిని ఏదో ఒక రూపంలో తీసుకుంటే కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి.
- బెర్రీలలో ఫైబర్, విటమిన్లు, ఇతర పోషకాల వల్ల శరీరంలో ఉండే మలినాలు బయటకు పోతాయి.
- ఓట్స్, కాలిఫ్లవర్, ఉల్లిపాయలు, పైనాపిల్స్ కూడా కిడ్నీల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి.
- మూత్రం వచ్చినపుడు సంకోచం లేకుండా వెళ్లి మీ పని కానివ్వాలి. లేకపోతే మూత్రనాళంపై ఒత్తిడి ఏర్పడుతుంది.

## పోస్టల్ డివిజన్ మహిళలదే



**పురుషాధిక్య సమాజంలో మహిళలకు మరో అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'పోస్టల్ ఇండియా' కర్ణాటక డివిజన్‌లో 28మంది మహిళలకు పోస్టాఫీస్‌ల బాధ్యతలు అప్పగించింది.**

**గత** మహిళా దినోత్సవం సందర్భంగా 'ఎయిర్‌క్రాఫ్ట్ రెస్క్యూ అండ్ ఫైర్‌ఫైటింగ్'లో 14 మంది మహిళలను నియమించిన కర్ణాటక ప్రభుత్వం.. తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకున్నది. ఇండియా పోస్ట్ కర్ణాటక డివిజన్‌లోని 28 పోస్టాఫీసుల బాధ్యతలను పూర్తిగా మహిళలకు అప్పగించారు. ఈ విషయాన్ని కర్ణాటక సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ చార్లెస్ లోబో వెల్లడించారు. పని ఒత్తిడిని జయించి ఇంటిని, ఆఫీస్‌ను మ్యానేజ్ చేయడంలో మహిళలు ముందుంటారని చార్లెస్ అంటున్నారు. 'ఇది మహిళలకు దక్కిన గౌరవం. మా శక్తివంచన లేకుండా పోస్టల్ వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడతాం. ప్రతియేటా మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్న కర్ణాటక ప్రభుత్వానికి కృతజ్ఞతలు' అని రాజాజీనగర్ పోస్టల్ అధికారి సౌమ్య అన్నారు.

## చెప్పులు చెప్పిన నిజాలు

**ఆమె చెప్పులు ఓ నిజం చెప్పాయి. నిశ్శబ్దంగా నినదించాయి. వీధుల్లో బారులు తీరాయి. ఎరుపు రంగు పులుముకొని వివక్షమీద గర్జించాయి. ఆమె కాలికుండే చెప్పులే ఇవన్నీ చేస్తే.. మరి ఆమే తలుచుకుంటే?**






**ఆకాశంలో..** అవనిలో ఆమె సగం.. కానే కాదు ఆమే మొత్తం! అలాంటి ఆమె లేని ఒక్క క్షణాన్నైనా మనం ఊహించుకోగలమా? కానీ మెక్సికో చరిత్రలో అలాంటి ఓ రోజు నమోదయ్యింది. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వివక్ష, లింగభేదంపై నిరసనగా 'డే విత్ ఔట్ వుమెన్' పేరిట ఓ వినూత్న కార్యక్రమం జరిగింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్కడి మహిళలు వినూత్న కార్యక్రమం తెలిపారు. 'ఆమె లేని ఒక రోజు' పేరిట ఈ నిరసన జరిగింది. ఆఫీసులు, స్కూళ్లు, హోటళ్లు, షాపింగ్ మాళ్లు, దుకాణాలు, ప్రార్థనామందిరాలు ఇలా రోజంతా ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే ఉంటూ నిరసన తెలిపారు. వీరి నిరసనకు మద్దతుగా ఆదేశంలోని గృహిణులు సైతం ఆ రోజంతా ఏ పనిచేయకుండా మద్దతు తెలిపారు. మహిళలపై పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా జరిగిన ఈ కార్యక్రమానికి సామాజిక కార్యకర్తలు, సామాన్యులు అందరూ మద్దతు పలికారు. 'ఎ డే విత్ఔట్ వుమెన్' అనే ఫేస్‌బుక్ గ్రూప్ ద్వారా రోజంతా మహిళలు ఎవ్వరూ కనిపించకుండా ఉండాలనే విషయంపై చర్చించారు. ఇదే గ్రూప్ సభ్యులు మహిళల అదృశ్యానికి వ్యతిరేకంగా రోడ్లపై ఎర్రని పాదరక్షలు ఉంచి నిరసన తెలిపారు.

## రూ. 27 లక్షల వేతనం



మధురిమ, శిరీష ఇంజినీరింగ్ విద్యార్థులు. వీరికి అమెజాన్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో జాబ్ ఆఫర్ చేసింది. వీరు ఆశించిన సాలరీకంటే ఎక్కువ మొత్తం చెల్లించేందుకు సిద్ధమైంది. రూ.27 లక్షల వార్షిక వేతనంతో వీరికి ఉద్యోగాలు ఇచ్చింది. మధురిమ, శిరీష మేడ్చల్ జిల్లా దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ నాలుగో సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల కళాశాలలో జరిగిన ఇంటర్వ్యూల్లో వీరికి ప్లేస్‌మెంట్స్ లభించాయి.

## కడుగడం సులువు



**కూరగాయలు** కడిగేటప్పుడు, ఏవైనా పండ్లు కడుగాలనుకున్నప్పుడు ఏం చేస్తాం? ఒక గిన్నెలో వేసి కడుగుతాం. కానీ ఆ నీటిని వంపేటప్పుడు మాత్రం అందులోంచి కొన్ని కింద పడిపోవడం ఖాయం. అలా కాకుండా లోపల ఉన్నవి జాగ్రత్తగా ఉంటూ.. నీళ్లు మాత్రమే పోయేలా ఒక గిన్నె ఉంటే బాగుంటుందని మీకు అనిపించొచ్చు. మీ ఆలోచననే ఓ కంపెనీ విని ఇలా ఒక బౌల్‌ని తయారుచేసింది. ఇందులో బియ్యం, కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు.. ఇలా అన్నీ వేసి కడిగి శుభ్రం చేసుకోవచ్చు. వివిధ సైజుల్లో, వివిధ రంగుల్లో దొరికే ఈ బౌల్ కూడా 100 రూపాయల నుంచి 250 రూపాయల్లోనే దొరుకుతుంది.

## నోరూరినా తినలేరు



**మిర్చి బజ్జీ నుంచి బ్యాడ్మింటన్ వరకు, ఇలా అన్ని వస్తువులు, ఆహార పదార్థాలను అతి చిన్న పరిమాణంలో తయారు చేసి అందరినీ అబ్బుర పరుస్తున్నది. వీటిని చూస్తుంటే నోరూరుతుంది. కానీ వీటిని చూడడం తప్ప తినలేమంటున్నది తెలంగాణ అమ్మాయి.**


మిర్చి బజ్జీ, కేకులు, బర్గర్, చిప్స్, రొట్టెలు, రోల్స్, ఆడుకునే బాల్, బ్యాట్ ఇలా చెప్పలేనన్ని ఐటమ్స్‌ను ప్లేట్‌లలో సర్వ్ చేసి అందరికీ చూపిస్తున్నది. తినడానికి వీల్లేదనే నిబంధన కూడా ఉంది. ఎందుకంటే ఈ పదార్థాలన్నింటినీ తయారు చేసింది బంకమంటితో కాబట్టి. తెలంగాణలోని కామారెడ్డి పట్టణానికి చెందిన స్ఫూర్తి దానబోయినా ఈ మినియేచర్ ప్రపంచానికి సృష్టికర్త. 2019 అక్టోబర్ నుంచి ఈ వృత్తిని కొనసాగిస్తున్నది. 22 ఏండ్ల స్ఫూర్తి నిఫ్ట్ కాలేజీలో యాక్సెసరీ డిజైన్ చేసింది. రోజంతా ఈ పనిలో ఉంటుంది. ఈ బంకమంటి నిమిషాల్లో ఆరిపోతుంది. ఆమె చర్మం సున్నితంగా ఉండడంతో కళారూపాల తయారీ సులువవుతున్నది. టూత్‌పిక్, చాక్, సూది, టూత్‌బ్రెష్, చేతివేళ్ళ సాయంతో బంకమట్టికి పాస్టెల్ పౌడర్ కలిపి బొమ్మలుగా చేస్తుంది. వీటికి అక్రిలిక్ పెయింట్స్ వేస్తుంది. ఒక ఆర్ట్‌ను తయారుచేయడానికి ఒకటి, రెండు గంటల సమయం పడుతుంది. గత మూడేండ్లలో 40 ఆర్డర్లు చేసింది. త్వరలో వర్క్‌షాపులు నిర్వహించే పనిలో ఉన్నది స్ఫూర్తి.

### వంటింటి చిట్కాలు


- మటన్ బిర్యానీ వండేటప్పుడు మటన్ ముదురుగా ఉంటే త్వరగా ఉడకకపోతే ఓ చిన్న పచ్చి బొప్పాయి ముక్క వేయాలి.
- కుక్కర్ నల్లగా మాడకుండా ఉండాలంటే అందులో కొద్దిగా చింతపండు వేయాలి.
- అల్లంవెల్లుల్లి పేస్ట్ ఎక్కువకాలం నిల్వ ఉండాలంటే కొంచెం పసుపు, ఉప్పు, కలిపి పెట్టుకుంటే చాలు.

**ప్రాచీనకాలంలో యోగసిద్ధులు ఎన్నో ఏళ్లు అన్నపానాలు లేకుండా తపస్సు చేసేవాళ్లు.. అయినా వాళ్ల ఆరోగ్యానికేమీ ఢోకా ఉండేది కాదు.. ఎలా? ఇప్పుడు ఆధునిక వైద్యం సహాయంగా ఉన్నా మనం ఆరోగ్యంగా ఉండలేకపోతున్నాం.. ఎందుకు? తీసుకునే ఆహారం.. ఉంటున్న పద్ధతి.. నడవడిక.. ఆలోచనలు... ఇవి సక్రమంగా ఉంటే చాలు.. ఏ రోగమూ దగ్గరకు రాదంటున్నది సిద్ధ వైద్యం. అయిదువేల సంవత్సరాల చరిత్ర కలిగిన సిద్ధవైద్యంలో 20 ఏళ్లు శిక్షణ పొంది, 25 సంవత్సరాలుగా సేవలందిస్తున్న 36వ తరం సిద్ధయోగ వైద్య నిపుణులు డాక్టర్ భువనగిరి సత్య సింధుజ దీని గురించి ఏం చెప్తున్నారంటే..?**

# జీవన విధానమే అసలైన వైద్యం



**ఆయుర్వేదం** కన్నా ముందు పుట్టింది సిద్ధ వైద్యం. ఇది మర్మకళలకు సంబంధించిన శాస్త్రం. ప్రాచీన కాలంలో రుషులు తపస్సు చేసేటప్పుడు నాడీబంధన చేసుకొని కూర్చునేవాళ్లు. అందువల్ల ఎన్నేళ్లు గడిచినా, తిండి లేకపోయినా ఆ చైతన్యం, యాక్టివ్‌నెస్ ఉండేది. ఇందుకు కారణం సిద్ధయోగ సాధన చేయడమే. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని అందించే వైద్యమే సిద్ధ యోగ. మన శరీరంలో బయటికి కనిపించని 72 వేల కీలకమైన నాడులు శక్తికేంద్రాలుగా ఉంటాయి. వీటిలో ఉండే బ్లాక్స్‌ను సరిచేసి యోగప్రక్రియ ద్వారా చక్రాలను సిద్ధ వైద్యం ద్వారా యాక్టివేట్ చేస్తారు. 90 శాతం వ్యాధులను శరీరమే నయం చేసుకుంటుంది. అలా దానికదె బాగుచేసుకునే ప్రక్రియను యాక్టివేట్ చేసేదే చక్రసిద్ధ యోగా. ఈ వైద్యం శరీరాన్ని ప్రకృతికి దగ్గర చేస్తుంది.



### శస్త్రచికిత్స అవసరం లేకుండా..

సిద్ధ వైద్యం ద్వారా శస్త్రచికిత్స అవసరాన్ని నివారించవచ్చు. ఆర్థరైటిస్‌ను కూడా సరిచేయొచ్చంటున్నారు డాక్టర్ సింధుజ. ఆస్టియో ఆర్థరైటిస్ వల్ల కేవలం కార్టిలేజ్ అరగడం మాత్రమే కాదు లిగమెంట్స్, టెండాన్స్ వదులవుతాయి. వాటిని కూడా బలోపేతం చేస్తారు. కీలులో కార్టిలేజ్ అరిగిపోవడం వల్ల రెండు ఎముకలు ఒకచోటికి వచ్చి రాసుకుంటాయి. ఈ చికిత్స ద్వారా రెండు ఎముకలు ఒక దగ్గరికి రాకుండా గ్యాప్ మెయిన్‌టెయిన్ అవుతుంది. ర్యుమటాయిడ్ ఆర్థరైటిస్ లాంటి ఆటోఇమ్యూన్ వ్యాధులు కూడా నయమవుతాయి. వర్టిగో, సయాటికా, సైనసైటిస్, గూని, కార్పల్ టన్నెల్ సిండ్రోమ్, మైగ్రేన్, ఫ్రోజెన్ షోల్డర్, సెప్టమ్ డీవియేషన్ లాంటి ఎన్నో సమస్యలకు ఇది పరిష్కారం చూపుతున్నది. చిన్న చిన్న ఫ్రాక్చర్లు వాటికవే అతుక్కుంటాయి. ఆ శక్తి శరీరానికి ఉంటుంది. అలాంటి శక్తిని ఈ చికిత్స జాగృతం చేస్తుంది. సర్వికల్ నరంపై ఒత్తిడి వల్ల చెయ్యి మొద్దుబారుతుంది. చేతులు తిమ్మిర్లెక్కుతాయి. ఈ సమస్యలు వర్టిగోకు కూడా దారితీయొచ్చు. ఇలాంటి సమస్యల్ని ఈ వైద్యం సరిచేస్తుంది. సెరిబ్రల్ పాల్సీ, మస్క్యులర్ డిస్ట్రోఫీ లాంటి మొండివ్యాధులకు కూడా ఇది పరిష్కారం చూపిస్తుంది.

### చికిత్సలో ఏం చేస్తారు?

జబ్బు ఉన్నదీ అంటే అక్కడ ఇన్‌ఫ్లమేషన్ ఉందనర్థం. శక్తి కేంద్రాలపై చిన్న ఒత్తిడి కలిగించడం ద్వారా ఈ ఇన్‌ఫ్లమేషన్‌ను తొలగిస్తారు. అంటే పైనుంచి క్రమ పద్ధతిలో ఒత్తిడి పంపించడం ద్వారా శక్తి కేంద్రంలో ఉన్న బ్లాక్స్‌ని తొలగిస్తారు. చికిత్సకు 3 వారాల నుంచి 5 వారాల సమయం పడుతుంది. డీజనరేషన్ లాంటి వాటికి ఎక్కువ రోజులు పడుతుంది. అవసరమైన వ్యాయామాలను చేయిస్తారు. అయితే మనం తినే తిండి, వ్యాయామం, ఆలోచనలు చికిత్సపై ప్రభావం చూపిస్తాయి. అందుకే చికిత్స సమయంలో పద్ధతి కలిగిన జీవన విధానం పాటించాలి. కూర్చోవడం, నిల్చోవడం దగ్గరినుంచి పర్‌ఫెక్ట్‌గా మెయిన్‌టెయిన్ చేయాలి. చికిత్స సమయంలో మాంసాహారం తినొద్దు. పొగతాగడం, మద్యం మానేయాలి. పీరియడ్స్‌లో ఉంటే ట్రీట్‌మెంట్ ఆపుతారు. చికిత్స మొదలుపెట్టిన మూడోరోజు నుంచి గుణం కనిపిస్తుంది.

### ఇవి పాటిస్తే ఏ రోగాలూ రావు...!

- ఉదయం 5 గంటలకు లేచి సూర్యుడిని చూస్తే సగం రోగాలు రావు. ఒంటికి విటమిన్ డి పడుతుంది.
- తిండిలో లోపాలు. ఫాస్ట్ ఫుడ్ తీసుకోవద్దు. ఒంటబట్టేలా తిండి ఉండాలి. పప్పు, కూర, అన్నం, నెయ్యి తింటే చాలు. రకరకాల డైట్‌లు అక్కర లేదు. చద్దన్నం తినడం బెస్ట్. గుమ్మడి గింజల లాంటివి తీసుకుంటే మెగ్నీషియం, కాల్షియం లాంటి మినరల్స్ అందుతాయి.
- శరీరం తనకేం కావాలో చెప్తుంది. అది గమనించి తినాలి. ఇష్టం ఉందని ఎక్కువ తినడం చేయొద్దు. బ్యాలెన్స్ చేయాలి. శ్రమ, దానికి తగిన తిండి, పాజిటివ్ ఆలోచన ఉండాలి. తినేటప్పుడు చేసే ఆలోచనలు కూడా జీర్ణప్రక్రియ మీద ప్రభావం చూపిస్తాయి.
- రోజుకి రెండు భోజనాలు చాలు. పొద్దున 10 గంటలకు, మళ్లీ రాత్రి 7 లోపు తినేయాలి. మధ్యాహ్నం జఠరాగ్ని పని మొదలుపెడుతుంది. అప్పుడు టీ తాగడం కరెక్ట్ కాదు. స్పూన్లు వాడకుండా చేతితో కలుపుకొని తినడం వల్ల నరాలు యాక్టివేట్ అవుతాయి. బీపీ తగ్గుతుంది. ఎక్కువ తింటే గురక వస్తుంది. తక్కువ తింటే నిద్రరాదు.
- మనకోసం మనుషులు ఉన్నారంటే అదే పెద్ద ట్రీట్‌మెంట్. ఇప్పుడు ఎవరూ ఎవరితో మాట్లాడటం లేదు. పొద్దున లేచిన తరువాత 10 వరకు ఎవర్నీ తిట్టకుండా, మనవాళ్లనుకునే వాళ్లతోనైనా కాసేపు మాట్లాడుకొని, పాజిటివ్ ఆలోచనలతో ఉంటే రోజంతా చైతన్యంగా ఉంటుంది.
- చక్కగా పొద్దున్నే ప్రకృతిలో మమేకమై వాకింగ్ చేయండి. నడిస్తే కాళ్లలో పాయింట్స్ యాక్టివేట్ అవుతాయి. దాంతో సయాటికా రాదు. పాదాల నొప్పులుండవు.
- శ్వాస కూడా ఒక టెక్నిక్. వేగంగా శ్వాసించకూడదు. నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి. శ్వాసను పట్టి ఉంచడం అలవరచుకోవాలి. శ్వాస ద్వారా సిస్టమ్‌ని సింక్రనైజ్ చేయొచ్చు. ప్రశాంతమైన చూపు, ఎదుటివారిపట్ల మన దృక్పథం కూడా ముఖ్యమే.
- వెన్నుపాము నిటారుగా ఉంటే 90 శాతం రోగాలు రావు. భుజాలు వేలాడదీసి, వంగిపోయి కూర్చోవడం, నిల్చోవడం చేయొద్దు.

... రచన ముడుంబై



## పూసల హారాలు

**మగువలు** చీర, బ్లౌజ్, ఇయర్‌రింగ్స్, గాజులు ఇలా ఎన్ని ఆభరణాలు అలంకరించుకున్నా మెడలో హారం పడందే లుక్ రాదు. అది కూడా మెండుగా ఉంటే ఆ రూపమే మారిపోతుంది. లాంగ్ చైన్లు, చోకర్ల డిజైన్లకు మధ్యలో ఉండేలా ఈ చైన్ ఉంటుంది. బ్లాక్, గోల్డ్ రంగుల పూసలను దారాల్లో దూర్చి ఒకటిగా కట్టి వాటికి ఒక ఉక్కు సాయంతో మెడలో వేసుకుంటే చాలు. ఇది ఉండగా వేరే అవసరం రాదు. దీనికి తగినట్లుగా వస్త్రధారణ ఉంటే పార్టీలు, ఫంక్షన్లో స్పెషల్ అప్పియరెన్స్‌గా మారుతారు. చైన్‌కు జోడీగా ఇయర్ రింగ్స్ పెట్టుకుంటే ఆ లుక్కే వేరబ్బా..!

## బంగారు బాటిల్!



**ఎండకాలం** వచ్చేసింది. నీళ్లకు ఒక బాటిల్‌ని చేతిలో పట్టుకొని తిరగడం కామన్. కానీ ఆ బాటిల్ బంగారు పూతదయితే?! ఫ్యాషన్ బ్రాండ్ ఈ బాటిల్స్‌ని కూడా లగ్జరీ బ్రాండ్ చేసేసింది. చానెల్ జస్ట్ 2019-2020 యాక్సెసరీస్‌లో ఈ బాటిల్‌ని చేర్చింది. బంగారు పూతతో ఉండే ఈ సిప్పర్ బాటిల్‌కి పైన కవర్ చేయడానికి లెదర్ బ్యాగ్ తొడుగు, పైన హ్యాండ్‌బాగ్‌లా తగిలించుకోవడానికి ఒక చెయిన్ ఉంటుంది. పైగా అన్ని డ్రెస్‌లకి మ్యాచ్ అయ్యేలా గోల్డ్, బ్లాక్ కాంబినేషన్‌లా ఈ లెదర్ మెటీరియల్‌ని డిజైన్ చేశారు. అయితే ఈ బాటిల్ ధర ఎంతో తెలుసా? 59 లక్షల రూపాయల పై మాటే. ప్రత్యేకంగా హాలీవుడ్, బాలీవుడ్ స్టార్‌లతో పాటు ఇండస్ట్రియలిస్టులు ఈ బాటిల్స్ కోసం తెగ ఆర్డర్‌లు చేస్తున్నారట.

# రాజమండ్రిలో టక్ జగదీష్


నాని

హీరో నాని, దర్శకుడు శివనిర్వాణ కలయికలో రూపొందుతున్న తాజా చిత్రం 'టక్ జగదీష్'. షైన్ స్క్రీన్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రీతూ వర్మ, ఐశ్వర్యరాజేష్ కథానాయికలు. ప్రస్తుతం రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతున్నది. నిర్మాతలు మాట్లాడుతూ 'వైవిధ్యమైన కథ, కథనాలతో రూపుదిద్దుకుంటున్నఎంటర్‌టైనర్ ఇది. పొల్లాచ్చిలో జరిగిన తొలి షెడ్యూల్‌లో నాని, రీతూవర్మలపై కీలక ఘట్టాల్ని చిత్రీకరించాం. ప్రస్తుతం రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న రెండో షెడ్యూల్‌లో ఒక పాట, యాక్షన్ ఎపిసోడ్‌తో పాటు కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నాం' అని తెలిపారు.

# వైవిధ్యమైన సినిమాలే చేస్తా


సాయితేజ

'ప్రేమ, యాక్షన్, మదర్ సెంటిమెంట్‌తో పాటు తెలుగు ప్రేక్షకులు కోరుకునే అన్ని హంగులున్న చిత్రమిది. పరిపూర్ణ విందుభోజనంలా ఉంటుంది' అని అన్నారు కల్వకోట సాయితేజ. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'శివన్'. సంతోష్‌రెడ్డి నిర్మాత. శివన్ దర్శకుడు. ఈ నెల 13న విడుదలకానుంది. ఈ సందర్భంగా సాయితేజ మాట్లాడుతూ ' హీరోగా నా తొలి సినిమా ఇది. ఇంతకుముందు 'మజిలీ' సినిమాలో నార్త్ ఇండియన్ యువకుడిగా చిన్న పాత్రలో కనిపించాను. అలాగే 'పిల్లా పిల్లాడు' అనే వెబ్‌సిరీస్‌లో నటించాను. నటుడిగా ఈ వెబ్‌సిరీస్ నాకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. హీరో పాత్రకు సరిపోయే నటుడి కోసం అన్వేషిస్తున్న ఈ చిత్ర దర్శకుడు వెబ్‌సిరీస్‌లో నా నటన నచ్చి సంప్రదించారు. రొటీన్ సినిమాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎక్కడ బోర్ ఫీలింగ్ కలగనీయకుండా తర్వాత ఏం జరుగబోతుందోననే ఉత్కంఠను ప్రతిక్షణం పంచుతుంది

**ప్రతీకారంతో..**

లవ్ థ్రిల్లర్ చిత్రమిది. ప్రతీకార నేపథ్యంలో సాగుతుంది. ప్రాణప్రదంగా ప్రేమించిన ప్రియురాలి తోడుగా నచ్చిన ఉద్యోగం చేస్తూ సంతోషంగా జీవితాన్ని వెల్లదీస్తున్న శివ అనే యువకుడి జీవితంలో ఎలాంటి అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి? అతడి ప్రవర్తనలో వచ్చిన మార్పులేమిటన్నది?తెరపై ఆసక్తిని పంచుతుంది. అంతర్లీనంగా చక్కటి ప్రేమకథ మిళితమై ఉంటుంది. పతాక ఘట్టాల్లో వచ్చి మలుపు ఆకట్టుకుంటుంది. వయోలెంట్‌గా మాస్ కోణంలో నా పాత్ర సాగుతుంది. ఈ క్యారెక్టర్ కోసం ఎవరిని రిఫరెన్స్‌గా తీసుకోలేదు. రెండు వారాలు వర్క్‌షాప్‌లో పాల్గొన్నాను. అది ఉపయోగపడింది. దర్శకుడి పేరు, సినిమా టైటిల్ ఒకటే కావడం కాకతాళీయంగా జరిగింది. సినిమాలో నా పాత్ర పేరు శివ. ఆ పేరునే టైటిల్‌గా నిర్ణయిస్తే బాగుంటుందనే ఆలోచనతో శివన్ అని పెట్టాం. నా సినిమా అనే భావనతో కాకుండా సాధారణ ప్రేక్షకుడిగా ఈసినిమా చూశాను. చాలా నచ్చింది.

**కరీంనగర్ స్వస్థలం**

హీరోగానే కాకుండా విభిన్నమైన పాత్రలతో మంచి పేరు తెచ్చుకోవాలనుంది. కథ, నా పాత్రల్లో వైవిధ్యత ఉన్న సినిమాలే చేస్తాను. కరీంనగర్ నా స్వస్థలం. పదో తరగతి వరకు అక్కడే చదువుకున్నాను. ఆ తర్వాత మా కుటుంబం హైదరాబాద్‌కు తరలివచ్చింది. డిగ్రీ పూర్తిచేశాను. ప్రస్తుతం కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. కథలు వింటున్నాను.

# సింగర్‌తో అమలాపాల్ ప్రేమ

ముంబాయికి చెందిన ఓ గాయకుడితో అమలాపాల్ ప్రేమలో పడిందా?అంటే ఔననే వార్తలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల క్రితం దర్శకుడు ఏ.ఎల్ విజయ్ నుంచి విడాకులు తీసుకున్న అమలాపాల్ ప్రస్తుతం దక్షిణాది భాషల్లో సినిమాలు చేస్తున్నది. 'దైవ తిరుమగల్' సినిమా చిత్రీకరణలో దర్శకుడు ఏ.ఎల్ విజయ్‌తో అమలాపాల్‌కు ఏర్పడిన పరిచయం ప్రణయంగా మారింది. 2014లో విజయ్‌ని పెళ్లాడిందామె. అయితే మనస్పర్థల కారణంగా మూడేళ్లలోనే ఈ జంట వైవాహిక బంధానికి ముగింపు పడింది. తాజాగా అమలాపాల్ ముంబాయికి చెందిన గాయకుడు భవిందర్‌తో ప్రేమలో ఉన్నట్లు పుకార్లు షికారు చేస్తున్నాయి. ఇటీవల ప్రియురాలు గాఢంగా తనను హత్తుకున్న ఓ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంచుకున్న భవిందర్ 'ప్రియురాలి స్వస్థలంలో వేసవిని ఆస్వాదిస్తున్నా' అనే వ్యాఖ్యను జోడించారు. ఈ ఫొటోలో ఉన్నది అమలాపాల్ అంటూ ప్రచారం జరుగుతున్నది. భవిందర్‌తో ఆమె ప్రేమలో ఉన్నదని చెబుతున్నారు. గతంలో అమలాపాల్‌తో సన్నిహితంగా ఉన్న ఫొటోల్ని భవిందర్ పలుమార్లు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. దాంతో ఈ జంట ప్రేమాయణం నిజమేనంటూ వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రేమ వ్యవహారంపై అమలాపాల్ మాత్రం ఇప్పటివరకు పెదవివిప్ప లేదు.


అమలాపాల్

# నేటి సీతాయణం


అక్షిత్, అనహిత

కన్నడ నటుడు శశికుమార్ తనయుడు అక్షిత్‌శశికుమార్ కథానాయకుడిగా అరంగేట్రం చేస్తున్న చిత్రం 'సీతాయణం'. 'రెస్పెక్ట్ ఉమెన్' ఉపశీర్షిక. ప్రభాకర్ ఆరిపాక దర్శకుడు. అనహిత భూషన్ కథానాయిక. కలర్ క్లౌడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై లలిత రాజ్యలక్ష్మి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. బుధవారం ఫస్ట్‌లుక్‌ను చిత్ర బృందం విడుదలచేసింది. నిర్మాత మాట్లాడుతూ 'క్రైమ్ డ్రామా కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రమిది. బ్యాంకాక్, బెంగళూర్, మంగళూర్, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. పతాక ఘట్టాలు అలరిస్తాయి. తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో ఈ నెలలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. 'నేటితరానికి నచ్చే హృద్యమైన ప్రేమకథా చిత్రమిది. అక్షిత్‌కు హీరోగా చక్కటి శుభారంభాన్ని అందిస్తుంది. నాయకానాయికల కెమిస్ట్రీ ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అని దర్శకుడు పేర్కొన్నారు. అజయ్‌ఘోష్, మధునందన్, విద్యుల్లేఖరామన్, బిత్తిరిసత్తి, కృష్ణభగవాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం:పద్మనాభ్ భరద్వాజ్, సాహిత్యం: చంద్రబోస్, ఆనంతశ్రీరామ్.

# నవ్విస్తూనే కన్నీళ్లు పెట్టిస్తుంది


అనూప్ రూబెన్స్, మున్నా, ఎస్వీ బాబు, ప్రదీప్, అమృత అయ్యర్

'ఈ సినిమాతో నూతన అధ్యాయాన్ని మొదలుపెట్టబోతున్నాం. మహేష్‌బాబు, కాజల్, రానా మంచి మనసుతో మమ్మల్ని ప్రోత్సహించారు' అని అన్నారు ప్రదీప్‌మాచిరాజు. ఆయన కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'ముప్పై రోజుల్లో ప్రేమించడం ఎలా'. మున్నా దర్శకుడు. ఎస్వీబాబు నిర్మించారు. అమృత అయ్యర్ కథానాయిక. ఈ నెల 25న ఈ చిత్రం విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో చిత్ర బృందం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. ప్రదీప్ మాట్లాడుతూ 'ఈ సినిమాతో హీరోగా తొలి అడుగు వేయబోతున్నాను. మంచివాళ్లంతా మాకు అండగా నిలవడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. దర్శకుడు మున్నా మాట్లాడుతూ 'నేను దర్శకుడినవ్వడానికి సుకుమార్ కారణం. ఈ సినిమా కథను అల్లు అర్జున్‌కు చెప్పాను. ఆయన చాలా ఎంజాయ్ చేశారు. మంచి సలహాలు ఇచ్చారు. సినిమాలో కళ్లతోనే చక్కటి అభినయాన్ని పలికించింది అమృత అయ్యర్. యాంకర్‌లా కాకుండా నటుడిగా తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకోవాలనే భయంతో ప్రదీప్ ఈసినిమా చేశాడు. నవ్విస్తూనే కన్నీళ్లను పెట్టించే సినిమా ఇది' అని అన్నారు. 'నీలీ నీలీ ఆకాశం..' పాటను డెబ్బై మిలియన్లకుపైగా వీక్షించారని, సంగీతాన్ని అందించడానికి చక్కటి సందర్భాలు ఈసినిమాలో కుదిరాయని అనూప్ రూబెన్స్ పేర్కొన్నారు. అన్ని వర్గాల వారిని అలరించే నవ్యమైన చిత్రమిదని నిర్మాత తెలిపారు. అరుదైన చక్కటి పాత్రతో కథానాయికగా పరిచయం కానుండటం అదృష్టంగా భావిస్తున్నానని అమృత అయ్యర్ పేర్కొన్నది. ఈ కార్యక్రమంలో శివ, శరణ్య తదితరులు పాల్గొన్నారు.


'తెలుగు వీర లేవరా' చిత్ర ప్రారంభోత్సవ దృశ్యం

రాహుల్ విజయ్, రమ్య పసుపులేటి జంటగా నటిస్తున్న 'తెలుగు వీరలేవరా' చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. లక్ష్మణ్ రెడ్డి దర్శకుడు. యాదగిరి రాజు నిర్మిస్తున్నారు. ఈ వేడుకకు మల్కాజ్‌గిరి శాసనసభ్యుడు మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

# రాఘవన్-2కు రెడీ

కోలీవుడ్‌లో మరో సీక్వెల్‌కు రంగం సిద్ధమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కమల్‌హాసన్ హీరోగా గౌతమ్ మీనన్ దర్శకత్వంలో రూపొందిన 'వెట్టైయాడు విలయాడు(తెలుగులో 'రాఘవన్') పెద్ద విజయాన్ని సాధించింది. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందిన ఈ చిత్రంలో కమల్‌హాసన్ నటనతో గౌతమ్‌మీనన్ సినిమాను తెరకెక్కించిన తీరుకు ప్రశంసలు లభించాయి. తాజాగా ఈ చిత్రానికి సీక్వెల్‌ను రూపొందించేందుకు గౌతమ్‌మీనన్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దర్శకుడు చెప్పిన పాయింట్ నచ్చడంతో కమల్ ఈ సీక్వెల్ నటించడానికి సంసిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు.

# ఆర్‌ఎక్స్100తో సంబంధం ఉండదు


జీపీఎస్, కపిలాక్షి మల్హోత్రా

'స్వచ్ఛమైన ప్రేమ ఔన్నత్యాన్ని చాటిచెప్పే సినిమా ఇది. ప్రేమ పట్ల నవతరం ఆలోచనధోరణులు ఎలా ఉంటున్నాయో ఈ సినిమాలో చూపించాం' అని అన్నారు మురళీరామస్వామి. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రేమపిపాసి'. జీపీఎస్, కపిలాక్షిమల్హోత్రా, సోనాక్షీవర్మ నాయకానాయికలుగా నటించారు. పి.ఎస్.రామకృష్ణ నిర్మాత. ఈ నెల 13న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. హీరో జీపీఎస్ మాట్లాడుతూ 'అందరూ మా సినిమాను 'ఆర్‌ఎక్స్100'తో పోల్చుతున్నారు. ఆ చిత్రంతో మా కథకు ఎలాంటి సంబంధం ఉండదు. ఫలానా హీరోలా మాట్లాడితే పాపులారిటీ వస్తుందని స్నేహితులు సలహా ఇచ్చారు. ఆ అవసరం నాకు లేదు. విడుదలయ్యాక మా సినిమానే మాట్లాడుతుందనే నమ్మకముంది' అని చెప్పారు. సరికొత్త ట్రెండ్‌ను సృష్టించే చిత్రమిదని నిర్మాత తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'రెండేళ్ల కష్టానికి ప్రతిఫలమిది. ఎలా ప్రేమించాలి, ఏ విధంగా ప్రేమించకూడదో ఈ సినిమా చాటిచెబుతుంది. హీరో జీపీఎస్ క్యారెక్టర్ భిన్న పార్శ్వాలతో సాగుతుంది. తన నటనతో సినిమాకు ప్రాణంపోశాడు' అన్నారు. ఈ సినిమాలో తాను నాలుగు పాటలు రాశానని గేయరచయిత సురేష్ గంగుల తెలిపారు. ఈ కార్యక్రమంలో రాహుల్‌భాయ్, కపిలాక్షి మల్హోత్రా తదితరులు పాల్గొన్నారు.



నమస్తే తెలంగాణ
# యువ
[ కరీంనగర్ ]
గురువారం 12 మార్చి 2020

## స్టైలిష్ సారా



సారా అలీఖాన్.. పొట్టి పొట్టి బట్టలతో కుర్రాళ్లకు సెగలు పుట్టిస్తున్నది. బట్టల విషయంలో చాలా అప్‌డేట్‌గా ఉండే సారా.. తరచూ కొత్త డిజైన్లతో కూడిన బట్టలు ధరిస్తూ ఫొటోలకు ఫోజిస్తూ ఉంటుంది. ఇటీవల కూడా బికినీతో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. కొందరు మెచ్చుకోగా, కొందరు ట్రోల్ చేశారు.

## విజేతల జోష్ టాక్స్

విజేతలంటే విశ్వాన్ని జయించినవాళ్లే కాదు.. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్న ప్రతి ఒక్కరూ విజేతలే. అలాంటి అసామాన్యులెందరికో వేదికనిస్తూ.. స్ఫూర్తి నింపే గాథల్ని వినిపిస్తున్నది ఈ జోష్‌టాక్.

**హర్యానాకు** చెందిన శోభిత్ బంగా, సుప్రియ పాల్ 2015లో జోష్ టాక్స్‌ను ప్రారంభించారు. దేశాన్ని చైతన్యపర్చాలనే ఆలోచనతోనే వీరు జోష్ టాక్స్ మీడియా ప్లాట్‌ఫాంను ప్రారంభించారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, పబ్లిక్ పాలసీ, స్పోర్ట్స్, ఎంటర్‌టైన్‌మెంట్, సామాజిక సేవ వంటి ఇరవై విభాగాల్లో విజయాలు సాధించిన ప్రముఖుల ఇంటర్వ్యూలను ప్రచురిస్తున్నది. దేశంలోని 30 నగరాల్లో 1500 టాక్స్, లక్షల్లో లైవ్స్ ఏర్పాటు చేసింది. వివిధ కాలేజీల్లో 300 వర్క్‌షాప్స్ ఏర్పాటు చేసి ప్రపంచంలోనే అతిపెద్ద ఆన్‌లైన్ కమ్యూనిటీగా జోష్‌టాక్స్ పేరు పొందింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా తన సేవల్ని విస్తరించేందుకు సిద్ధమవుతున్నది. జోష్‌టాక్స్‌ను ప్రారంభించి ఎంతో మందిలో స్ఫూర్తి నింపుతున్నందుకుగాను శోభిత్ బంగా 2018లో ఫోర్బ్స్ అండర్ 30 జాబితాలో పేరు దక్కించుకున్నాడు.




### టెక్నాలెడ్జీ

## అదిరేటి ఐక్యూ హెడ్‌ఫోన్స్



చైనా కంపెనీ లెనోవా నుంచి వైర్‌లెస్ హెడ్‌ఫోన్లు విడుదలయ్యాయి. సరికొత్త ఐక్యూ టెక్నాలజీతో 'హెచ్‌డి 116' పేరుతో ఇవి అందుబాటులో ఉన్నాయి.

**మంచి లుక్**, సౌండ్ అవుట్‌పుట్, బ్లూటూత్ కనెక్టివిటీ లాంటి క్లాసిక్ ఫీచర్లను కలిగి ఉన్నాయి. దీంతో పాటు డ్యూయల్ ఐక్యూ మోడ్, 240హెచ్ స్టాండ్‌బై బ్యాటరీ సామర్థ్యం ఉంది. ఒకసారి చార్జ్ చేస్తే 24 గంటలు పని చేస్తుంది. 2019లో తమ ఆడియో పరికరాలకు ఇండియా నుంచి వచ్చిన విశేష ఆదరణ నేపథ్యంలో ఐక్యూ టెక్నాలజీతో అప్‌గ్రేడ్ వెర్షన్‌ను తీసుకొచ్చినట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఇవి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో లభ్యమవుతుందని కంపెనీ తెలిపింది. దీని ధర రూ .2,499.

## ఎఫ్‌బీ నుంచి కొత్త యాప్




**సోషల్ మీడియా** దిగ్గజ సంస్థ ఫేస్‌బుక్ మరో కొత్త యాప్‌ను రిలీజ్ చేసింది. హాబీ (Hobbi) పేరుతో ఈ యాప్ ఆకట్టుకుంటున్నది. పింటరెస్ట్‌ను పోలిన ఈ యాప్ యూజర్లు తమ హాబీలను, ఫొటోలను, వీడియోలను షేర్ చేసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా ఇష్టమైన గార్డెనింగ్, వంట, ఆర్ట్స్, డెకరేషన్ ఇలాంటి హాబీలను ఓ క్రమంలో సెట్ చేసుకోవచ్చు. తమ కలెక్షన్లు, ప్రాజెక్టులను ఆర్గనైజ్ చేసుకోవడానికి కూడా ఈ యాప్ తోడ్పడుతుందని ఫేస్‌బుక్ ప్రకటించింది. ఈ కలెక్షన్లు, ప్రాజెక్టులను వాటిని వీడియోగా క్రియేట్ చేసుకుని మరికొందరు యూజర్లతో షేర్ చేసుకోవచ్చు. ప్రస్తుతం అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా దేశాల్లో మాత్రమే దీన్ని విడుదల చేసింది ఫేస్‌బుక్. త్వరలో ఇండియాలో కూడా అందుబాటులోకి వస్తుంది.

## సాధారణ బడ్జెట్‌లో

ప్రముఖ మొబైల్ కంపెనీ హువావే తన వినియోగదారుల కోసం సాధారణ బడ్జెట్ ఫోన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆకట్టుకునే ఫీచర్లతో ఇవి వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. హువావే ఎంజాయ్ 10ఈ పేరుతో కొనుగోలు చేసుకోవచ్చు.



**ఎంజాయ్ 10ఈ ఫీచర్లు**

| | |
|---|---|
| **డిస్‌ప్లే** | : 6.3 అంగుళాలు |
| **రిజల్యూషన్** | : 600 x 720 పిక్సెల్స్ |
| **ప్రాసెసర్** | : ఆక్టాకోర్ మీడియాటెక్ హీలియో పీ35 |
| **ఓఎస్** | : ఆండ్రాయిడ్ 10 |
| **స్టోరేజీ** | : 64/128 జీబీ స్టోరేజ్ |
| **ర్యామ్** | : 4జీబీ |
| **కెమెరా** | : 13+2 ఎంపీ |
| **ఫ్రంట్ కెమెరా** | : 8 ఎంపీ |
| **బ్యాటరీ** | : 5000 ఎంఏహెచ్ |
| **ధరలు** | : 3జీబీ ర్యామ్ /64 జీబీ ధర సుమారు రూ.10,309<br>4జీబీర్యామ్/128 జీబీ స్టోరేజ్ ధర సుమారు రూ.12,375 |

## ఆకట్టుకుంటున్న స్మార్ట్ వాచ్



41mm వెర్షన్ వాచ్ ధర రూ.16,000

46mm వాచ్ ధర రూ.21,400

**ఒప్పో** కొత్త స్మార్ట్‌వాచ్ ఆకట్టుకుంటున్నది. ఇటీవల చైనాలో 'Find X2' లాంచ్ ఈవెంట్లోనే ఆ కంపెనీ దీన్ని విడుదల చేసింది. ఒప్పో బ్రాండ్ నుంచి మొట్టమొదటిసారిగా స్మార్ట్‌వాచ్ మార్కెట్లోకి వచ్చింది. స్యామ్‌సంగ్ గెలాక్సీ వాచ్ యాక్టివ్ 2 గాడ్జెట్‌కు పోటీగా ఒప్పో ఈ స్మార్ట్‌వాచ్ ఇప్పుడు ఆకర్షిస్తున్నది. ఇది చూడటానికి అచ్చం Apple Watch Series 4 మాదిరిగానే కనిపిస్తోంది. ఫీచర్లలో అమోలెడ్ డిస్‌ప్లే, VOOC చార్జింగ్ టెక్నాలజీ, ECG సెన్సార్ బోర్డు ఉంది. ఒకసారి చార్జ్ చేస్తే సాధారణ వాడకంపై 40 గంటల బ్యాటరీ లైఫ్ కలిగి ఉంది. బ్యాటరీ సేవింగ్ మోడ్ ద్వారా 21 రోజుల వరకు బ్యాటరీ చార్జింగ్ వస్తుంది.




అక్షరాలు పేర్చి.. పదాలుగా మార్చి.. పేరాలుగా మలిచి లెక్కలేని భావాల్ని ఒక్కచోట చేరుస్తుంటారు. కథ, కవిత, నవల పేరేదైనా ఆ అక్షరాలు వేల ఏండ్ల చరిత్రను సజీవంగా ఉంచుతాయి. అవే అక్షరాల్ని బొమ్మలుగా మలిచి.. వివిధ ఆకృతుల్లోకి వస్తువుల్లోకి మార్చితే? కొత్త వెలుగై ఉదయించదా?.. అలాంటి ప్రయత్నమే చేస్తున్నాడీ యువకుడు.

# అక్షరాలకు నవ'కాంతి'





**అది వనపర్తి జిల్లా** ఆత్మకూరు. పాఠశాల ప్రారంభమై రెండ్రోజులైంది. అందరూ నోట్‌బుక్‌లు కొన్నారు. అదే రోజు కొత్త పుస్తకాలు ఇచ్చారు. ఫస్ట్‌బెల్ మోగడానికి ఇంకా పదినిమిషాలుంది. అప్పటికే కొందరు విద్యార్థులు తరగతి గదికి చేరుకున్నారు. ఓ విద్యార్థి చుట్టూ గుమిగూడారు. నాది.. నాది అంటూ ఒక్కొక్కరూ పుస్తకాల్ని ఓ విద్యార్థికి ఇస్తున్నారు. ఆ అబ్బాయి ఒక్కొక్కరి పుస్తకాల్ని తీసుకొని వాటిపై పేర్లు రాసి ఇచ్చేస్తున్నాడు. ఇలా రెండ్రోజుల్లో సమయం ఉన్నప్పుడల్లా స్కూల్లోని చాలామందికి నోట్‌బుక్‌లు, పుస్తకాలపై పేర్లు రాసిచ్చాడు. ఆ విద్యార్థి ఒక్కరికి రాసిన స్టైల్‌లో మరొకరికి రాసిచ్చేవాడు కాదు. అతడే కరిడె నవకాంత్. అతడికున్న కళను క్యాలిగ్రఫీ అంటారని అతడికి తెలియడానికి చాలా ఏండ్లు పట్టింది.

**క్యాలీగ్రఫీ అంటే?**

అక్షరాలను అందంగా రాసే కళను క్యాలిగ్రఫీ అంటారు. ఇందులో రాణించేవారిని క్యాలిగ్రాఫర్స్ అంటారు. భాష ఏదైనా భావం ఉట్టిపడేలా అక్షరాలను వివిధ ఆకృతుల్లో రాయడం క్యాలిగ్రఫీ ప్రత్యేకత. రెండు తెలుగు రాష్ర్టాల్లో ఈ కళలో రాణించేవారు అరుదు. ప్రింటింగ్ ప్రెస్ ఏర్పడటానికి ముందు ఈ కళకు ఆదరణ ఉండేది. అప్పుడు పుస్తకాల్ని చేత్తో రాసేవారు. అందమైన దస్తూరీ కోసం క్యాలిగ్రాఫర్‌ను ఎంచుకునేవారు. క్యాలిగ్రఫీ అనే పదానికి అందమైన రచన అనే అర్థం ఉంది. కొన్నాళ్లకు ప్రింటింగ్ ప్రెస్‌లు, కంప్యూటర్లు రావడంతో క్యాలిగ్రఫీ కళకు ఆదరణ తగ్గింది. కానీ ప్రస్తుతం ఈ కళ రూపాంతరం చెందింది. క్యాలిగ్రాఫర్స్ అక్షరాలతో బొమ్మలు వేస్తున్నారు. వివిధ కళాకృతుల్లో అక్షరాల్ని ఇనుమడింపజేస్తున్నారు.

**అవకాశాలు ఇలా?**

ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో క్యాలిగ్రఫీ ఓ సబ్జెక్టు. ఇందులో అక్షరాలను అందంగా రాయడమెలా? ఎన్ని రకాలుగా రాయొచ్చు? చరిత్ర వివరాలుంటాయి. క్యాలిగ్రఫీపై సాధన తదితర అంశాలుంటాయి. ఇందులో పట్టు సాధిస్తే సినిమాల్లో అవకాశాలు అనేకం. సినిమాలు, సీరియళ్ల టైటిళ్లను విభిన్నంగా రాస్తూ ఉపాధి పొందవచ్చు. కవులు, రచయితలు ప్రచురించే పుస్తకాలకు శీర్షికలు విభిన్నంగా రాస్తూ ఉపాధి పొందవచ్చు.

**రెండు రాష్ర్టాల్లో ఒకే ఒక్కడు!**

రెండు తెలుగు రాష్ర్టాల్లో క్యాలిగ్రఫీలో రాణిస్తున్న ఒకే ఒక్కడు నవకాంత్. చాలామందికి క్యాలిగ్రఫీ అనే కళ ఒకటి ఉందని కూడా తెలియదు. నవకాంత్‌కు కూడా కొన్నేండ్ల క్రితం క్యాలిగ్రఫీ గురించి తెలియదు. ఓ ఆదివారం అబిడ్స్ మార్కెట్లో పాత పుస్తకాల్ని కొనేందుకు వెళ్లాడు. ఒక పుస్తకం అట్టపై విభిన్న అక్షరాలు రాసి ఉండటం గమనించాడు. దానిపై క్యాలిగ్రఫీ అని రాసుంది. దాని రచయిత అచ్యుత్ పాలవ్. ఆ పుస్తకాన్ని తిరగేస్తే తన కళను తాను పునఃశ్చరణ చేసుకున్నట్లు అనిపించిందతడికి. అందులో ఉన్న విభిన్న అక్షరాలు, అతడు రాసిన అక్షరాలు ఒకే మాదిరిగా ఉన్నాయి. 'అప్పుడతడికి అర్థమైంది తెలియకుండానే ఓ కళలో రాణిస్తున్నా' అని.

**రచయిత కోసం ముంబాయికి..**

బీటెక్ పూర్తి చేసిన నవకాంత్ అబిడ్స్‌లో చూసిన క్యాలిగ్రఫీ పుస్తకాన్ని మర్చిపోలేకపోయాడు. ఆ పుస్తక రచయిత అడ్రస్ తెలుసుకొని ముంబాయి చేరుకున్నాడు. 'మార్కెట్లో పుస్తకం చూసి ఇంత దూరం వచ్చాను' అని నవకాంత్ చెబితే అచ్యుత్‌పాలవ్ నమ్మలేదు. కానీ ఆ తర్వాత నవకాంత్ క్యాలిగ్రఫీ చూశాక వారం రోజులు తన ఇంట్లోనే ఉండమన్నారు. క్యాలిగ్రఫీలో మరిన్ని మెళకువలు నేర్పించారు. కళ ఆధునీకీకరణ, విభిన్న కోణాల్లో, విభిన్న కళాకృతుల్లో కళను జోడించడం వంటి విషయాలు నేర్పించారు.

**కళను జోడించి..**

కెటిల్, రోలుబండ, రొట్టెపీట, పిల్లనగ్రోవి, కప్పులు, సాసర్లు, గిన్నెలు ఇలా ఎన్నింటిపైనో క్యాలిగ్రఫీని అమర్చే పనిలో పడ్డాడు నవకాంత్. ఇంట్లో ఏ వస్తువు కనబడ్డా దానిపై తన కళను పొందుపర్చే పనిలో పడతాడు. ఆయన ఇంటి గోడల నిండా విభిన్న డిజైన్లలో క్యాలిగ్రఫీ ఆర్ట్ కనిపిస్తుంది. గతేడాది ముంబాయి, సౌత్ కొరియాలో నవకాంత్ క్యాలిగ్రఫీ ఆర్ట్స్‌ను ప్రదర్శించారు. ఇటీవల నెదర్లాండ్స్‌లోని ఓ ప్రభుత్వ మ్యూజియంలో సైతం ప్రదర్శించారు.

**ప్రోత్సాహం కల్పించాలె..**




తెలిసో తెలియకో ఈ కళకు చిన్నప్పుడే దగ్గరయ్యాను. ఓ ప్రయివేటు స్కూల్లో ఆర్ట్ టీచర్‌గా పని చేస్తున్నా. పిల్లలకు క్యాలిగ్రఫీలో శిక్షణ ఇస్తున్నా. తెలంగాణ ప్రభుత్వం క్యాలిగ్రఫీ కళను, కళాకారులను ప్రోత్సహించాలె. ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ఉచితంగా క్యాలిగ్రఫీ నేర్పించాలనే ఆలోచనలో ఉన్నా. పెద్ద పెద్ద ఈవెంట్లు, ప్రదర్శనలు జరిగే సమయంలో నా కళను ప్రదర్శించేందుకు (స్టాల్ పెట్టుకునేందుకు) అధికారులు అవకాశం కల్పించాలె.

– కరిడె నవకాంత్, క్యాలిగ్రాఫర్, మహబూబ్‌నగర్

... పడమటింటి రవికుమార్

సీఎం ప్రవీణ్‌కుమార్

### మంచిమాట



జీవితమంటే అనుభవం. గొప్ప అనుభవాలవైపు ప్రయాణించడమే జీవిత లక్ష్యం. అనుభవాలని గొప్పగా గాఢంగా తీసుకోగలగడం అనేది మన హృదయపు సున్నితత్వం, స్వేచ్ఛ నిజాయితీ మీద ఆధారపడి ఉంటుంది.

- గుడిపాటి వెంకటాచలం

### నవ్వుకొందాం




### ఏం డైలాగ్ గురూ..



నీ బ్రెయిన్‌ను గన్‌లా వాడు. అప్పుడే నీ ఆలోచనలు బుల్లెట్‌లా దూసుకొస్తాయి.

సినిమా: రాజా చెయ్యి వేస్తే

### వాట్సప్ మెసేజ్



ఒకరిని మీరు ఎంత బాధ పెట్టినా అన్నీ మరిచిపోయి మళ్లీ మీ దగ్గరికి వస్తున్నారు అంటే.. వాళ్లకు మీరు తప్ప ఎవరూ దొరకరు అని కాదు అర్థం. ఎవరికీ ఇవ్వలేని స్థానాన్ని వాళ్ల మనసులో మీకు ఇచ్చారు అని అర్థం.

## ఉద్యోగం మారినందుకు జరిమానా



ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ.. మరో పెద్ద కంపెనీలో జాబ్ ఆఫర్ వస్తే ఎవరైనా ఏం చేస్తారు. ఆనందంగా వెళ్లి జాయిన్ అవుతారు. అతడూ అలాగే చేశాడు. కానీ అతడి ఆనందం ఒక్కరోజులో ఆవిరైంది. నిబంధనల ప్రకారం గడువు ముగియకుండానే ఉద్యోగాన్ని వదిలినందుకు గూగుల్ కంపెనీ కోట్లల్లో జరిమానా విధించింది.

**ఓ** సంస్థలో పనిచేసే ఉద్యోగికి అంతకంటే ఎక్కువ జీతంతో మరో కంపెనీ ఉద్యోగం ఇస్తానంటే ఏమాత్రం వెనకాడకుండా అందులో చేరిపోతాడు. కాలిఫోర్నియాకు చెందిన ఈ యువ ఇంజినీర్ కూడా అదే పని చేశాడు. ఆంటోనీ లావన్డోస్కీ అనే యువకుడు గూగుల్ సంస్థలో ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. అతడికి ఉబర్ సంస్థ ఎక్కువ జీతం ఇస్తానంటూ ఆఫర్ ఇచ్చింది. అందుకోసం గూగుల్ సంస్థలో ఉద్యోగాన్ని వదిలి ఉబర్‌లో చేరాడు. ఈ క్రమంలోనే ఆంటోనీ గూగుల్ సంస్థలో చేరే సమయంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి మరొక కంపెనీలో చేరాడు. తమ కంపెనీలో చేరే సమయంలో ఆంటోనీ గూగుల్ విధించిన నిబంధనలను అంగీకరించి ఉద్యోగంలో చేరాడు. ఉబర్ నుంచి ఆఫర్ రావడంతో నిబంధనలకు నీళ్లు వదిలాడు. దీనిని తీవ్రంగా పరిగణించిన గూగుల్ ఆంటోనీకి 179 మిలియన్ డాలర్ల( రూ.1300 కోట్లకుపైగా) జరిమానా విధించింది. గతంలో ఆంటోనీకి ఇచ్చిన బోనస్‌తో సహా తిరిగి చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

## యువతకు కావాల్సినవి ఇవే



భవిష్యత్‌ను మార్చగలిగే శక్తి యువతలో ఉన్నది. ఏ రంగమైనా వీరిదే పై చేయి. అలాంటి యువత లక్ష్యాలు ఎలా ఉంటాయి? ఎంతమంది ఎటువైపు ప్రయాణించాలనుకుంటున్నారు? చదువు, డబ్బు సంపాదనలో దేనికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే అంశాలపై'ద కనెక్టెడ్ జనరేషన్', 'వరల్డ్ విజన్ సంస్థలు సంయుక్తంగా అధ్యయనం చేశాయి.

**ఒక్కొక్కరికీ** ఒక్కో లక్ష్యం ఉంటుంది. కొంతమంది విదేశాల్లో ఉద్యోగం చేయాలనే కలలుకంటారు. మరికొందరు అందమైన ఇల్లు కట్టుకోవాలనుకుంటారు. ఇలా.. నేటితరానికి ఏమేం కావాలి? వారి ఆసక్తులు, లక్ష్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలనుకున్నాయి 'ద కనెక్టెడ్ జనరేషన్, వరల్డ్ విజన్' సంస్థలు. భారత్, జపాన్, ఆస్ట్రేలియా వంటి 25 దేశాలకు చెందిన 15,369 మందిపై సర్వే నిర్వహించాయి. చదువు, ఉద్యోగంతో పాటు తమ బాధ్యతలు, లక్ష్యాలను గురించి తొమ్మిది భాషల్లో వారి అభిప్రాయాలను సేకరించాయి. ఇందులో పాల్గొన్నవారిలో అత్యధికంగా 48% మంది చదువుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. 46 శాతం మంది తల్లిదండ్రులపై ఆధారపడకుండా ఉండేందుకు ఆర్థిక స్వతంత్ర్యాన్ని కోరుకుంటున్నారు. ఉన్నత చదువులు చదివిన వారిలో 43% మంది ఉద్యోగం కోసం ఇతర దేశాలకు వెళ్లాలనుకుంటున్నారు. ఎలాంటి ఉద్యోగంతో పని లేకుండా సొంతంగా వ్యాపారం చేయాలనుకునేవారు 41% మంది ఉన్నారు. 40% మంది ఆధ్యాత్మికంగా పరిణతి పొందాలనుకుంటున్నట్లు తేలింది. 25% మంది పెండ్లి చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. 25% మంది పేదలకు సాయం అందించాలనుకుంటున్నారు. 21 శాతంమంది మాత్రం తమ సొంతింటి కలను నెరవేర్చుకోవాలనుకుంటున్నారు.

# నిపుణ

## — విద్య ఉద్యోగ సమాచారం —

నవరత్న కంపెనీ ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌లో గ్రాడ్యుయేట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

### షార్‌లో

**శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం పోస్టులు:** 12
- **పోస్టులవారీగా ఖాళీలు:** నర్స్ బీ–2, ల్యాబ్ టెక్నీషియన్ ఏ –3, ఫైర్‌మ్యాన్ ఏ– 7 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** నర్స్ పోస్టుకు పదోతరగతితోపాటు ప్రథమశ్రేణిలో మూడేండ్ల నర్సింగ్ డిప్లొమా. ల్యాబ్ టెక్నీషియన్‌కు పదోతరగతితోపాటు మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీలో రెండేండ్ల డిప్లొమా. ఫైర్‌మ్యాన్ పోస్టులకు పదోతరగతిపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి.
- **వయస్సు:** మార్చి 27 నాటికి 18–35 ఏండ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో ▪ **చివరితేదీ:** మార్చి 27
- **వెబ్‌సైట్:** https://www.shar.gov.in

### బామర్ లారీలో

**భారత ప్రభుత్వ సంస్థ బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టుల వారీగా ఖాళీలు:** చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్–1, అసిస్టెంట్ మేనేజర్ (ఐటీ)–2, హెడ్ (మార్కెటింగ్)–1, హెడ్ (సేల్స్)–1, అసిస్టెంట్ మేనేజర్ (సేల్స్)–1 ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 6
- **వెబ్‌సైట్:** http://www.balmerlawrie.com

### ఎన్‌ఎల్‌సీలో 274 ఖాళీలు




- **పోస్టు:** గ్రాడ్యుయేట్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ/అసిస్టెంట్ మేనేజర్
- **మొత్తం ఖాళీలు:** 274
- **పోస్టులవారీగా ఖాళీలు:** గ్రాడ్యుయేట్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (మెకానికల్–125, ఈఈఈ–65, ఈసీఈ–10, సివిల్–5, కంట్రోల్&ఇన్‌స్ట్రుమెంటేషన్–15, కంప్యూటర్–5, మైనింగ్–5, జియాలజీ–5, ఫైనాన్స్–14, హ్యూమన్ రిసోర్స్–10)– 259 ఉన్నాయి. అసిస్టెంట్ మేనేజర్ (సర్వే)–15 ఖాళీలు.
- **పేస్కేల్:** గ్రాడ్యుయేట్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలకు రూ.50,000–1,60,000/–, అసిస్టెంట్ మేనేజర్–రూ.40,000–1,40,000/–
- అర్హతలు, వయస్సు, ఎంపిక, దరఖాస్తు ఫీజు, ఎంపిక విధానం వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్:** https://www.nlcindia.com

### పవర్‌గ్రిడ్‌లో

**పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (ఫైనాన్స్)–2020
- **మొత్తం ఖాళీలు:** 26. వీటిలో జనరల్–10, ఓబీసీ (ఎన్‌సీఎల్)–7, ఎస్సీ–4, ఎస్టీ–2, ఈడబ్ల్యూఎస్–2, పీహెచ్‌సీ (వీహెచ్)–1 ఉన్నాయి.
- **అర్హతలు:** సీఏ, సీఎంఏ
- పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 6
- **వెబ్‌సైట్:** www.powergridindia.com

### టీఎస్‌ఆర్‌జేసీ సెట్- 2020

**రాష్ట్రంలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్‌ఆర్జేసీ సెట్ ప్రకటన విడుదలైంది.**

- **పరీక్ష పేరు:** టీఎస్‌ఆర్జేసీ సెట్ – 2020
- **ప్రవేశం:** ఇంటర్ ఫస్ట్ ఇయర్
- **గ్రూపులు:** ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ
- **బోధనా మాధ్యమం:** ఇంగ్లిష్
- **ప్రవేశాలు కల్పించనున్న జూనియర్ కళాశాలల సంఖ్య:** 35
- **అర్హతలు:** మార్చి–2020లో పదోతరగతి పరీక్షకు హాజరవుతున్న రాష్ట్రంలోని 33 జిల్లాల విద్యార్థులు అర్హులు.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ద్వారా
- **ప్రవేశ పరీక్షతేదీ:** మే 10
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో మార్చి 16 నుంచి ప్రారంభం
- **దరఖాస్తు ఫీజు:** రూ.200/–
- **చివరితేదీ:** ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** https://tsrjdc.cgg.gov.in



మహిళల వన్డే ప్రపంచకప్‌లో

## రిజర్వ్‌డేలు

**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్ వేదికగా వచ్చే ఏడాది జరిగే మహిళల వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ బుధవారం విడుదలైంది. ఫిబ్రవరి 6న మొదలయ్యే మెగాటోర్నీ మార్చి 7న ముగియనుంది. మొత్తం ఆరు వేదికలు ఈడెన్‌పార్క్, బే ఓవల్, సెడాన్, యూనివర్సిటీ ఓవల్, బేసిన్ రిజర్వ్, హాగ్లె ఓవల్ ప్రపంచకప్ టోర్నీకి ఆతిథ్యమివ్వనున్నాయి. ఇదిలా ఉంటే వన్డే ప్రపంచకప్‌లో సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్‌డే ఉండేలా ఐసీసీ షెడ్యూల్‌ను రూపొందించింది. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో వర్షం కారణంగా సెమీస్‌లో ఇంగ్లండ్ నిష్క్రమించడం, భారత్ ఫైనల్‌కు వెళ్లడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ప్రపంచకప్ లాంటి పెద్ద టోర్నీల్లో నాకౌట్ మ్యాచ్‌లకు రిజర్వ్‌డే లేకపోవడంపై పలువురు ఐసీసీని తప్పుబట్టారు.

## బయటి తిండి వద్దు..

**న్యూఢిల్లీ:** ప్రమాదకర కరోనా వైరస్ గుబులు పుట్టిస్తూనే ఉంది. వైరస్ అంతకంతకు విస్తరిస్తున్న కారణంగా బీసీసీఐ ముందస్తు చర్యలకు సిద్ధమైంది. పరిశుభ్రత లేని హోటల్స్, రెస్టారెంట్లలో తినవద్దంటూ టీమ్‌ఇండియా క్రికెటర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దీనికి తోడు అభిమానులతో కలిసి సెల్ఫీలు దిగడం మానేయాలని సూచించింది. ముంబైలో జరిగే ఈ సీజన్ ఐపీఎల్ మ్యాచ్‌లు వాయిదా పడటమో లేదా ప్రేక్షకులు లేకుండా నిర్వహించడమో జరుగుతుందని, గురువారం తుది నిర్ణయం తీసుకుంటామని మహారాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి రాజేశ్ తోపే చెప్పారు. కాగా, కరోనా వైరస్ విస్తరిస్తున్నందువల్ల ఐపీఎల్ నిర్వహించవద్దంటూ మద్రాస్ హైకోర్టులో బుధవారం అలెక్స్ బెంజిగర్ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు వైరస్‌తో ఇండియన్ గోల్ఫ్ టోర్నీ వాయిదా పడింది. ఇండియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రేక్షకులు లేకుండా ఖాళీ స్టేడియంలో జరిపేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. వైరస్‌ను దృష్టిలో పెట్టుకుని బెంగళూరులోని సాయ్ దక్షిణాది కేంద్రాన్ని మూసివేశారు.

## అద్వానీ @ 34

**అహ్మదాబాద్:** భారత స్టార్ క్యూయిస్టు పంకజ్ అద్వానీ ఓవరాల్‌గా తన కెరీర్‌లో 34వ జాతీయ టైటిల్‌ను దక్కించుకున్నాడు. బుధవారం జరిగిన జాతీయ సిక్స్ రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్ ఫైనల్లో అద్వానీ 7-3తో ఇష్ప్రీత్ సింగ్‌పై విజయం సాధించాడు. మహిళల ఫైనల్లో అమీ కమానీ 4-2తో విద్యా పిళ్లేపై గెలిచి విజేతగా నిలిచింది.

# పుంజుకునేనా..

ధర్మశాలలో దక్షిణాఫ్రికాతో భారత్ తొలి వన్డే నేడు.. సత్తాచాటేందుకు కోహ్లీసేన ఆరాటం .. మ్యాచ్‌కు వరుణుడి గండం



133 వన్డేల్లో 12వేల పరుగుల మైలురాయికి కోహ్లీ 133 పరుగుల దూరంలో ఉన్నాడు.

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



డికాక్

**సొంతగడ్డపై సఫారీలతో సమరానికి భారత్ సిద్ధమైంది. న్యూజిలాండ్ పర్యటనలో ఎదురైన పరాభవాల నుంచి తేరుకొని పుంజుకోవాలన్న పట్టుదలతో కోహ్లీసేన కనిపిస్తున్నది. గాయాల నుంచి కోలుకున్న ధవన్, హార్దిక్, భువీ రావడంతో టీమ్‌ఇండియా పటిష్ఠంగా మారింది. ఆస్ట్రేలియాను చిత్తుచేసిన ఊపులో దక్షిణాఫ్రికా ఉంది. ఈ నేపథ్యంలో హిమాలయ పర్వత సానువుల్లోని ధర్మశాలలో జరిగే తొలి వన్డే పోరు రసవత్తరంగా సాగే అవకాశం కనిపిస్తున్నది. మ్యాచ్‌కు వరుణుడి గండం ఉండగా, కరోనా వైరస్ వల్ల ప్రేక్షకుల సంఖ్య తగ్గే చాన్స్ కనిపిస్తున్నది.**

**ధర్మశాల:** న్యూజిలాండ్ పర్యటనలో వరుసగా రెండు సిరీస్‌ల్లో(వన్డే, టెస్టులు) క్లీన్‌స్వీప్‌నకు గురైన టీమ్‌ఇండియా స్వదేశంలో దక్షిణాఫ్రికాను ఢీకొనేందుకు సిద్ధమైంది. కివీస్ చేతిలో ఎదురైన పరాభవాలను మరిచిపోయేలా సత్తాచాటాలని ఆశిస్తున్నది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా గురువారం ఇక్కడి హెచ్‌పీసీఏ మైదానంలో భారత్ – దక్షిణాఫ్రికా మధ్య తొలి వన్డే జరుగనుంది. మంచు కొండల మధ్య, ఆహ్లాదకరమైన ధర్మశాల వాతావరణంలో జరిగే మ్యాచ్‌ను కైవసం చేసుకొని ఉల్లాసంగా మళ్లీ విజయాల బాట పట్టాలని కోహ్లీసేన భావిస్తున్నది. గాయాల నుంచి కోలుకున్న ఓపెనర్ శిఖర్ ధవన్, హార్దిక్ పాండ్య, భువనేశ్వర్ పునరాగమనంతో టీమ్‌ఇండియా పటిష్ఠంగా మారింది. మరోవైపు ఇటీవల ఆస్ట్రేలియాతో సిరీస్‌ను 3–0తో గెలిచిన దక్షిణాఫ్రికా నూతనోత్తేజంతో తొణికిసలాడుతున్నది. ఈ మ్యాచ్‌పై వర్షం తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. భారీ వర్షసూచన ఉండడం ఆందోళన కలిగిస్తున్నది. కరోనా వైరస్ ఆందోళనతో ప్రేక్షకుల హాజరు కూడా అంతంత మాత్రంగానే ఉండే అవకాశం ఉంది.

### పెరిగిన జట్టుసమతూకం

వన్డేల్లో దాదాపు ఎనిమిది నెలల తర్వాత పాండ్య అడుగుపెట్టనున్నాడు. గతేడాది జులైలో జరిగిన ప్రపంచకప్ సెమీస్‌లో పాండ్య తన చివరి వన్డే ఆడాడు. సెప్టెంబర్‌లో సఫారీలతో ఆడిన టీ20యే అతడికి చివరి అంతర్జాతీయ మ్యాచ్. ఇటీవల డీవై పాటిల్ టీ20కప్‌లో మెరుపులు మెరిపించిన హార్దిక్ మంచిఫామ్‌లో ఉన్నాడు. రోహిత్ శర్మ విశ్రాంతిలో ఉండడంతో ధవన్‌తో పాటు యువ ఆటగాడు పృథ్వీ షా ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. కాగా, న్యూజిలాండ్ పర్యటనలో ఘోరం గా విఫలమైన కెప్టెన్ కోహ్లీ దక్షిణాఫ్రికాతో వన్డేల్లో దుమ్మరేపి ఫామ్‌ను పుణికిపుచ్చుకోవాలని పట్టుదలగా ఉన్నాడు. కేఎల్ రాహులే కీపింగ్ బాధ్యతలను నిర్వర్తించనుండగా.. కేదార్ జాదవ్ ఉద్వాసనకు గురవ్వడంతో మనీశ్ పాండే ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉంది. బౌలింగ్ దళాన్ని భువనేశ్వర్, బుమ్రా ముందుకు నడిపించనున్నారు. ధర్మశాల పిచ్ పేస్‌కు అనూలించనుండడంతో తుది జట్టులో స్పిన్నర్‌గా జడేజా ఒక్కడికే చోటు దక్కే అవకాశం ఉంది.

### ఆత్మవిశ్వాసంతో సఫారీలు

సొంతగడ్డపై ఆస్ట్రేలియాను 3–0తో క్లీన్‌స్వీప్ చేసి దక్షిణాఫ్రికా ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతున్నది. భారత్ అంటేనే రెచ్చిపోయి ఆడే సఫారీ కెప్టెన్ డికాక్ మరోసారి సత్తాచాటాలని చూస్తున్నాడు. కెప్టెన్సీ వదిలేశాక సరిగా రాణించలేకపోతున్న డుప్లెసిస్ గాడిలో పడాలని ఆశిస్తున్నాడు. యువకులతో కూడిన సఫారీ బౌలింగ్ భారత పరిస్థితుల్లో ఏ మేరకు రాణిస్తుందో చూడాలి.

### వాతావరణం, పిచ్

మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశాలు అధికం. గతేడాది సెప్టెంబర్‌లో ధర్మశాలలో భారత్ – దక్షిణాఫ్రికా మధ్య జరగాల్సిన తొలి టీ20 వాన కారణంగానే రద్దయిన విషయం తెలిసిందే. ధర్మశాల పిచ్ పేస్‌కు అనుకూలించనుంది.

## వర్షం వద్దని పూజలు

ఈ వన్డేకు వర్షం ఆటంకం కలిగించకుండా చూడాలని అక్కడి ఇంద్రునాగ్ ఆలయంలో హెచ్‌పీసీఏ అధికారులు గత వారం పూజలు నిర్వహించారట. ఈ విషయాన్ని హెచ్‌పీసీఏ కార్యదర్శి ధ్రువీకరించారు. కొండమీద ఉన్న ఆలయంలో పూజలు చేస్తే కోరికలు నెరవేరుతాయని అక్కడి స్థానికుల విశ్వాసం. ఈ నేపథ్యంలో వరుణుడిని శాంతింపజేయాలని హెచ్‌పీసీఏ అధికారులు నాగదేవుడిని కోరుకున్నారు. మరి వారి పూజలు ఫలిస్తాయేమో చూడాలి.

## టికెట్లపై కరోనా ఎఫెక్ట్

తొలి వన్డేపై కరోనా వైరస్ ప్రభావం పడింది. ధర్మశాల వన్డే కోసం 22వేల టికెట్లను హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘం(హెచ్‌పీసీఏ) అమ్మకానికి ఉంచగా మంగళవారం వరకు 16వేలు మాత్రమే అమ్ముడుపోయాయి. కరోనా వైరస్ వ్యాప్తి ఆందోళనలు ఉండడమే ఇందుకు కారణంగా భావిస్తున్నామని సంఘం ప్రతినిధులు చెప్పారు. అయితే అభిమానులు ఆసక్తి చూపకపోవడానికి వర్ష సూచన మరో కారణం. మొత్తానికి తొలి వన్డేలో ఖాళీ కుర్చీలు దర్శనమివ్వడం ఖాయంగా కనిపిస్తున్నది.





# సింధు శుభారంభం

**తొలి రౌండ్లోనే శ్రీకాంత్ నిష్క్రమణ.. ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్**

**బర్మింగ్‌హామ్:** ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఆరో సీడ్ సింధు 21–14, 21–17తేడాతో బివాన్ జెంగ్(అమెరికా)ను వరుస గేమ్‌ల్లో చిత్తుచేసింది. 42నిమిషాల పాటు మ్యాచ్ జరుగగా.. తొలి గేమ్‌లో కాసేపు హోరాహోరీ పోరు సాగింది. 8–9తో వెనుకబడిన సమయంలో ఒక్కసారిగా పుంజుకున్న సింధు వరుసగా ఐదుపాయింట్లు సాధించి దూకుడు కనబరిచింది. అదే ఆధిపత్యంతో గేమ్ సొంతం చేసుకుంది. రెండో గేమ్ సైతం ఉత్కంఠ భరితంగా సాగింది. జెంగ్ దూకుడుగా ఆడడంతో ఓ దశలో పాయింట్లు 16–16తో సమమయ్యాయి. ఆ తరుణంలో వరుస పాయింట్లతో దుమ్ములేపిన తెలుగమ్మాయి విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో కిడాంబి శ్రీకాంత్ 15–21, 16–21తేడాతో చెన్ లాంగ్(చైనా)చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. దీంతో ఒలింపిక్స్ అవకాశాలు మరింత సంక్లిష్టమయ్యాయి. మిక్స్‌డ్ డబుల్స్ పోటీలో సిక్కిరెడ్డి – ప్రణవ్‌చోప్రా జోడీ 13–21, 21–11, 17–21తేడాతో టాప్ సీడ్ చైనా ద్వయం షీ వీజెంగ్, క్వింగ్ హువాంగ్ చేతిలో పోరాడి ఓడింది. మహిళల డబుల్స్‌లో గాయం కారణంగా ప్రత్యర్థి ద్వయం తప్పుకోవడంతో సిక్కిరెడ్డి, అశ్వినీ జోడీ ప్రి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది.

## భారత్‌కు తొమ్మిది బెర్తులు



**అమన్(జోర్డాన్):** ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత, భారత బాక్సర్ మనీశ్ కౌశిక్(63కేజీలు) టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ క్వార్టర్స్‌లో ఓడినా బాక్సాఫ్‌లో సత్తాచాటి... విశ్వక్రీడలకు క్వాలిఫై అయిన భారత తొమ్మిదో బాక్సర్‌గా నిలిచాడు. బుధవారం జరిగిన టోర్నీ బాక్సాఫ్ పోటీలో కౌశిక్ 4–1తేడాతో హారిసన్ గరాసైడ్(ఆస్ట్రేలియా)ను చిత్తుచేశాడు. కంటి గాయం కారణంగా పురుషుల విభాగం తుదిపోరు నుంచి తప్పుకున్న వికాస్ కృష్ణన్(69కేజీలు) రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. మహిళల విభాగం ఫైనల్లో భారత బాక్సర్ సిమ్రన్‌జీత్ కౌర్(60కేజీలు) 0–5తేడాతో యివోన్జీ ఓహ్(దక్షిణకొరియా)చేతిలో పరాజయం పాలై, రజతం దక్కించుకుంది.

**రికార్డు ఇదే:** ఒలింపిక్స్‌కు భారత్ తరఫున 9మంది బాక్సర్లు అర్హత సాధించడం ఇదే తొలిసారి. లండన్(2012)కు 8మంది క్వాలిఫై కావడమే ఇప్పటి వరకు అత్యుత్తమం.



బుధవారం గ్రీస్‌లోని పురాతన ఒలింపియాలో జరిగిన టోక్యో ఒలింపిక్స్ జ్యోతి ప్రజ్వలన సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్న గ్రీక్ హీరోయిన్ జార్జియో

## జాతీయ క్రీడల్లో అటవీశాఖకు 16 పతకాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భువనేశ్వర్‌లో జరిగిన 25వ జాతీయస్థాయి అటవీ క్రీడా పోటీల్లో తెలంగాణ అటవీశాఖ ఉద్యోగులు 16 పతకాలతో ఆకట్టుకున్నారు. రాష్ట్రం నుంచి మొత్తం 285 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ క్రీడాంశాల్లో స్వర్ణం సహా 9 రజతాలు, 6 కాంస్యాలు గెలుచుకున్నారు. విజేతలను అటవీ సంరక్షణ ప్రధానాధికారి ఆర్ శోభ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు పీసీసీఎఫ్‌లు లోకేశ్ జైస్వాల్, పర్గెయిన్, దోబ్రియాల్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## సౌరాష్ట్రదే పైచేయి

**రాజ్‌కోట్:** బెంగాల్ బ్యాట్స్‌మెన్ సుదీప్ ఛటర్జీ(145 బంతుల్లో 47నాటౌట్), మనోజ్ తివారి(116 బంతుల్లో 35) పోరాడినా రంజీ ఫైనల్లో సౌరాష్ట్ర పైచేయి సాధించింది. బుధవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 134/3 స్కోరు చేసింది. సుదీప్‌తో పాటు సీనియర్ సాహా(4నాటౌట్) క్రీజులో ఉన్నారు. లంచ్ విరామ సమయానికి 35పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన తరుణంలో సుదీప్, మనోజ్ తివారి జాగ్రత్తగా ఆడారు. ఏకంగా 226బంతులను ఎదుర్కొని 89పరుగులు జతచేశారు. అంతకు ముందు 8వికెట్లకు 384పరుగుల తొలి ఇన్నింగ్స్ ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఆటకు దిగిన సౌరాష్ట్ర గంటా 10 నిమిషాల పాటు బ్యాటింగ్ చేసి 425పరుగులకు ఆలౌటైంది. బెంగాల్ బౌలర్లలో అక్షదీప్‌కు నాలుగు, షబాజ్‌కు మూడు వికెట్లు దక్కాయి. కాగా, ఎస్‌సీఏ పిచ్ బ్యాటింగ్‌కు మరింత కఠినతరంగా మారుతుండడంతో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ స్కోరును దాటాలంటే బెంగాల్ బ్యాట్స్‌మెన్ స్థాయికి మించి రాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

